ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 12.04.2026 | సంపుటి : 12 సంచిక : 263 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



భారీ ప్యారాచూట్‌ల సాయంతో కాలిఫోర్నియా సమీపంలోని పసిఫిక్ మహాసముద్రం శాన్‌డియాగో తీరంలో ల్యాండవుతున్న ఒరాయన్ క్యాప్సుల్

# జాబిల్లిని చుట్టేసి క్షేమంగా భూమికి..

## విజయవంతమైన ఆర్టెమిస్-2 యాత్ర

**వాషింగ్టన్(జనంసాక్షి):** విజయవం తంగా చంద్రుడిని చుట్టేసిన ఆర్టెమిస్-2 తిరిగి భూమికి చేరుకుంది. కాలిఫోర్నియా సమిాపంలోని పసిఫిక్ మహాస ముద్రం శాన్‌డియాగో తీరంలో వ్యోమగాముల ఒరాయన్ క్యాప్సుల్ ల్యాండ్ అయింది. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 5.38 గంట లకు వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకున్నారు. **మిగతా 2లో..**

- అమెరికాలోని కాలిఫోర్నియా సమీపంలోని శాన్‌డియాగో తీరంలో ల్యాండైన వ్యోమగాముల ఒరాయన్ క్యాప్సుల్
- ఆస్ట్రోనాట్స్‌కు అభినందనలు తెలిపిన ట్రంప్


ఓరాయెల్ వ్యోమనౌక క్యాప్యుల్ నుంచి బయటకు వచ్చిన వ్యోమగాములు క్రిస్టినా కోచ్, జెరెమిా హాన్సన్, రీడ్ వైస్‌మాన్, విక్టర్ గ్లోవర్ →






# పాక్ వేదికగా శాంతి చర్చలు

- ఒప్పందం కుదిరితే శాంతి.. విఫలమైతే మళ్లీ యుద్ధమే
- ఇరాన్‌లో నిజాయతీ ఎంత ఉందో గమనిస్తాం :ట్రంప్
- చర్చలవేళ హర్మూజ్‌ను దాటిన అమెరికా యుద్ధనౌకలు!



పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా ప్రారంభమైన అమెరికా-ఇరాన్ శాంతి చర్చల్లో భాగంగా సమావేశంమైన ఇరు దేశాల ప్రతినిధులు



అమెరికా, ఇరాన్ శాంతి చర్చల్లో పాల్గొనేందుకు ఇస్లామాబాద్ చేరుకున్న అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

**ఇస్లామాబాద్(జనంసాక్షి):**

యూఎస్, ఇరాన్‌ల మధ్య ఇస్లామాబాద్ వేదికగా చర్చలు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. చర్చలకు ముందే ఇరాన్ పలు షరతులు విధించిందన్న వార్తల నేపథ్యంలో దాదాపు ఐదు గంటల ఆలస్యంగా చర్చలు ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లో నిజాయతీ ఎంత ఉందో గమనిస్తుంటానని అన్నారు. చర్చల ఫలితం ఎలా ఉంటుందో తాను చెప్పలేనని కూడా అన్నారు. ఈ సందర్భంగా ఇరాన్‌పై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఇరాన్‌ను విఫలమవుతున్న దేశంగా అభివర్ణించారు. దౌత్యం విఫలమైతే యూఎస్ తన పంథాను పూర్తిగా మార్చుకుంటుందని అన్నారు. ఇరాన్‌తో మరింత కఠినంగా వ్యవహరించే అవకాశం ఉందని పరోక్షంగా సంకేతాలిచ్చారు. 'సమిాప భవిష్యత్తులోనే హోర్ముజ్ తెరుచుకు ంటుంది' అని కూడా చెప్పారు. హోర్ముజ్‌కు ప్రత్యామ్నాయాలు ఉన్న విషయాన్ని కూడా ప్రస్తావించారు. ఇక యూఎస్‌తో తమ ప్రభుత్వ చర్చలు కొనసాగుతాయని ఇరాన్ ప్రభుత్వ మీడియా లోనూ వార్తలు వెలువడ్డాయి. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం, ఇస్లామాబాద్‌లో దిగాక కూడా వాన్స్ బృందం ఇరాన్‌తో చర్చలు ప్రారంభించలేదు. ఇరాన్ విధించిన షరతులు, పరస్పర అపనమ్మకం కారణంగా చర్చలు ఆలస్యంగా ప్రారంభమైనట్టు సమాచారం. నేరుగా చర్చలు జరపడం సాధ్యం కాని పక్షంలో పాక్ మధ్యవర్తిగా త్రైపాక్షిక చర్చలు జరిగే అవకాశం ఉన్నట్టు కూడా అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. **మిగతా 2లో..**

## రష్యా,సౌదీ అరేబియా కంటే మా వద్దే నాణ్యమైన చమురు

- అమెరికా తీరానికి భారీ సంఖ్యలో ఖాళీ ట్యాంకర్లు వస్తున్నాయి
- ఇరాన్‌తో శాంతి చర్చలకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యలు



## హోర్మూజ్ దాటిన మరో భారత ఎల్‌పీజీ ట్యాంకర్

కాల్పుల విరమణ తరవాత తీరానికి చేరుకున్న తొలి నౌక

వివరాలు 2వ పేజీలో..

## తమిళనాడులో కాంగ్రెస్ గెలుపునకు బహుముఖ వ్యూహం

### చెన్నై నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పరిశీలకుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**చెన్నై(జనంసాక్షి):** ఈ నెల 23 న తమిళనాడులో జరగనున్న శాసనసభ ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు బహుముఖ వ్యూహం రూపొంది స్తున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉ త్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అందుకు అనుసరించాల్సిన విధి విధానాలను రూపొందించి ఎన్నికల బరిలో విజయం సాధించే దిశగా ప్రణాళికలు రూ పొందించినట్లు ఆయన వెల్లడించారు. తమిళనాడు,పుదుచ్చేరి రాష్ట్రలలో జరు గుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకుడిగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని నియమించిన విషయం విదితమే. ఆరుసార్లు ఎమ్మెల్యేగా లోకసభ సభ్యుడిగా ఒకసారి ఎన్నికకావడంతో పాటు పి.సి.సి అధ్యక్షుడిగా పనిచేసిన అపార అనుభవాన్ని దృష్టిలో పెట్టుకున్న ఏ.ఐ సి.సి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సీనియర్ పరిశీలకుడిగా స్టార్ క్యాంపెయన్ గా నియమిస్తూ ఇటీవల పార్టీ అధిష్టానం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తమిళనాడు రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో తెలంగాణా రాష్ట్రం నుండి **మిగతా 2లో..**



## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

### అధికారికంగా ప్రకటించిన ఇంటర్మీడియట్ బోర్డు

**హైదరాబాద్,ఏప్రిల్11(జనంసాక్షి):** తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్న ట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్‌ని నేరుగా తమ వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా రాష్ట్ర ప్రభు త్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌ల లో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

## డీజిల్, విమాన ఇంధన ఎగుమతులపై సుంకాలు పెంపు

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** డీజిల్, విమాన ఇంధనం ఎగుమ తులపై సుంకాలను పెంచుతూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ ఎగుమతి సుంకంలో మాత్రం ఎ లాంటి మార్పులు లేవని ప్రకటించింది. పశ్చిమా సి యా సంక్షోభం వల్ల అంతర్జాతీయ చమురు ధర ల్లో అస్థిరత, దేశీయ అవసరాల **మిగతా 2లో..**

## తప్పుడు ప్రచారం చేశారో జాగ్రత్త!

- చెప్పు తెగుద్దని మండిపడ్డ మంత్రి సీతక్క
- పారదర్శకంగానే మేడారం గద్దెల నిర్మాణం
- సెల్‌ఫోన్ కొనుగోళ్లపైనా విమర్శలు సరికాదు
- అవినీతిపై ఆధారాలు ఉంటే చూపాలని డిమండ్



**ములుగుప్రతినిధి(జనంసాక్షి):** అంగన్వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరి గిందన్న దుష్ప్రచారాన్ని మంత్రి సీతక్క ఖండిం చారు. ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకా లపై తప్పుడు ప్రచారం చేస్తే.. చెప్పు తెగుతదని హెచ్చరిం చారు. ములుగులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లా డుతూ.. అంగన్వాడీ టీచర్లకు రూ.11, 650కు ఫోన్లు కొంటే.. రూ.14వేలు అని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడారం పునర్నిర్మాణం పనుల్లో అవినీతికి తావులేదన్న సీతక్క.. ఆధారాలు ఉంటే చూపాలని సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలన్నారు.


**పారదర్శకంగానే మేడారం గద్దెల నిర్మాణం**

మేడారం సమ్మక్క- సారక్క అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడ అవినీతి జరగలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్దదెల పున: నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని అంటున్నారని.. **మిగతా 2లో..**

## దక్షిణాదిని బలహీనపరిచేందుకు మోదీ కుట్ర

### ఉత్తరాదిలో భారీగా ఎంపీ సీట్లు పెంచుకునేందుకు ప్రణాళికలు

- నియోజకవర్గాల పునర్విభజనలో అంతరం
- 2011 జనాభా లెక్కల ఆధారంగా ప్రక్రియ నిర్వహించడం సరికాదు
- 42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్రం వద్దే పెండింగ్
- బీసీ సబ్ ప్లాన్ అంశంపై ఆలోచన చేస్తాం
- రవీంద్రభారతిలో పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్(జనంసాక్షి):** కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసు కోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన రవీంద్ర భారతి తో ఏర్పాటు చేసిన మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడు కల సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసం గించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మా ట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్ర మే పరిగణలో తీసుకొని నియోజకవర్గాల పునర్వి భజన చేపడితే దక్షిణాది అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని తెలిపారు. కుల గణన చేయకుండా నియోజకవర్గాల విభ జన చేపడితే ఫలితం మరోరకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకు తున్నాయని, కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రా నికి వెళితే తిరిగి రాష్ట్రానికి 37 పైసలు మాత్రమే వస్తుందని, తమిళనాడు నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 29 పైసలు, కేరళ నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 61 పైసలు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. అదే ఉత్తరాది బీహార్ నుంచి కేంద్రానికి రూపాయి వెళితే తిరిగి కేంద్రం నుంచి **మిగతా 2లో..**



## అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

- రేవంత్ అహంకారానికి ప్రజలే బుద్ధి చెబుతారు
- ఫోర్త్ సిటీ ఒక పెద్ద డ్రామా..
- తన కుటుంబ సభ్యులకు అప్పనంగా భూములు కట్టబెట్టేందుకు కుట్ర
- నిషేధిత భూముల జాబితాతో బ్లాక్ మెయిల్ రాజకీయాలు
- ఎప్పుడు ఎన్నికలొచ్చినా కేసీఆరే మళ్లీ సీఎం
- నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం
- ఇబ్రహింపట్నం కార్యకార్యర్తల భేటీలో కేటీఆర్

**రంగారెడ్డి ప్రతినిధి(జనంసాక్షి):** ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రో జుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజ కవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్ని కలే జరుగుతయని నాకు విశ్వాసం ఉందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి అని అడగండి. రైతన్నల **మిగతా 2లో..**

## పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్‌తో మోదీ మాటామంతి

### వెనక్కి వచ్చి మరీ కాంగ్రెస్ అగ్రనేతతో మాట్లాడిన ప్రధాని



పార్లమెంట్ ప్రాంగణంలో శనివారం ఉదయం ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ఎప్పుడూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకొనే ప్రధానమంత్రి మోదీ- కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీతో కొద్దిసేపు ముచ్చటించారు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జ్యోతిబా ఫులే జయంతి సందర్భంగా నివాళులర్పించేందుకు రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు నాయకులు పార్లమెంట్ ప్రాంగణంలోని ప్రేరణా స్థల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభాపక్ష నేత జేపీనడ్డా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర నేతలను మోదీ పలకరించి, ముందుకువెళ్లారు. మళ్లీ వెనక్కి వచ్చి రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రస్తుతం పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. భాజపా, కాంగ్రెస్ పార్టీలు ఒకదానిపై ఒకటి తీవ్ర విమర్శలు చేసుకుంటున్న ఈ సమయంలో వీరిమధ్య చోటుచేసుకున్న ఈ చిన్నపాటి సంభాషణ ఆకట్టుకుంటోంది.

## తృణమూల్‌కు ఓటమి భయం

- బెంగాల్‌లో మాకు పెరుగుతున్న ప్రజాదరణను చూసి బీజేపీపై దాడులకు తెగిస్తున్నారు
- బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోడీ

2 లో..

## ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కు

- నా అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు కుట్ర
- బెంగాల్ ఎన్నికల ప్రచారసభలో బీజేపీపై మమతా బెనర్జీ విమర్శలు



## అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

- భారీ బందోబస్తు మధ్య ఆక్రమ కట్టడం కూల్చివేత
- ఐలాపురంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై స్టే లేదు: రంగనాథ్

**అమీన్‌పూర్(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను కూల్చి వేస్తోంది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ఈ భారీ ఆ పరేషన్‌ను నిర్వహిస్తోంది. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా.. నిర్మాణాలు జరిపిన ఓ గెస్ట్ హౌస్‌తో పాటు, ఆరు అంతస్తుల భవనాన్ని హైడ్రా కూల్చివే స్తోంది. ఐలాపురం తండాతో పాటు గ్రామంలోని **మిగతా 2లో..**



# పూలేకు సీఎం ఘన నివాళి

**మహాత్మజ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఢిల్లీలోని నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆమహనీయుడి ఔన్నత్యాన్ని గుర్తు చేసుకున్నారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎంపీ మల్లు రవి కూడా నివాళులు అర్పించారు.**

# అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్


పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా ఖాళీ స్థలాలను హైడ్రా స్వాధీనం చేసుకుటోంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపురం గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే చాలా నివాసాలు వెలిశాయి. ఆ నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 860 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టింది. 863 ఎకరాల భూమి విలువ రూ.15 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఇక్కడ యథాతథ స్థితిని కొనసాగించాలని 1998 నుంచి కోర్టు ఆర్డర్లున్నా పట్టించుకోకుండా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా తొలగించింది. అలాగే ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని తొలగిస్తోంది. ఐలాపురం తండాలో కానీ, గ్రామంలోని నివాస గృహాల జోలికి కానీ వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. కేవలం అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాలు, ఖాళీ స్థలాల స్వాధీనంపైనే దృష్టి సారించినట్లు తెలిపారు. 1998 నుంచి 'స్టేటస్ కో' కొనసాగించాలని కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ, వాటిని ఖాతరు చేయకుండా ముఖిమ్ నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా నేలమట్టం చేసింది. అలాగే అతని సోదరుడు అజీమ్ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని కూడా అధికారులు తొలంచారు. ఐలాపూర్ గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే అనేక నివాసాలు వెలిశాయి. మిగిలి ఉన్న 860 ఎకరాల ఖాళీ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా హైడ్రా ఈ ఆపరేషన్ చేపట్టింది. ఈ భూమి విలువ సుమారు రూ.15 వేల కోట్ల పైమాటే ఉందని అంచనా. కూల్చివేతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులను మోహరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులు మోహరించారు. హైడ్రా చేపట్టిన ఈ భారీ ఆపరేషన్ వల్ల వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడగలిగారు.

**ఐలాపురంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై స్టే లేదు: రంగనాథ్**

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపురంలో హైడ్రా కూల్చివేతలపై కమిషనర్ రంగనాథ్ స్పందించారు. ఐలాపురం భూములపై 1998లో హైకోర్టు స్టేటస్ కో ఉందని, ప్రభుత్వ భూములను ఆక్రమించి ముఖీమ్ అనే వ్యక్తి ఫాంహౌస్ నిర్మించుకున్నాడని చెప్పారు. "ఫాంహౌస్ కేంద్రంగా ప్రభుత్వ భూమి కబ్జాకు పాల్పడ్డాడు. 2006లో నిర్మించిన ఫాంహౌస్‌ను ఇప్పుడు 40 ఎకరాలకు విస్తరించాడు. 20 ఏళ్లుగా ముఖీమ్ తన అనుచరులతో కలిసి భూదందా చేస్తున్నాడు. ప్రభుత్వ భూములను ప్లాట్లుగా విక్రయించి రూ.కోట్లు సొమ్ము చేసుకున్నాడు.ముఖీమ్ 100 గజాలకు రూ.10 లక్షల చొప్పున పేదలకు విక్రయించాడు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ భూ అక్రమాలకు పాల్పడ్డాడు. ఐలాపురం అక్రమ నిర్మాణాల కూల్చివేతపై హైకోర్టు ఎలాంటి స్టే ఇవ్వలేదు. సామాజిక మాధ్యమాల్లో హైడ్రా కూల్చివేతలపై తప్పుగా ప్రచారం చేస్తున్నారు" అని రంగనాథ్ అన్నారు. శనివారం భారీ పోలీస్ బందోబస్తు మధ్య హైడ్రా కూల్చివేతలు చేపట్టిన సంగతి తెలిసిందే. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి భారీ ఆపరేషన్ నిర్వహించింది. ముఖీమ్ అనే వ్యక్తి అక్రమంగా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని కూల్చివేసింది.

# జాబిల్లిని చుట్టేసి క్షేమంగా భూమికి..

దీంతో పది రోజు ల యాత్ర విజయవంతంగా పూర్తయింది. భూమి నుంచి అత్యంత దూరం ప్రయాణించిన మానవసహిత అంతరిక్ష యాత్రగా ఆర్టెమిస్-2 రికార్డు సృష్టించింది.చంద్రుడి వద్దకు మానవులను పంపే ఉద్దేశంతో అమెరికా అంతరిక్ష సంస్థ - నాసా ఈనెల 1న ఈ ఆర్టెమిస్-2ను ప్రయోగించింది. ఈ యాత్రలో అమెరికా వ్యోమగాములు రీడ్ వైస్‌మాన్, విక్టర్ గ్లోవర్, క్రిస్టినా కోచ్, కెనడాకు చెందిన జెరెమీ హాన్సన్‌లు పాల్గొన్నారు. ఇప్పటివరకు మానవులెవరూ వెళ్లలేని 4,06,771 కిలోమీటర్ల దూరానికి వీరు ప్రయాణించారు. అపోలో-13 రికార్డును కూడా ఈ ఆర్టెమిస్ బద్దలు కొట్టింది. ఈ యాత్రలో చంద్రుని అవతలి వైపు దృశ్యాలు, సంపూర్ణ సూర్యగ్రహణం వంటి వాటిని క్లిక్‌మనిపించారు. ఈ క్రమంలో తాజాగా పుడమికి చేరుకున్నారు.



**ట్రంప్ అభినందనలు..**

ఆర్టెమిస్2 విజయవంతంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ట్రూత్ సోషల్ వేదికగా సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. 'మొత్తం ప్రయాణం అద్భుతంగా సాగింది. ల్యాండింగ్ పరిపూర్ణంగా జరిగింది. త్వరలో మీ అందరినీ వైట్‌హౌస్‌లో కలుసుకోవాలని ఎదురుచూస్తున్నా. మన తదుపరి అడుగు.. అంగారక గ్రహం' అని ట్రంప్ రాసుకొచ్చారు.

**ఉష్ణకవచంపై ఉత్కంఠ**

ఆర్టెమిస్ మిషన్‌ను ఈ నెల 1న ఫ్లోరిడాలోని అంతరిక్ష కేంద్రం నుంచి నాసా ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ యాత్రలో భాగంగా వారు భూమి నుంచి మానవులెవ్వరూ వెళ్లనంత దూరానికి (4,06,771 కిలోమీటర్లు) వెళ్లారు. చందమామ వెనుక భాగానికి వెళ్లి, తిరిగి పుడమి దిశగా పయనమయ్యారు. జాబిల్లిపై అనేక ప్రాంతాలను ఫొటో తీశారు. రోదసి నుంచి సంపూర్ణ సూర్యగ్రహణాన్ని కూడా వీక్షించారు.

**ఆలస్యం కాకుండా...**

భూవాతావరణంలోకి తిరిగి ప్రవేశించడానికి (రీ ఎంట్రీ) ముందు ఒరాయన్ వ్యోమనౌక ప్రయాణమార్గంలో చిన్నపాటి సర్దుబాట్లు చేస్తారు. తద్వారా అది సరైన కోణంలో భూవాతావరణంలోకి ప్రవేశించేలా చూస్తారు. ఫలితంగా గంటకు 38,300 కిలోమీటర్ల వేగంతో భూవాతావరణంలోకి ఒరాయన్ ప్రవేశించింది దీనివల్ల వ్యోమనౌక తీవ్రస్థాయిలో వాతావరణ రాపిడికి గురవుతుంది. ఫలితంగా అది 2,760 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను ఎదుర్కొంటుంది. దీన్ని తట్టుకునేందుకు ప్రత్యేక ఉష్ణ రక్షణ కవచాన్ని ఇంజినీర్లు ఏర్పాటు చేశారు. 2022లో ఆర్టెమిస్-1లో భాగంగా మానవరహితంగా ఒరాయన్‌ను పరీక్షించినప్పుడు రీ ఎంట్రీ వేడికి ఊహించినదాని కన్నా ఎక్కువగా ఉష్ణకవచం దెబ్బతింది. అయితే ఆర్టెమిస్-2లో ఈ కవచాన్ని మార్చడానికి బదులు.. వ్యోమనౌక భూవాతావరణంలోకి తిరిగి ప్రవేశించే కోణంలో మార్పును నాసా చేపట్టింది. తద్వారా అది ఎదుర్కొనే వేడి తాకిడిని తగ్గేలా చూసింది. ఉష్ణ కవచాన్ని మళ్లీ డిజైన్ చేయడానికి మరింత సమయం పడుతుందని, అంతకాలం పాటు ఆర్టెమిస్-2 యాత్ర ఆలస్యం కాకుండా చూడటానికి ఈ సర్దుబాటు చేసింది.

# పాక్ వేదికగా శాంతి చర్చలు

**5గంటలు ఆలస్యంగా మొదలైన చర్చలు**

అంతకుముందు చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం తాజాగా ఇస్లామాబాద్‌లో ల్యాండ్ అయ్యింది. వాన్స్ నేతృత్వంలోని ఈ బృందంలో పశ్చిమాసియా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్, అధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ ఉన్నారు. యూఎస్ ఎయిర్‌ఫోర్స్ సి-32ఏ విమానంలో వీరు ప్రయణించారు. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో విమానం ఇరాన్ గగనతలాన్ని తప్పించుకొని ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇస్లామాబాద్‌కు చేరుకుంది. ఇక, ఇరుదేశాలు నిర్మాణాత్మకంగా చర్చలు జరుపుతాయని, ఇకనైనా యుద్ధానికి శాశ్వత శాంతి లభిస్తుందని ఈ సందర్భంగా పాక్ ఆశాభావం వ్యక్తంచేసింది. ఈ క్రమంలో పాకిస్థానీ ఎఫ్-16 యుద్ధ విమానాలు ఆయన విమానానికి రక్షణగా వెళ్లాయి. ఇస్లామాబాద్ సమీపంలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌లో సి-32ఏ విమానం ల్యాండ్ అవడానికి ముందు.. పాక్ గగనతలంలో ఐదు ఎఫ్-16 విమానాలు రక్షణగా వెళ్తున్న వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. అమెరికాతో చర్చలకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాఘర్ ఘాలిబఫ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఇప్పటికే ఇస్లామాబాద్‌కు చేరుకొంది. చర్చలు మొదలవడానికి ముందు ఇరుదేశాల ప్రతినిధి బృందాలు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో విడివిడిగా సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. మరికొద్దిసేపట్లో ఈ చర్చలు ప్రారంభం కానున్నట్లు పాక్ వర్గాలు వెల్లడించాయి.

**చర్చలవేళ హర్మూజ్‌ను దాటిన అమెరికా యుద్ధనౌకలు!**

పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభానికి ముగింపు పలికే లక్ష్యంతో అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు కొనసాగిస్తున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన రెండు యుద్ధనౌకలు హర్మూజ్ జలసంధిని దాటినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇరాన్‌తో యుద్ధం మొదలైన తర్వాత అమెరికా నౌకలు హర్మూజ్‌ను దాటడం ఇదే తొలిసారి. ఈ జలసంధిని తెరిచే ప్రయత్నం చేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసు కుంది.మరోవైపు, హర్మూజ్‌ను తెరిచే ప్రయత్నం చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. చైనా, జపాన్, ఫ్రాన్స్ వంటి దేశాలకు సాయం చేస్తున్నామన్నారు. స్వతహాగా ఈ పనిచేసే ధైర్యం ఆయా దేశాలకు లేదని విమర్శించారు. అత్యంత కీలకమైన ఈ జల సంధిలో ఇరాన్ అమర్చిన మందుపాతరలతో (సీమైన్స్) ముప్పు ఉందన్నారు. అయినప్పటికీ, ఈ యుద్ధంలో ఇరాన్ భారీగా నష్టపోతోందని ఉద్ఘాటించారు.

# రష్యా,సౌదీ అరేబియా కంటే మా వద్దే నాణ్యమైన చమురు

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్‌తో శాంతి చర్చలకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు అతిపెద్ద చమురు ఆర్థిక వ్యవస్థలైన రష్యా, సౌదీ అరేబియా కంటే తమ వద్దే ఎక్కువ చమురు ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన చమురు, గ్యాస్‌ను నింపుకోవడానికి ప్రపంచ దేశాలకు చెందిన అనేక ఖాళీ చమురు ట్యాంకర్లు అమెరికా తీరం వైపు వస్తున్నాయని పేర్కొన్నారు. 'మేము మీకోసం ఎదురు చూస్తున్నాం.. త్వరితగతిన స్పందించండి' అంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడికైనా చమురు ఎగుమతి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరుదేశాల మధ్య చర్చలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో ఇరాన్ అమెరికాకు పలు షరతులు విధిస్తుండడంతో కాల్పుల విరమణ ప్రయత్నాలు ఆలస్యమవుతున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్‌కు వచ్చి నాలుగు గంటలకు పైగా అయినప్పటికీ, ఇరాన్ ప్రతినిధులతో ఇంకా ప్రత్యక్ష చర్చలు జరపలేదు. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఇప్పటికే వాన్స్‌తో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఇరాన్ అధికారుల బృందం పాక్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ, స్తంభింపజేసిన ఇరాన్ నిధుల విడుదల అనే రెండు షరతులను ఇరాన్ అమెరికా ముందు ఉంచింది. అవి అమలైతేనే చర్చలు జరుగుతాయని స్పష్టం చేసింది.

# డీజిల్, విమాన ఇంధన ఎగుమతులపై సుంకాలు పెంపు

దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. డీజిల్‌పై ఎగుమతి సుంకాన్ని లీటరుపై రూ.21.5 నుంచి రూ.55.5కు పెంచిన కేంద్రం.. ఏటీఎఫ్ పైనా ఎగుమతి సుంకాన్ని లీటరుకు రూ.29.5 నుంచి రూ.42కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.



# హోర్మూజ్ దాటిన మరో భారత ఎల్‌పీజీ ట్యాంకర్

**కాల్పుల విరమణ తరవాత తొలి నౌక రాక**

న్యూఢిల్లీ(జనంసాక్షి):యూఎస్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక తొలిసారిగా ఒక భారత రిజిస్టర్డ్ నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఎల్‌పీజీతో బయలుదేరిన జగ్ విక్రమ్ నౌక శుక్రవారం రాత్రి జలసంధిని దాటినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో, మార్చి నుంచి ఇప్పటివరకూ హోర్ముజ్‌ను దాటిన భారత సరకు రవాణా నౌకల సంఖ్య 9కి చేరింది. అంతేకాకుండా, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. ఇవి కూడా త్వరలో హోర్ముజ్‌ను దాటనున్నట్టు తెలుస్తోంది. శనివారం మధ్యాహ్నానికి జగ్ విక్రమ్ నౌక హోర్ముజ్‌కు తూర్పున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో ప్రయాణిస్తోంది. ఈ నౌకలో సుమారు 20 వేల టన్నుల ఎల్‌పీజీ ఉన్నట్టు సమాచారం. మధ్యస్థాయి సరకు రవాణా సామర్థ్యం కలిగిన ఈ నౌక ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ కంపెనీకి చెందినది. మరికొన్ని రోజుల్లో ఈ నౌక భారత్‌కు చేరుకుంటుంది. గల్ఫ్‌లో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచీ అనేక నౌకలు హోర్ముజ్‌కు పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో నిలిచిపోయాయి. జగ్ విక్రమ్‌తో పోలిస్తే రెండింతల సామర్థ్యం ఉన్న గ్యాస్ క్యారియర్లు కూడా వీటిల్లో ఉన్నాయి. ఇక ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోని భారత నౌకల్లో ఒక ఎల్‌పీజీ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్‌జీ క్యారియర్, ఒక కెమికల్ ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటెయినర్ ట్యాంకర్లు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయి. వీటితో పాటు కొన్నింటికి మరమ్మతులు జరుగుతున్నట్టు సమాచారం.



# తమిళనాడులో కాంగ్రెస్ గెలుపుకు బహుముఖ వ్యూహం

**మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలను స్టార్ క్యాంపేయనర్ లూగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నియమించింది.అందులో భాగంగా శనివారం చెన్నై కేంద్రంలో నియోజకవర్గ స్థాయి పార్టీ పరిశీలకులతో ఆయన సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రచార వ్యూహం, సమన్వయం తో పాటు పార్టీ సంస్థాగత పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై తనతో పాటు ఎన్నికల పరిశీలకులుగా నియమితులైన ముఖుల్ వాస్నిక్,ఖాజా మోహినోద్దీన్ లతో కలసి సమీక్షించినట్లు ఆయన తెలిపారు. పొత్తులో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి అవసరమైన మార్గదర్శనం గురుంచి నియోజకవర్గ స్థాయి పరిశీలకులతో చర్చించినట్లు ఆయన తెలిపారు.నియోజకవర్గ పార్టీ యంత్రాంగాన్ని రాష్ట్ర స్థాయి నాయకత్వంతో సమన్వయం చేయడం క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# బీఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్ రెడ్డి తప్పు చేశారు

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**

ములుగు(జనంసాక్షి):కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరి మాజీ మంత్రి జీవన్ రెడ్డి తప్పుచేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆర్ఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు. శనివారం ములుగు జిల్లాలో మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే బిఆర్ఎస్‌లోకి వెళ్లిన వారి గతి ఏమయ్యిందో చూశామని అన్నారు. బిఆర్ఎస్‌లో కుటుంబానికే ప్రాధాన్యమని అన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. ఉన్నఫలంగా ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 100స్థానాల్లో గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దశా, దిశా లేకుండా పదేళ్లు కేసీఆర్ పరిపాలన చేశారని, రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు.

# తృణమూల్‌కు ఓటమి భయం

- అందుకే బీజేపీపై దాడులకు తెగిస్తున్నారు
- బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోదీ

**కోల్‌కతా(జనంసాక్షి):**పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భయాందోళనలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం రాష్ట్రంలో జరిగిన ఒక బహిరంగ సభలో పాల్గొన్న మోదీ, ప్రస్తుత అధికార పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం భయాందోళనలకు గురవుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే టీఎంసీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పూర్వ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. 'పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం. అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తాం. ప్రతి టీఎంసీ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు అమలు అవుతున్న పథకాలను బీజేపీ అడ్డుకోదు. మేం అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తాం' అని అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# ఈసీతో బీజేపీ కుమ్మక్కు

**కోల్‌కతా(జనంసాక్షి):**ఎన్నికల కమిషన్‌తో బీజేపీ కుమ్మక్కై భవనాపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు ప్రయత్నించినట్లు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. పశ్చిమ మేదినిపూర్ జిల్లాలోని కేషియారిలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె మాట్లాడుతూ, తనపై తప్పుడు కేసులు బనాయించడం ద్వారా భవనాపూర్ నుంచి తన అభ్యర్థిత్వాన్ని చెల్లకుండా చేసేందుకు బీజేపీ ప్రయత్నించిందని అన్నారు. అయితే ఆ పార్టీ గేమ్ ప్లాన్‌ను టీఎంసీ కార్యకర్తలు, ప్రజలు భగ్నం చేశారని తెలిపారు. భవనాపూర్‌లో మమతా బెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీలో ఉన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమయంలో 90 లక్షల మంది పేర్లను బీజేపీ బలవంతంగా తొలగించిందని మమతా బెనర్జీ ఈ సందర్భంగా ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు గెలవలేక తప్పుడు మార్గాల ద్వారా ఓట్లను రాబట్టుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఆ కారణంగానే లక్షలాది ఓటర్లను వాళ్లు తొలగించారని, ఫలితాలు తమకు అనుకూలంగా ఉండేలా ఈవీఎంల ట్యాంపరింగ్ చేసే ఆలోచనలో కూడా ఉన్నారని అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

# దక్షిణాదిని బలహీనపరిచేందుకు మోదీ కుట్ర

ఆ రాష్ట్రానికి 6.53 రూపాయలు వెళుతున్నాయని, ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి పన్నుల వాటాల రూపంలో 2.17 రూపాయలు వెళుతున్నాయని డిప్యూటీ సీఎం వివరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల జరుగుతున్న వివక్ష, కేంద్రం ఉద్యమాలను కట్టడి చేస్తున్న తీరు, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఇటీవల పెద్ద ఎత్తున చర్చ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఓుయోజకవర్గాల పునర్విభజనలో కుల గణన ను పరిగణలోకి తీసుకోకపోతే యావత్ భారత దేశంలోని బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని, మనకోసం మనం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రజా ప్రభుత్వం బడ్జెట్లో పెద్ద ఎత్తున ప్రజలే కేంద్రంగా నిధులు కేటాయించింది ఇదే జరిగితే తమకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని భావించి రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకికరణ ప్రయత్నం జరుగుతుందని డిప్యూటీ సీఎం హెచ్చరించారు. బహుజనులు ఏకం కావాలి ప్రజా ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ అమల్లోకి తీసుకువచ్చింది బీసీ సబ్ ప్లాన్ డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆలోచన చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. అంతరాలు లేని సమాజం కోసం జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి, జనాభా దామాషా ప్రకారం నిధులు ఖర్చు చేసినప్పుడే సకల సమస్యలకు పరిష్కారం



లభిస్తుందని తెలిపారు. సామాజిక న్యాయం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎన్ని అవాంతరాలు వచ్చినా నిటారుగా నిలబడుతుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. భారతదేశంలో కులం అనేది వాస్తవం అధికారంలోకి రాగానే కుల సర్వే చేపడతామని మా నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ప్రకటించారు ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుల సర్వే చేసి రాష్ట్రంలో 56? మంది బీసీలు ఉన్నారని తమ ప్రభుత్వం లెక్క కట్టి చెప్పిందని తెలిపారు. వంద సంవత్సరాల క్రితం బ్రిటిష్ వారు కుల సర్వే చేశారు ఆ తర్వాత దేశంలో కుల సర్వే చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. కుల సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి బిల్లును గవర్నర్ కు పంపాం, ఆయన కేంద్ర ప్రభుత్వానికి పంపగా అక్కడ బిల్లు పెండింగ్ లో ఉందని తెలిపారు. మహాత్మ పూలే ఆలోచనలను ఏ చిన్న అవకాశం దక్కిన, ప్రతి సందర్భంలో పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కుల వివక్ష, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కుంగిపోకుండా తట్టుకొని నిలబడాలి అని ఆచరించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలబడ్డారు అందుకే మహాత్మా పూలే మహానుభావుడు అయ్యారు అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఓసి అన్ని వర్గాల పిల్లలు 12వ తరగతి వరకు ఒకే చోట చదువుకునేలా అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే 40 శాతం డైట్ 200శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామని, మన బిడ్డలు ఎవరు అర్ధాకలితో ఉండకూడదనే మంచి ఉద్దేశంతో ప్రతిరోజు నాణ్యమైన డైట్ ను అందించడమే కాదు వాటిని పర్యవేక్షించేందుకు చీఫ్ సెక్రటరీ నుంచి మండల స్థాయి అధికారి వరకు సీఎం నుంచి సర్పంచి వరకు గురుకులాలు సంక్షేమ వసతి గృహాలు సందర్శించాలి అవసరమైతే అక్కడే నిద్రించాలని నిబంధన పెట్టి ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటున్నట్టు డిప్యూటీ సీఎం వివరించారు. జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే 20 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం పథకం ప్రారంభిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో 15 కోట్లతో సకల సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఉచితంగా విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు.

# తప్పుడు ప్రచారం చేశారో జాగ్రత్త!

ఆధారాలు ఉంటే చూపించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలని సూచించారు.శనివారం ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. మహేశ్ గౌడ్‌కు గట్టమ్మ దేవాలయం వద్ద మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గట్టమ్మ దేవాలయంలో మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టమ్మ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా ములుగు పట్టణ కేంద్రానికి నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.నాపై తప్పుడు ప్రచారం చేశారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో తనను ఓడించేందుకు రూ.వందల కోట్లు ఖర్చుచేశారని, తనపై తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనను ప్రలోభాలకు గురిచేశారని.. అయినా తాను వారికి లొంగలేదని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరిగిందని... అవినీతి సీతక్క అంటున్నారని.. జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. తానెక్కడా అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రూ.11,650లకు ఫోన్లు కొంటే.. రూ.14000వేలని ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహించారు.ఇష్టానుసారంగా ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం.. చట్టపరమైన చర్యలు తప్పవు. దమ్ముంటే మీ ఆరోపణలు నిరూపించండంటూ సవాల్ విసిరారు. ములుగులో పోషణ పక్వాడ సందడి కార్యక్రమాన్ని ప్రారంభించారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల పరిస్థితి అత్యంత దయనీయమన్నారు సీతక్క. కరెంటు లేదు, తాగునీరు లేదు, కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,500 అంగన్‌వాడీలకు భవనాలే లేకపోయినా నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్పు మొదలైందదన్నారు. ఇప్పటికే రెండు వేల కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. కేవలం పౌష్టికాహారం అందించడమే కాదు.. అంగన్‌వాడీలను సకల సౌకర్యాలతో 'ప్రీ-ప్రైమరీ స్కూల్స్'గా తీర్చిదిద్దుతుంటే.. అది ఓర్వలేక కొన్ని పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు సీతక్క. ఇక సెల్ ఫోన్ల కొనుగోలుపై క్లారిటీ ఇస్తూ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఐదుగురు నిపుణులైన అధికారుల కమిటీ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా టెండర్లు నిర్వహించామని స్పష్టం చేశారు. విమర్శలు పక్కన పెట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని సీతక్క చెప్పారు.

# అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుం టున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మీదికెళ్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి..ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగొట్టుకున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మీకే తెలుసనన్నారు కేటీఆర్. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్య మనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి కూడా రైతులకు మొక్కాలే.. తడ్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.

# హైవేపై వాహనాలే టార్గెట్

**డీజిల్ దొంగల ముఠా అరెస్ట్**

- వేయి లీటర్ల డీజిల్ సహా వాహనాలు స్వాధీనం




**నల్గొండ, ఏప్రిల్11 (జనంసాక్షి) :** రోడ్డుపక్కన నిలిపి ఉంచిన వాహనాల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు అంతరాష్ట్ర దొంగల ముఠాను నల్గొండ పోలీసులు పట్టుకున్నారు. నిందితులలో ఓ మైనర్ కూడా ఉన్నాడు. ఆ ముఠా నుంచి 1000 లీటర్ల డీజిల్ సహా.. రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా డీజిల్ దొంగతనాల కేసులు ఉన్నట్లు జిల్లా అదనపు ఎస్పీ జి.రమేష్ వెల్లడించారు. హైవేలపై ఆగి ఉన్న వాహనాలే లక్ష్యంగా అర్ధరాత్రి డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ జి. రమేష్ శనివారం మీడియా సమావేశంలో ఈ ముఠాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చాలా కాలంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రహదారుల పక్కన నిలిపి ఉంచిన లారీలు, ఇతర భారీ వాహనాల ట్యాంకుల నుండి డీజిల్ దొంగలిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో నిఘా పెంచిన పోలీసులు ఆరుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరు మైనర్ కావడం గమనార్హం. అదుపులోకి తీసుకున్న నిందితుల వద్ద నుంచి సుమారు రూ. 40 లక్షల విలువైన ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 1000 లీటర్ల డీజిల్, రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లు, దొంగతనానికి వాడే ఇతర పనిముట్లు ఉన్నాయి. ఈ ముఠా సభ్యులపై గతంలోనే 20కి పైగా కేసులు నమోదై ఉన్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా అర్ధరాత్రి సమయాల్లో హైవేల వెంట ఆగి ఉన్న వాహనాలను గమనించి, డ్రైవర్లు నిద్రపోతున్న తరుణంలో అత్యంత వేగంగా డీజిల్ ట్యాంకుల సీల్ తొలగించి డీజిల్‌ను తమ వాహనాల్లోకి తరలించేవారు. హైవేలపై వాహనాలు నిలిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

# ఆబ్కారీ శాఖ డీసీ సోమిరెడ్డిని అకారణంగా దూషించిన కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

- పూర్తి స్థాయి విచారణకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి
- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిజామాబాద్ డివిజన్ ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డిని అకారణంగా ఆ శాఖ కమిషనర్ దూషించడాన్ని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ ఒడనాల రాజశేఖర్ తీవ్రంగా ఖండించారు. తోటి అధికారి అని కూడా చూడకుండా పరుష పదజాలంతో దూషించి, అవమాన పర్చిన ఆబ్కారీ శాఖ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ డివిజన్ ఆబ్కారీ శాఖ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డిని శుక్రవారం అదే శాఖ కమిషనర్ తోటి అధికారుల, సిబ్బంది ముందు పరుషపదజాలంతో దూషించడంతో పాటు తీవ్రంగా అవమానపర్చారని ఆరోపించారు. కమిషనర్ దూషణలతోనే సోమిరెడ్డి తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయి ఆస్పత్రి పాలయ్యారన్నారు. 30 ఏళ్లుగా ఆబ్కారీ శాఖకు సేవలందిస్తున్న ఉత్తమ అధికారి సోమిరెడ్డిని కమిషనర్ అకారణంగా దూషించడం చాలా బాధకరంగా ఉందన్నారు. అన్ పార్లమెంటరీ భాషతో తోటి అధికారుల, సిబ్బంది ముందు పరుష పదజాలంతో దూషించాల్సిన అవసరం ఏమి వచ్చిందని ప్రశ్నించారు. ఉద్యోగులను దూషిస్తూ, వారి జీవితాలతో ఆడుకునే హక్కు ఏ ఒక పై అధికారికి లేదని స్పష్టం చేశారు. సోమిరెడ్డి చేయని తప్పుకి " వెధవ , ఇడియట్" అంటూ ఉన్నత స్థాయిలో ఉన్న కమిషనర్ మాట్లాడే అధికారం ఎక్కడదని ప్రశ్నించారు. కింది స్థాయిలో అధికారులు, సిబ్బంది ఏదైనా తప్పు చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకునే అధికారం ప్రతి అధికారికి ఉంటుందని గుర్తు చేశారు. కానీ, నోరు పడేసుకోని ఉద్యోగులను అవమానపరుస్తూ, భయభ్రాంతులకు గురి చేసే పద్దతి మంచిది కాదన్నారు. ఉద్యోగులను దూషిస్తూ, అవమానపరుస్తున్న ఆబ్కారీ శాఖ కమిషనర్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ తక్షణమే స్పందించాలన్నారు. నిజామాబాద్ ఘటనపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆబ్కారీ కమిషనర్‌ను ఆ శాఖ నుంచి తప్పించాలన్నారు. దీంతో విచారణ పారదర్శకంగా సాగుతుందన్నారు. ఇదే విషయమై త్వరలోనే తెలంగాణ ఉద్యోగుల జేఏసీగా సీఎం రేవంత్‌రెడ్డిని, ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును, సీఎస్‌ని కూడా కలువనున్నట్టుగా చెప్పారు. ఆబ్కారి శాఖ కమిషనర్ తీరుపై మాట్లాడటంతో పాటు చర్యలకు కూడా డిమాండ్ చేస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలకు తావు లేకుండా ఉండాలనే విషయాన్ని కూడా ప్రభుత్వ పెద్దలను కోరనున్నట్టుగా తెలిపారు.


# మోతె సభతో సత్తా చాటుతాం

- రేవంత్ కళ్లు తెరిపిస్తాం : కొప్పుల

**జగిత్యాల, ఏప్రిల్11 (జనంసాక్షి) :** మోతె సభతో బిఆర్ఎస్ సత్తా చాటుతామని, రేవంత్ కళ్లు తెరిపిస్తామని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మోతెలో స్థలాన్ని సందర్శించిన సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. రెండేళ్లలోనే రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఒక్కటినీ కూడా నెరవేర్చలేదన్నారు. జగిత్యాల సభతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తామని తెలిపారు. జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల 20వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభ జరగనున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సభా ఏర్పాట్ల కోసం మోతె రోడ్డు పక్కన గల స్థలాన్ని జీవన్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తుల ఉమ, విద్యాసాగర్‌రావు, పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. జగిత్యాల సభను భారీగా నిర్వహించనున్నట్లు కొప్పుల ఈశ్వర్ వెల్లడించారు. ఈ సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతారని, లక్ష మందితో సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, లోక బాపురెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గజ్వేల్ రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయండి

**పెండింగ్ పనులు పరిశీలించిన ఎంపీ రఘునందన్**



**సిద్దిపేట, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** గజ్వేల్ అభివృద్ధికి ఈ రింగ్ రోడ్డు కీలకమైనదని.. నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. శనివారం గజ్వేల్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డును రఘునందన్ రావు పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నర్మెట్టకు వచ్చినప్పుడు అసంపూర్తిగా ఉన్నా గజ్వేల్ రింగ్ రోడ్డు వ్యవహారం గురించి వివరించానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పుడు పరిష్కరిస్తామని సభ వేదికగా చెప్పారని ప్రస్తావించారు. రింగ్ రోడ్డు పూర్తి కావడానికి 151 మీటర్ల భూ సేకరణ పెండింగ్‌లో ఉందని వెల్లడించారు. ఒక రైతుని పిలిచి ఒప్పించడంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అంతా కూడా నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు. రింగ్ రోడ్డు వ్యవహారంలో సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి తానే స్వయంగా వచ్చి పరిశీలించానని తెలిపారు. జిల్లా ఎంపీగా భూమి ఇచ్చే రైతుతో మాట్లాడి ఈ పనులపై చొరవ తీసుకుంటానని అన్నారు. ఒక వేళ రైతు భూమి ఇచ్చే వ్యవహారంలో అంగీకరించని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# 35 ప్రభుత్వ హాస్పిటళ్లలో డీ-అడిక్షన్ సెంటర్లు

**గాంధీ హాస్పిటల్ నుండి ప్రారంభించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా**

- యాంటి బయాటిక్స్, మత్తు పదార్థాలుగా వినియోగించే మెడిసిన్ విచ్చలవిడి అమ్మకాలపై కఠినంగా వ్యవహరిస్తాం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 35 ప్రభుత్వ హాస్పిటల్స్‌లో డీ అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సరియైన సమయంలో చికిత్స తీసుకుంటే డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల బానిసత్వం నుంచి పూర్తిగా కోలుకోవచ్చునని అన్నారు. మత్తుకు అలవాటు అయిన వారిని, తిరిగి మాములు స్థితిలోకి తీసుకురావడంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారం చాలా అవసరమని మంత్రి పేర్కొన్నారు. మత్తు అలవాటును మాన్పించే కౌన్సిలింగ్, ట్రీట్‌మెంట్ అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన డీ అడిక్షన్ సెంటర్లను గాంధీ హాస్పిటల్ నుంచి మంత్రి శనివారం అధికారికంగా ప్రారంభించారు. గాంధీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌ను మంత్రి పరిశీలించారు. అక్కడ అందించే సేవలను డాక్టర్లు మంత్రికి వివరించారు. అనంతర, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా గాంధీ హాస్పిటల్ అలుమ్ని హాల్‌లో డ్రగ్ కంట్రోల్ అథారిటీ నిర్వహించిన స్టేట్ లెవల్ అవేర్‌నెస్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో తయారయ్యే మందులు, వ్యాక్సిన్లు ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉన్నాయని మంత్రి తెలిపారు. కోవిడ్ సమయంలో కీలక ఔషధాలు, వ్యాక్సిన్లు సరఫరా చేసి, ప్రపంచాన్ని ఆదుకుంది హైదరాబాదేనని గుర్తు చేశారు. హైదరాబాద్‌ను ప్రపంచం విశ్వసనీయ వైద్య సేవలు అందించే కేంద్రంగా, ఫార్మా హబ్‌గా గుర్తించిందన్నారు. తెలంగాణపై దేశంతో పాటు ప్రపంచం కూడా నమ్మకం పెట్టుకున్నదని, నాణ్యత, భద్రత, బాధ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని మంత్రి పేర్కొన్నారు. "చిన్న నిర్లక్ష్యం కూడా అంతర్జాతీయ స్థాయిలో మన మీద ప్రభావం చూపుతుంది. అందుకే, నకిలీ మందులు, నాసిరకం ఔషధాలు, మత్తు మందుల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నాము. రాష్ట్రవ్యాప్తంగా రెగ్యులర్ ఇన్‌స్పెక్షన్లు నిర్వహిస్తున్నాము. ఈ రెండున్నర సంవత్సరాల్లో వేల సంఖ్యలో తనిఖీలు జరిగాయి. చట్టవిరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాము."అని మంత్రి వెల్లడించారు.

డగ్స్ వినియోగం, మెడిసిన్స్‌ను మత్తు పదార్థాలుగా వినియోగించే దురలవాటు పెరుగుతోందని, ఇది సామాజిక సమస్యగా కాకుండా ఆరోగ్య సమస్యగా చూడాలని మంత్రి పేర్కొన్నారు. సరియైన సమయంలో చికిత్స అందిస్తే డ్రగ్స్, మత్తు పదార్థాల బానిసత్వం నుంచి బాధితులను కాపాడుకోగలమని మంత్రి తెలిపారు. 'మత్తు అలవాటు వదిలించడంలో కుటుంబ సభ్యులు, స్నేహితుల పాత్ర కీలకం. రాష్ట్రవ్యాప్తంగా 35 ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌లో డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్లు, స్పెషల్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్లు ఏర్పాటు చేశాము. స్క్రీనింగ్, ట్రీట్మెంట్, కౌన్సెలింగ్, ఫాలోఅప్ సేవలు అందిస్తున్నాము. ఇటీవలే ఎర్రగడ్డలోని మెంటల్ హెల్త్ ఇనిస్టిట్యూట్‌లో డీ-అడిక్షన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించాము. డ్రగ్ నేరాలపై కట్టుదిట్టమైన చర్యల కోసం ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేశాము. సీఎం రేవంత్ రెడ్డి గారి దార్శనికతతో పని చేస్తున్నారు. ఎవరైనా నేరం చేస్తే, వారి స్థాయి ఏమిటన్నది పక్కనపెట్టి చర్యలు తీసుకుంటున్నాం."అని మంత్రి వెల్లడించారు. మత్తు పదార్థాల వ్యసనంతో బాధపడుతున్న వారిని దూరం పెట్టొద్దని, వారిని చికిత్స తీసుకునేలా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. యువత మెడిసిన్‌ను మత్తు పదార్థాలుగా వాడకుండా అరికట్టడంలో, మందుల సరైన వినియోగంలో ఫార్మాసిస్టుల పాత్ర చాలా కీలకం అని మంత్రి గుర్తు చేశారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు డీసీఏ రూపొందించిన పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంత్రి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఈగల్ ఫోర్స్ హెడ్ సందీప్ కుమార్ శాండిల్య, డీఎంఈ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**జర్నలిస్టులను సన్మానించిన మంత్రి**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ కృతజ్ఞతలు తెలిపారు. గాంధీ హాస్పిటల్‌లో డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, ఆ సమావేశం ముగింపులో అందుబాటులో ఉన్న జర్నలిస్టులను శాలువా, మెమెంటోతో సత్కరించారు. స్టేట్, సిటీ బ్యూరో హెల్త్ బీట్ రిపోర్టర్లు, స్థానిక రిపోర్టర్లు, ఫొటో, వీడియో జర్నలిస్టులకు మంత్రి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# వాణిజ్య ఒప్పందాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

**ఎఐకెయస్ వార్షికోత్సవ సభలో తీగల సాగర్, మల్లారెడ్డి**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఏఐకేఎస్ ఆవిర్భావ స్ఫూర్తితో వాణిజ్య ఒప్పందాలకు వ్యతిరేకంగా పోరాడుదామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఆర్‌టిసి క్రాస్ రోడ్లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం జెండాను సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అధ్యక్షతన జరిగిన సభలో తీగల సాగర్, సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ కిసాన్ సభ కేవలం ఆర్థిక సమస్యల మీదనే కాకుండా, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా కూడా పోరాడిందని, అంటరాని తనం, కుల ఆధిపత్యాన్ని కిసాన్ సభ తీవ్రంగా వ్యతిరేకించిందని, మొదటి నుంచీ మహిళలను సంఘటితం చేయడంలో కిసాన్ సభ ముందుందని, కమలాదేవి చటోపాధ్యాయ, గోదావరి పారులేకర్ వంటి మహనీయులు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారని తెలిపారు. 1991 తర్వాత ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు వ్యవసాయ రంగాన్ని మళ్ళీ సంక్షోభంలోకి నెట్టాయని, రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, ఈ దశలో కిసాన్ సభ తన పోరాట పంథాను మార్చుకుందని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పెట్టుబడి ఖర్చుపై 50% లాభం కలిపి కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టానికి వ్యతిరేక పోరాటం నుండి, ఇటీవల ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చారిత్రక రైతు ఉద్యమం వరకు ఏఐకేఎస్ కీలక పాత్ర పోషించిందని, దేశవ్యాప్తంగా ఉన్న 500 పైగా రైతు సంఘాలను సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఏకం చేయడంలో కిసాన్ సభ చురుగ్గా వ్యవహరిస్తోందని, 90 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ కిసాన్ సభ ప్రయాణం నేటికీ పదును తగ్గకుండా సాగుతోంది. నాడు బ్రిటీష్ వారితో, నేడు కార్పొరేట్ శక్తులతో పోరాడుతూ 'అన్నదాత' ఆత్మగౌరవాన్ని కాపాడుతోంది. 1936 నుండి 2026 వరకు ఈ సంస్థ సాధించిన విజయాలు అద్భుతం. రాబోయే కాలంలో కూడా పీడిత రైతాంగం వైపు నిలబడి, సామాజిక న్యాయం కోసం పోరాడటమే ఈ 90 ఏళ్ల వేడుకల అసలైన సందేశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు భూపాల్ ,తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు ,గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, రైతు నాయకులు వెంకట్ రెడ్డి,శివకుమార్ ,ఆంజనేయులు పాల్గొన్నారు.

# షేవింగ్ కత్తితో అన్నపై అటాక్!

**కుబీర్, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** ఆస్తి తగాదాల కారణంగా కన్న అన్నపైనే తమ్ముడు హత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని పార్డి-బి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్డి-బి గ్రామానికి చెందిన లింగంపల్లి విజయ్ కుమార్ అతని అన్న లింగంపల్లి రాజశేకర్ మధ్య ఆస్తి విషయమై గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో, ఈ నెల 5న రాత్రి రాజశేకర్ తన ఇంట్లో నిద్రిస్తుండగా, తమ్ముడు విజయ్ కుమార్ షేవింగ్ కత్తితో అతని గొంతు కోశాడు. ఈ దాడిలో రాజశేఖర్‌కు తీవ్ర రక్తస్రావం కాగా, కుటుంబ సభ్యులు తక్షణమే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కోలుకున్న బాధితుడు (నిన్న) ఈ నెల 10 న కుబీర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం నిందితుడు విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, విచారణ అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

# గురుకుల వ్యవస్థ నిర్వీర్యం

**బిఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్**



**హైదరాబాద్, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యావ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిందని బిఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు.గురుకులాలపై ఒక్క రోజైనా సీఎం రేవంత్ రెడ్డి రివ్యూ చేసిండా అని ప్రశ్నించారు. గురుకులాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని శ్రీనివాస్ మండిపడ్డారు. కేసీఆర్ సృష్టించిన బ్రాండ్‌ను నాశనం చేశారని విమర్శించారు. పేద విద్యార్థులంటే ఎందుకంత ద్వేషమని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. గురుకులాలు నాశనం కావడానికి కారణం ఎవరు అని ప్రశ్నించారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడానికేనా ఈ కుట్ర అని నిలదీశారు. గురుకలాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. సమస్యలపై విద్యార్థులు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. గురుకుల విద్యార్థుల మరణాలకు సంతాపం తెలిపిండా అని నిలదీశారు. ముఖ్యమంత్రే కదా విద్యాశాఖ మంత్రి.. మరి గురుకులాలు ఎందుకు సర్వనాశనమయ్యాయని ప్రశ్నించారు. విద్యార్థులంటే ముఖ్యమంత్రికి లెక్కలేదా అని నిలదీశారు. వేల కోట్ల రూపాయలు ఎన్నికల కోసం ఖర్చుపెడుతున్నారని.. ఎక్కడ ఎన్నికలు జరిగిన కోట్లు కుమ్మరిస్తున్నారని అన్నారు.. గురుకులాల కోసం మాత్రం ఒక్క రూపాయిని కేటాయించడం లేదని ధ్వజమెత్తారు.

# అంబులెన్స్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

**ప్రమాదంలో ఇద్దరు మృతి**

**ఒకరికి గాయాలు**

**కామారెడ్డి, ఏప్రిల్11 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న అంబులెన్స్‌ను వేగంగా దూసుకొచ్చిన ప్రైవేటు బస్సు వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న పేషెంట్ సలేహ భాను(63), అంబులెన్స్ డ్రైవర్ షేక్ సర్దార్ (35) ఘటనా స్థలిలోనే మృతి చెందారు. పేషెంట్ భర్త సైఫుల్లా ఖాన్ (76) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. సలేహ భాను ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి నుంచి ఆదిలాబాద్‌లోని స్వగ్రామానికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వెనుక నుంచి అతి వేగంగా దూసుకొచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో అంబులెన్స్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు


- 16మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు



**సూర్యాపేట, ఏప్రిల్11 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా కోదాడ బైపాస్ వద్ద జాతీయ రహదారిపై లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో 16 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ నిద్ర మత్తులోనే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు అంటున్నారు.

# వర్ణవివక్షకు వ్యతిరకంగా పోరాడిన మహానుభావుడు జ్యోతిరావుపూలే

**పూలే జయంతి సందర్భంగా కెసిఆర్ ఘన నివాళి**



**హైదరాబాద్, ఏప్రిల్11 (జనంసాక్షి) :** వర్ణ వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన భారతదేశ సామాజిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపన మార్గదర్శి, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన జాతికి చేసిన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. భారత సమాజంలో వర్ణ, కుల లింగ వివక్షతను రూపుమాపి, సామాజిక న్యాయం దక్కాలని పోరాడిన దార్శనికుడు మహాత్మా పూలే అని కొనియాడారు. సబ్బండ వర్ణాలు సామాజిక ఆర్థిక రంగాల్లో ముందడుగు వేయాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని చెప్పిన జ్యోతిరావు పూలే ఆశయాలు ఎల్లకాలం ఆచరణీయమైనవని కేసీఆర్ తెలిపారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి మరీ, చదువు నిరాకరించబడిన భారత మహిళకు విద్య నేర్పాలనే ధృఢ సంకల్పాన్ని అనేక కష్ట నష్టాల నడుమ అమలు చేసిన, మహిళాభ్యుదయ మార్గదర్శి మహాత్మా పూలే అని కొనియాడారు. పూలే ఆశయాలను నిజం చేస్తూ, తన పదేండ్ల ప్రగతి పాలనలో, నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అమలు చేసి ఫలితాలను సాధించిన పలు రకాల పథకాలను కార్యాచరణను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. సాగునీరు, విద్యుత్, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలు అమలు చేసి వ్యవసాయ రంగాన్ని పటిష్టపరిచామని తెలిపారు. పలు వృత్తికులాలను ప్రోత్సహిస్తూ గొర్రెల పెంపకం, చేపల పంపిణీ, నేతన్నకు చేయూత వంటి పథకాలను అమలు చేయడం ద్వారా నూటికి తొంభైశాతంగా ఉన్న దళిత బహుజన కులాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నాయని తెలిపారు. తద్వారా, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం జరిగిందని అన్నారు. ఆసరా ఫించన్లు, బీసీ బంధు వంటి బహుజన సంక్షేమ పథకాల అమలు ద్వారా, వెనకబడి ఉన్న సబ్బండ కులాలను ఆర్థికంగా అభివృద్ధి చేసామన్నారు. బీసీ కులాల విద్యకోసం ప్రత్యేక రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వారికి అంతర్జాతీయ స్థాయి విద్యనందించినామని కేసీఆర్ తెలిపారు. బీసీ బిడ్డల భవిష్యత్తు తరాల ప్రయోజనాలను నెరవేర్చేందుకు రాష్ట్ర రాజధాని నగరం హైద్రాబాద్ లో ఆత్మగౌరవ భవన నిర్మాణాల కోసం, అత్యంత విలువైన స్థలాలను, నిర్మాణ నిధులను,బీసీ కుల సంఘాలకు కేటాయించినామని తెలిపారు. బీసీ కులాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పూలే ఆశయాలకు అనుగుణంగా తాము గత ప్రభుత్వంలో అమలులోకి తెచ్చిన ప్రగతి కార్యాచరణను చిత్తశుద్ధితో కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

# వేదాంత బాక్సైట్ దాహానికి ఒడిశా ఆదివాసుల ప్రతిఘటన

*మన పొరుగున ఒడిశా రాష్ట్రం వేదాంత కంపెనీ ప్రయోజనాలను పరిరక్షించడం కోసం ప్రభుత్వం ఎంత దిగజారగలదో, తమ నిజమైన యజమానుల సేవకులుగా ప్రభుత్వాధికారులు అమాయక ఆదివాసుల మీద ఎంత దమనకాండ సాగించగలరో చూపుతున్నది. ఇది ఏదో పరాయి రాష్ట్రంలో ఒక మూరుమూల ఆదివాసుల మీద జరుగుతున్న దాడి మాత్రమే కాదు. ఈ దేశ సంపదను కొల్లగొట్టుకుపోదలచుకున్న బహుళజాతి సంస్థలూ, వారి బూట్లు నాకే ప్రభుత్వాలూ ఒక పక్కనా, అలా కొల్లగొట్టుకుపోకుండా కాపాడదలచుకున్న ఆదివాసులూ, ప్రజలూ ఒక పక్కనా సాగుతున్న యుద్ధం ఇది. ఈ దేశంలో ప్రతి ఒక్కరూ పట్టించుకోవలసిన, ఆందోళన వ్యక్తం చేయవలసిన, పోరాడుతున్న ఆదివాసులకు సంఘీభావం ప్రకటించవలసిన కీలక పరిణామాలు ఇవి. మన ప్రభుత్వాలకు ప్రజలంటే, ఆదివాసులంటే, వాళ్ల జీవితాలంటే ఎంతమాత్రమూ లెక్క లేదని, ప్రభుత్వాల పని అంతా బడా కార్పొరేట్ కంపెనీల సేవలో తరించడం మాత్రమే అనీ ఆ పరిణామాలు ప్రకటిస్తున్నాయి.*



జనమే సాక్షి

ఒడిశాలో కలహండి, రాయగడ జిల్లాల సరిహద్దులలో ఘువాముల్ రాంపూర్, కాశీపూర్ బ్లాక్ లలో సిజిమాలి కొండల వరుసలో ముప్పై కోట్ల టన్నుల బాక్సైట్ ఖనిజం నిక్షిప్తమై ఉంది. ఆ ఖనిజం తవ్వుకోవడానికి ప్రభుత్వం ఆ కొండలను 2023 మార్చ్ లోనే వేదాంత కంపెనీకి అప్పగించింది. తమ ప్రాంతంలో గనుల తవ్వకాలు జరపడానికి, పర్యావరణాన్ని విధ్వంసం చేయడానికి, ఈ దేశపు సహజ వనరులను బహుళజాతి సంస్థలకు దోచిపెట్టడానికి వీలు లేదని, స్థానిక ఆదివాసులు అప్పటినుంచీ తమ నిరసనను, వ్యతిరేకతను, ప్రతిఘటనను ప్రదర్శిస్తున్నారు. మా మాటి మాలి సురక్షా మంచ్ నాయకత్వంలోని ఈ ప్రజా ప్రతిఘటన మీద రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పోలీసు బలగాలను, వేదాంత కంపెనీ నియమించుకున్న గూండాలను ప్రయోగించి, ఆదివాసుల వ్యతిరేకతను కాలరాయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని వందల మంది ఆదివాసుల మీద తప్పుడు కేసులు బనాయించి జైళ్లలోకి తోశారు. వారు ఏడాదికి పైగా జైళ్లలో మగ్గుతున్నారు. ఈ ప్రాంతంలోని షాగాబరి, బంతేజ్, బొందెల్, కంటమాల్, తలాంపదర్ మొదలైన ఎనిమిది, పది గ్రామాలు మూడు సంవత్సరాలుగా భయంకరమైన నిర్బంధాన్ని చవి చూస్తున్నాయి.

తాజాగా, రాయగడ జిల్లా సుంగేర్ గ్రామపంచాయత్ లోని కంటమాల్ గ్రామాన్ని ఏప్రిల్ 7 మంగళవారం తెల్లవారు జామున మూడు గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు చుట్టుముట్టాయి. మొట్టమొదట పోలీసులు గ్రామంలో కరెంటు తీసేసి, గ్రామం మీద ఒక్కుమ్మడిగా దాడి చేశారు. తమ ఇష్టం వచ్చినవారిని అరెస్టు చేయడానికి, ఇతరులు ఇళ్ల నుంచి బైటికి వచ్చి ప్రతిఘటించకుండా ఉండడానికి గ్రామస్తుల ఇళ్లకు పోలీసులు బైటి నుంచి గొళ్లాలు బిగించారు. కాని జనం ఇంటి వెనుక తలుపులు తెరుచుకుని బైటికి వచ్చి పోలీసు దాడికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన తెలపడం ప్రారంభించారు. ఆ చీకట్లో పోలీసులు లాఠీలతో, ఇనుప రాడ్లతో కనబడివాళ్లనల్లా కొట్టారు. గుంపుగా ఉన్న జనం మీద లాఠీచార్జీ చేశారు. బాష్ప వాయువు ప్రయోగించారు. గాలిలోకి కాల్పులు జరిపారు. గ్రామంలో స్త్రీ పురుషులందరినీ పోలీసులు విచక్షణారహితంగా కొట్టిన దెబ్బలకు ఇద్దరు స్త్రీల తలలు పగిలాయి. పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. మొత్తంగా గ్రామంలో భయభీతావహం నెలకొంది. మరొకవైపు నుంచి గ్రామస్తులే గుంపుగా వచ్చి తమపై దొమ్మీ చేశారని, రాళ్లతో, గొడ్డళ్లతో, కత్తులతో, పదునైన ఆయుధాలతో దాడి చేశారని, దాదాపు పది మంది అధికారులతో సహా 40 మంది పోలీసులు గాయపడ్డారని పోలీసు అధికారులు పత్రికా సమావేశాలు పెట్టారు. గ్రామస్తులపై కేసులు పెట్టారు. అలాగే, అదే రోజు షాగాబరి గ్రామంలో కూడా పోలీసు బలగాలు విచ్చలవిడిగా దాడులు సాగించాయి.

పర్లాంగ్ గ్రామం నుంచి షాగాబరి ఘాట్ వరకు ప్రభుత్వం నిర్మిస్తున్న మూడు కి.మీ. రోడ్డును ఈ గ్రామస్తులు, ఆదివాసులు వ్యతిరేకించడం, రోడ్డు వేయకుండా ప్రతిఘటించడం ప్రస్తుత దాడులకు ప్రత్యక్ష కారణం. ఆ రోడ్డు నిర్మాణం జరగబోతున్నదని, అందువల్ల ఆ ప్రాంతంలోని గ్రామాల్లో నిషేధాజ్ఞలు విధిస్తున్నామని రాయగడ సబ్ కలెక్టర్ ఏప్రిల్ 3న అన్ని గ్రామాల్లో ప్రచారం చేయించారు. నిర్మాణమవుతున్న రోడ్డుకు వంద మీటర్ల వరకు నలుగురి కన్నా ఎక్కువమంది గుమిగూడడం నిషేధమని ప్రకటించారు. ప్రపంచంలో ఎక్కడైనా రోడ్డు నిర్మాణం ఇటువంటి ఆంక్షల మధ్య జరిగి ఉంటుందా అనుమానమే. మన మహాన్ భారత్ లో ఢిల్లీలోనూ, భువనేశ్వర్ లోనూ సంఘ పరివార్ డబుల్ ఇంజన్ సర్కార్ పరిపాలనలో మాత్రమే అది సాధ్యం. లండన్ లో స్థిరపడిన భారతీయ కుబేరుడు అనిల్ అగర్వాల్ కు మరిన్ని లాభాలు సంపాదించి పెట్టడం కోసం ఇలా ప్రజల మీద ఆంక్షలు విధించి రోడ్డు నిర్మాణం జరపడం సంఘ్ పరివార్ కు మాత్రమే సాధ్యం. ఆ రోడ్డు నిర్మాణం గనుక జరిగితే సిజిమాలి కొండల అంచువరకూ వేదాంత బుల్డోజర్లు, ట్రక్కులు వెళ్లడానికి, ఇష్టారాజ్యంగా గనుల తవ్వకానికి, ఖనిజం బైటికి రవాణా చేయడానికి మార్గం సుగమమవుతుంది.

అటువంటి భయానక నిషేధాజ్ఞల మధ్య, ఆంక్షల మధ్య, వేలాది పోలీసు బలగాల మధ్య తమ ప్రతిఘటన కొనసాగిస్తున్నారని, రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని ఆదివాసుల మీద ప్రభుత్వ కోపం. ఆ కోపానికి ఫలితమే కంటమాల్, షాగాబరి గ్రామాల మీద దాడులు.

ఒకవైపు పోలీసులు, వేదాంత గూండాలు ఆదివాసీ గ్రామాల మీద విరుచుకుపడి, ఆదివాసుల నెత్తురు కళ్ల చూస్తుండగా, రాజధాని భువనేశ్వర్ లో అదే రోజు వేదాంత కంపెనీ ప్రతినిధులను, ఇతర మైనింగ్ కంపెనీల ప్రతినిధులను, పరిశ్రమాధిపతులను కలుసుకున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి వారికి ప్రభుత్వ సహకారం సంపూర్ణంగా ఉంటుందని హామీ ఇచ్చారు. వారు తమ ఉత్పత్తిని ఇంకా పెంచాలని, తయారీ పరిశ్రమలను కూడా స్థాపించాలని సూచించారు. ఒకే రోజు అటు ఆదివాసుల మీద పోలీసుల, కంపెనీ గూండాల దాడులు, ఇటు ఆ కంపెనీ వారికి ముఖ్యమంత్రి వాగ్దానాలు డబుల్ ఇంజన్ సర్కార్ ఎంత ప్రజా వ్యతిరేకమైనదో, ఎంత కార్పొరేట్ అనుకూలమైనదో తేటతెల్లం చేస్తున్నాయి.

అయితే ఈ ఏప్రిల్ 7 దాడులు మొదటివేమీ కాదు, గత రెండు మూడు సంవత్సరాలుగా ఇటువంటి దాడులు సాగుతూనే ఉన్నాయి. ఇంతకు ముందు మార్చ్ 10 రాత్రి ఒక పెద్ద పోలీసు బలగం, కంపెనీ గూండాలు కలిసి తలాంపదార్ అనే చిన్న, 120 ఇళ్ల గ్రామంలో మా మాటి మాలి సురక్షా మంచ్ నాయకుడి ఇంటి మీద దాడి చేశారు. నిజానికి ఇలా దాడి చేసిన గూండాల మీద, వారికి సహకరించిన పోలీసుల మీద చర్య తీసుకోవలసి ఉండగా, ఆ పోలీసులే గ్రామం నుంచి 21 మంది ఆదివాసి రైతుకూలీలను అరెస్టు చేసి తీసుకుపోయారు. వారి మీద తప్పుడు కేసులు బనాయించి కలహండి జిల్లా భవానిపట్నా జైలులో నిర్బంధించారు. ఇలా పోలీసులు నిర్బంధించిన ఒక గర్భిణి, ఇద్దరు బాలింతలతో సహా, ఎందరో స్త్రీలు కూడా ఉన్నారు.


ఈ దాడులకు కొనసాగింపుగా ఈ ప్రతిఘటనోద్యమ నాయకత్వం మీద కూడా గురిపెట్టారు. ఒడిశాలో గనుల తవ్వకానికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలంగా పోరాడుతున్న, సుప్రసిద్ధ నాయకుడు లింగరాజ్ ఆజాద్ ను భవానిపట్నాలో మార్చ్ 25న అరెస్టు చేశారు. ఆయనతో పాటు మా మాటి మాలి సురక్షా మంచ్ కు మరొక సలహాదారుగా ఉన్న సమాజవాది జన్ పరిషద్ నాయకుడు సురేష్ సంగ్రామ్ ను కూడా అరెస్టు చేశారు. వారిద్దరినీ రాయగడ జైలులో నిర్బంధించారు.

ఆదివాసి ప్రజానీకం మీద, వారికి సహకరిస్తున్న నాయకత్వం మీద ప్రభుత్వానికి ఇంత కక్ష ఎందుకు? ఇంత నిర్బంధకాండ అవసరం ఏమిటి? సిజిమాలి బాక్సైట్ మైనింగ్ ప్రాజెక్ట్ అనే పేరుతో ఉన్న ఈ గనుల తవ్వకం వ్యవహారంలో వేదాంత లిమిటెడ్ అనే కంపెనీ తరఫున కాంట్రాక్టర్ గా మైత్రీ కంపెనీ పని చేస్తున్నది. వేదాంతకు ఈ బాక్సైట్ గనులు ఉన్న 699 హెక్టార్ల (1728 ఎకరాల) అటవీ భూమితో సహా 1549 హెక్టార్ల (3828 ఎకరాల) భూమిని ఒడిశా ప్రభుత్వం వేదాంతకు మూడు సంవత్సరాల కింద కట్టబెట్టింది. ఇలా అటవీ భూమిని, ఇతర భూమిని ఒక ప్రైవేటు కంపెనీకి అప్పగించడం రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ కు వ్యతిరేకం, పంచాయత్ ఎక్స్ టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ (పెసా) చట్టం 1996 కు వ్యతిరేకం. ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ 2006 కు వ్యతిరేకం. ప్రభుత్వమే పూనుకుంటే, కంచే చేను మేసినట్టు ఈ చట్టాలలోని ఆదివాసీ అనుకూల, పర్యావరణ అనుకూల నిబంధనలను, పరిమితులను అన్నిటినీ తుంగలో తొక్కారు. నిరసన తెలుపుతున్న ఆదివాసులు, ప్రజలు మా మాటి మాలి సురక్షా మంచ్ ఏర్పాటు చేసుకుని ప్రభుత్వాధికారులను, న్యాయస్థానాలను ఎంత వేడుకున్నా వారికి న్యాయం దొరకనే లేదు. ఈ వేదిక తరఫున నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ లో వేసిన పిటిషన్ ఇంకా వినడానికే తీరిక దొరకలేదు.

ఈ వేదాంత కంపెనీకే సమీపంలోని లాంజిగర్ లో అల్యూమినా రిఫైనరీ కూడా ఉంది. అంటే ఇక్కడే బాక్సైట్ తవ్వి, ఇక్కడే అల్యూమినియం శుద్ధి చేసి, అంతర్జాతీయ మార్కెట్ లో అమ్ముకుని ఇబ్బడి ముబ్బడి లాభాలు గడించడానికి వేదాంతకు మంచి అవకాశం. ఆ క్రమంలో అడవి నాశనమైనా ఫర్వాలేదు. ఆదివాసుల జీవితాలూ, జీవనోపాధులూ ధ్వంసమైనా ఫర్వాలేదు. ఆదివాసుల ఇలవేలుపు టిజిమాలి నివాసమైన కొండలు నేలమట్టమై పోతాయనే ఆదివాసీ ప్రాచీన అమాయక సాంస్కృతిక విశ్వాసం వేదాంత ఉక్కుపాదాల కింద అణగిపోయినా ఫర్వాలేదు.

ప్రపంచవ్యాప్తంగా విపరీతంగా అవసరం అవుతున్న అల్యూమినియంకు ఏకైక వనరు బాక్సైట్ ఉన్న అతి తక్కువ దేశాల్లో భారతదేశం ఒకటి. దేశంలో దొరికే బాక్సైట్ లో 40 శాతం పైగా ఒడిశాలోనే ఉంది. దేశపు బాక్సైట్ ఉత్పత్తిలో 70 శాతం పైగా ఒడిశాలోనే జరుగుతున్నది. పొరుగున ఉన్న నియంగిరి కొండల నుంచి బాక్సైట్ తవ్వడానికి వేదాంత చేసిన ప్రయత్నాలు ప్రజల ప్రతిఘటనతో, 2013 సుప్రీంకోర్టు తీర్పుతో ఆగిపోయాయి. అందువల్ల వేదాంత ఎలాగైనా సరే సిజిమాలి కొండలను ఆక్రమించాలని ప్రయత్నిస్తున్నది. ఆ కొండల్లో ఇప్పుడు పోలీసులు పారిస్తున్న ఆదివాసుల నెత్తురు వేదాంత కంపెనీ ఆదేశాల మేరకే ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి కనుసన్నల్లోనే సాగుతున్నది.

ఈ విలువైన ఖనిజ వనరులను, ముఖ్యంగా బాక్సైట్ ను ప్రైవేటు కంపెనీలకు అప్పగించగూడదని, అందుకోసం గనుల దగ్గరికి రోడ్డు వేసే పని మానుకోవాలని, లింగరాజ్ ఆజాద్ తో సహా ఈ సందర్భంగా అరెస్టు చేసి జైళ్లలో పెట్టినవారందరినీ విడుదల చేయాలని కోరుతున్న ఆదివాసులతో గొంతు కలపడం ఈ దేశ ప్రజల కనీస బాధ్యత.



**ఎన్ వేణుగోపాల్**
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

# యుద్ధం వెనుక అసలు మర్మం



ప్రపంచ రాజకీయాల్లో కొన్ని సంఘటనలు ఒక్కరోజులో జరిగిపోయినట్లు కనిపించినా, వాటి వెనుక దశాబ్దాల చరిత్ర, ఆధిపత్య పోరాటం, ఆర్థిక ప్రయోజనాల గణితం దాగి ఉంటుంది. అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తత కూడా అలాంటిదే. ఒక రాత్రిలో యుద్ధం ప్రారంభమవుతుందా, లేక ఒక్క ప్రకటనతో ఆగిపోతుందా అన్న అనిశ్చితి ప్రపంచ ప్రజలను కలవరపెడుతోంది. కానీ ఈ సంఘర్షణను కేవలం తాజా ఘటనలతో అర్థం చేసుకోవడం సరిపో దు; దీని మూలాలు శక్తి రాజకీయాల్లో ఉన్నాయి.

ఇరాన్‌పై అమెరికా వైఖరి కొత్తది కాదు. 1953లో ప్రజాస్వామ్యంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చివేసినప్పటి నుంచి ఆ దేశంపై పాశ్చాత్య జోక్యం కొనసాగుతూనే ఉంది. అప్పటి నుంచి ఆంక్షలు, ఒత్తిళ్లు, అంతర్గత అస్థిరత సృష్టించడం వంటి చర్యల ద్వారా ఇరాన్‌ను బలహీనపరిచే ప్రయత్నాలు జరిగాయి. ఇరాన్ మాత్రం తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవాలనే ధోరణిలోనే నిలబడింది. అణుశక్తి అభివృద్ధి కూడా తమ హక్కు అనే స్థాయిలో వారు వాదిస్తున్నారు.

ఇక అమెరికా వైపు చూస్తే, ఈ సమస్య కేవలం అణ్వస్త్రాల ప్రశ్న మాత్రమే కాదు. పశ్చిమాసియా ప్రాంతం ప్రపంచ చమురు నిల్వల్లో దాదాపు 48 శాతం వాటాను కలిగి ఉంది. ఈ ప్రాంతాన్ని నియంత్రించడం అంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పరోక్ష నియంత్రణ సాధించినట్టే. 'పెట్రో–డాలర్' వ్యవస్థ ద్వారా అమెరికా తన కరెన్సీ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం ఈ ప్రాంతంతో ముడిపడి ఉంది. ఇరాన్ వంటి దేశం స్వతంత్రంగా ఎదిగితే, ఈ వ్యవస్థకు సవాలు అవుతుంది.

ఇజ్రాయెల్ పాత్రను విడిగా చూడలేం. ఆ దేశ భద్రతా ఆందోళనలు, పాలస్తీనా సమస్య, ప్రాంతీయ ఆధిపత్య ఆశయాలు... ఇవన్నీ కలిసిపోయాయి. ఇరాన్‌ను ప్రధాన శత్రువుగా భావించే ఇజ్రాయెల్, ఆ దేశాన్ని బలహీనపరచడం ద్వారా తన భద్రతను బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. కానీ దీనివల్ల లెబనాన్, సిరియా వంటి దేశాలు కూడా యుద్ధంలోకి లాగబడుతున్నాయి. హిజ్బుల్లా వంటి గుంపులు రంగంలోకి దిగితే పరిస్థితి మరింత క్లిష్టమవుతుంది.

ఇరాన్ దృక్కోణంలో చూస్తే, ఇది కేవలం రక్షణ యుద్ధం. తమ అణుశక్తి హక్కును అంగీకరించాలి, ఆంక్షలను ఎత్తివేయాలి, విదేశీ సైనిక దళాలు ఈ ప్రాంతం నుంచి వెళ్లిపోవాలి అనే వారి డిమాండ్లు అంతర్జాతీయ చట్టాల ప్రకారం కొంతవరకు సమర్థనీయంగా కనిపిస్తాయి. ముఖ్యంగా హర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్‌కు ఉన్న భౌగోళిక, వ్యూహాత్మక ఆధిపత్యం ప్రపంచానికి కీలకం. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20 శాతం ఈ మార్గం ద్వారానే జరుగుతుంది. ఈ మార్గం మూసుకుపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలవడం ఖాయం.

ఇక్కడే గ్యాస్, ఆయిల్ సంక్షోభం ప్రశ్న వస్తుంది. ఇప్పటికే యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు 10 నుంచి 15 శాతం వరకు పెరిగిన సందర్భాలు ఉన్నాయి. యూరప్ దేశాలు రష్యా గ్యాస్‌పై ఆధారాన్ని తగ్గించే క్రమంలో మధ్యప్రాచ్యంపై ఆధారపడుతున్నాయి. ఈ సమయంలో యుద్ధం ముదిరితే, సరఫరా గొలుసులు దెబ్బతింటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు..భారత్ వంటి దేశాలు...ద్రవ్యోల్బణ ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుంది.

అమెరికా తరచుగా కాల్పుల విరమణను ప్రకటించడం, వెంటనే దానిని నిరాకరించే విధంగా ప్రకటనలు రావడం, మరోవైపు ఇజ్రాయెల్ దాడులు కొనసాగించడం ఇవి అన్నీ ఒక వ్యూహాత్మక గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. ఇది ఒక విధంగా ఒత్తిడి రాజకీయమే. ప్రత్యర్థిని మానసికంగా బలహీనపరచడం, అంతర్జాతీయ మద్దతును కూడగట్టే ప్రయత్నం. అలాగే, యుద్ధాన్ని తాత్కాలికంగా నియంత్రించడం. ఇవి ఇందులో ముఖ్యమైన అంశాలు.

పాకిస్తాన్, ఈజిప్టు, తుర్కియే వంటి దేశాలు మధ్యవర్తిత్వం చేస్తున్నప్పటికీ, వారి పాత్ర పరిమితంగానే ఉంది. వారు సందేశాలను రవాణా చేసే మధ్యవర్తులుగా మాత్రమే ఉన్నారు కానీ పరిష్కారం సూచించే స్థాయికి ఇంకా రాలేదు. అసలు సమస్య ఏమిటంటే, రెండు పక్షాల డిమాండ్లు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. ఒకరు అణు కార్యక్రమం పూర్తిగా ఆపాలని కోరుతుంటే, మరొకరు అదే తమ హక్కు అంటున్నారు.

ప్రపంచ శక్తుల వైఖరి కూడా గమనించదగ్గది. యూరప్, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాలు అమెరికాకు పూర్తిగా మద్దతు ఇవ్వడంలో వెనుకంజ వేస్తున్నాయి. కారణం స్పష్టమే. ఈ యుద్ధం విస్తరించినట్లయితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం ఉంటుంది. ఇప్పటికే గ్లోబల్ వృద్ధి రేటు 3 శాతం చుట్టూ నిలిచిపోయిన సమయంలో మరో సంక్షోభం వస్తే అది మరింత క్షీణించవచ్చు.

ఇక ప్రశ్న... ఈ సమస్యకు పరిష్కారం ఉందా? తక్షణంగా చూస్తే, పూర్తిస్థాయి యుద్ధం ఎవరికీ లాభదాయకం కాదు. అమెరికాకు అది ఆర్థిక, రాజకీయ భారం. ఇజ్రాయెల్‌కు అది భద్రతా ప్రమాదం. ఇరాన్‌కు అది మౌలిక వసతుల నష్టం. అరబ్ దేశాలకు అది ప్రాంతీయ అస్థిరత. ప్రపంచానికి అది ఆర్థిక సంక్షోభం. అందువల్ల, ఒక స్థాయి వరకు రాజీ తప్పనిసరి.

కానీ ఆ రాజీ ఎలా ఉంటుంది? ఇరాన్‌కు పరిమిత అణు కార్యకలాపాలను అనుమతించడం, దానికి బదులుగా కఠిన పర్యవేక్షణ విధించడం ఒక మార్గం కావచ్చు. అదే సమయంలో ఆంక్షలను దశలవారీగా ఎత్తివేయడం, ప్రాంతీయ భద్రతా ఒప్పందాలను కుదుర్చడం అవసరం. ఇజ్రాయెల్ భద్రతను కూడా హామీ ఇవ్వాల్సిందే. లేకపోతే ఈ చర్చలు నిలకడగా ఉండవు.


మొత్తంగా చూస్తే, ఈ యుద్ధం కేవలం భూభాగాల మధ్య కాదు. ఇది శక్తి, సంపద, భద్రత, ఆధిపత్యాల మధ్య పోరు. ఒక రాత్రిలో దేశాలు మాయం కావు, కానీ ఒక తప్పుడు నిర్ణయం ప్రపంచాన్ని సంక్షోభంలోకి నెట్టగలదు. అందుకే ఈ పరిస్థితిని అర్థం చేసుకోవడంలో భావోద్వేగం కంటే విశ్లేషణ ముఖ్యము. శాంతి సాధ్యమే. కానీ... అది బలవంతంతో కాదు, పరస్పర అవగాహనతోనే సాధ్యం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
9849328496.




డాక్టర్ మలయశ్రీ ఆకస్మికంగా కాలం చేశారంటే వమ్మబుద్ధి కావడం లేదు. వారం క్రితం కూడా ఫోన్‌లో మాట్లాడుతున్నాను. మలయ శ్రీ మృతితో తెలుగు నేల ఒక గొప్ప పరిశోధకుడిని కోల్పోయింది. బహు భాషా వేత్త, మహా పండితులు, 150 పైగా పుస్తకాలు వెలలరుణచువ తవి, కథకుడు, నవలాకారుడు, చరిత్రకారుడు. వెయ్యేళ్ల కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్రను పరిశోధించి అక్షర బద్ధం చేసిన వారు. దశాబ్దాల స్నేహం మాది. సెలవిప్పటికి స్నేహమెప్పటికి అని ఆయన ప్రతి ఉత్తరం లో రాసేవారు. వారు రాసిన పుస్తకాలు విద్యార్థులకు పాఠాలు అయ్యాయి. బాల సాహిత్యం బాల బాలికలను విద్యావంతులను చేసింది. నాస్తిక హేతువాదం తో ఒంటరిగా బయలు దేరి వేలాది అభిమానులను గెలుచుకున్నారు. అన్ని విధాలుగా నాస్తిక హేతువాద సంస్కృతి జీవనం. గడిపిన మలయశ్రీ వంటి వారు చరిత్రలోనే అరుదుగా కనిపిస్తారు. తండ్రి మరణిస్తే కింద వేసి పాడె కట్టాన్ని నిరాకరించారు. మంచంతో సహా అంత్యక్రియలు జరిపిన ధీశాలి. పిల్లల పెళ్లిల్లు కూడా ఆదర్శంగా జరిపిన మహోన్నత మానవతావాది మలయశ్రీ. భగవత్ గీత కాదు ఇపుడు కావలసింది మానవ గీత అని సంస్కృతం లో గొప్ప మానవ గీతను రచించారు. అశ్వ ఘోషుని వజ్ర సూచి ఉపనిషత్తు ను అనువదించి తెలుగు వారికి అందించారు. వారి రచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయి. వారి కృషి యువత కు ఆదర్శం. సాహిత్యమే జీవితంగా జీవించిన మలయశ్రీ మహాకవి. మహోన్నత వ్యక్తిత్వం. వారి పేరిటి నేను స్వయంగా మలయశ్రీ అవార్డు ప్రవేశ పెట్టాను. వంగపండు ప్రసాద రావు, బోయ జంగయ్య వంటి వారిని పురస్కారాలతో గౌరవించాము. వారి సతీమణి భారతి దేవి మృతి వారిని ఎంతగానో కుంగదీసింది. అకస్మాత్తుగా బ్రెయిన్ డెడ్ తో 10 ఏప్రిల్ 2026 రాత్రి 9–10 గంటలకు చనిపోవడం తీవ్ర విషాదం నింపింది. వారికి నివాళి. వారు నమస్కారం అనే పదాన్ని తన జీవితంలో రానీయకుండా అందరినీ కట్టడి చేసిన నిఖార్సైన సామ్య వాది. వారి కుటుంబానికి తీవ్ర సంతాపం తెలియ జేస్తున్నాను.




**- బి ఎస్ రాములు**
సామాజిక తత్వ వేత్త
ఫో: 8331966987

## అన్యంశరణంనాస్తి!



సూద్ర సోదరులారా!
మనం ఎన్ని కులాలు?
ముక్కలు చెక్కలు
డొక్కలుపగిలే శ్రమలు!
అంతా'వాళ్ల'వ్యూహం!
వాళ్లవ్యూహంలోచిక్కాం
వర్ణవ్యవస్థలో బానిసలం!
ఇప్పుడుఏడువేలకులాలై
ఎక్కువ తక్కువలతో
తన్నుకు చస్తున్నాం!
మన అనైక్యతే 'వాళ్ల '
అసలుబలమంతా!
మనదగ్గరేముంది!
ఆర్థికమా!వ్యాపారమా!
అన్నీ త్రైవర్ణాలవే!
వాళ్లదోపిడీ,మనదరిద్రం
రెండూ మర్చిపోవాలి!
అందుకే 'అగ్రజుల' భక్తి
ప్రవచన బోధామృతం!
వారి కరుణాసముద్రం !
ఎప్పుడూ ఇదే కథ!
మనం 'తన్ను'కుంటూ
వాళ్లను 'ఎన్ను'కుంటూ
ఇంకా అడుక్కు తింటూ!
మన బతుకులు ఇంతే!
కులాలు, మతాలు
పరలోకం ముచ్చట్లు
దిక్కులేని మనలను
ప్రక్కదారి పట్టించే
వ్యూహాత్మక దోపిడీ!
ఈ దేశం వాళ్లదేనా?
'సహజ'సంపదలువాళ్లే
'శ్రమ'సంపదలువాళ్ళే
వాళ్ళకు రాజ్యాధికారం
ఇచ్చేఓటుయంత్రాలం!
అంగుళంభూమిలేకుండా
వస్తుసముదాయంకూర్చే
నిరంతర కష్టజీవులమై
వాళ్ళదయా దక్షిణ్యాలపై
బ్రతికేదరిద్రుల్నిచేసిందెవరు
ఇదిమీరుగ్రహించకపోతే
ఎవ్వరూ కాపాడలేరు!
శ్రమకులాలన్నీ ఒక్కటై
రాజ్యాధికారంసాధిస్తేనే!
అన్యంశరణంనాస్తి!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్



ఇరాన్‌కు బలి
మేకలుతిన్న పులి
ట్రంపుకు గిలి
మంటకు చలి
శాంతి చర్చలు
అడ్డంకి అణుశుద్ధి
దేశ అస్తిత్వం
విశ్వం నాశనం
విపరీత పోకడలు
బతుకు
బతకనివ్వు
బలసి యుద్ధం
అలసి శాంతి మార్గం
చీకటి చూపు

**రేడియమ్**
9291527757



## బుద్ధం శరణం

స్థిరమైన
మానసికస్థితి
పురోగన మార్గ గతి
అభ్యున్నతి
సర్వోన్నతి
నీ జీవన మతి
ఋతుమయస్మృతి

**రేడియమ్**
9291527757

# దొరకునా ఇటువంటి సేవ !




పూర్వ కరీంనగర్ జిల్లా సాహిత్య చరిత్రకారుడు, శతాధిక గ్రంథకర్త , ' భౌతికవాది ' సంపాదకులు శ్రీ మలయశ్రీ !

పాల సంద్రములోన పామెట్లు
వసియించె ?
పాముపై విష్ణువెట్లు పవ్వళించె ?
అతని నాభిన యెట్లు అంబుజం
జన్మించె ?
పద్మమందే రీతి బ్రహ్మ పుట్టె ?
శంబునిసతి గంగ శంతనున్
పెండ్లాడె ?
వినిన కనిన గొప్ప వింతగాదె !

ఇవన్నీ తెలంగాణలో ప్రముఖ కవి రచయిత, 'భౌతికవాది' పత్రికాసంపాదకులు డాక్టర్ మలయశ్రీ ( 1940 – 2026 ఏప్రిల్ 10 ) గారికి కలిగిన సందేహాలు.

వీరు శతాధిక గ్రంథకర్త , నాస్తికవాదాన్ని బలపరుస్తూ సంస్కృతంలో కూడా వీరొక శతకాన్ని రచించారు.

మతమేదైనా దేవుళ్ళు, ఆత్మలు, పరలోకాలు, పునర్జన్మలు, కర్మ, అదృష్ట దురదృష్టాలు, వరాలు, శాపాలు, కర్మకాండ వంటివన్నీ ఉత్తివే నంటారు వీరు.

ఆ మాటకొస్తే బౌద్ధంలోని సన్యాసం, భిక్షాటన, జైనంలోని దిగంబరత్వం, బుద్ధుడిని భగవాన్ అనడం వంటివి వీరికి మింగుడుపడని విషయాలే.

మలయశ్రీ మా పూర్వ కరీంనగర్ జిల్లా చెంజర్లకు చెందినవారు.

మా స్వగ్రామం రాయికల్ కు సమీపంలోని కోరుట్లలో బహుకాలం అధ్యాపకులుగా పనిచేశారు .

1991 లో ప్రభుత్వం వారి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందారు.

వీరి రచన 'శాంతిపథం' 1974 ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకంగా ఎంపికయింది.

మలయశ్రీతో ముందు మాఅన్న వేముల పెరుమాళ్ళుకి, తర్వాత నాకు పరిచయం ఏర్పడింది .

తెలుగు సాహిత్యంలో నేను మొదట్లో చదివిన ఒక పి హెచ్ డి గ్రంథం డాక్టర్ బి రామరాజు 'జానపద గేయాలు – సాంఘిక చరిత్ర ( 1974 )', మళ్ళీ అంతటి కృషి, పరిశోధన నాకు మలయశ్రీ గారి రచన 'కరీంనగర్ జిల్లా తెలుగు సాహిత్య చరిత్ర ( క్రీ శ 950 – 1995 )'లో కనబడింది.

ఈ గ్రంథ విషయసేకరణ కోసమే వారు దాదాపు 5 సంవత్సరాలు జిల్లా అంతా తిరగడం, ఆ పుస్తక ప్రచురణ కోసం మరో 2 సంవత్సరాలు కష్టపడడం విశేషం.

మా మాతామహుడు వరకవి భూమగౌడు (1875 – 1950), అదే కాలం, మా గ్రామానికే చెందిన కవి తిరునగరి నరసింహస్వామి గారలను మొదట ఈనాటి సాహితీలోకానికి పరిచయం చేసిన వాడు డాక్టర్ మలయశ్రీ గారే.

అదే గ్రంథములో మలయశ్రీ గారు మా వేముల సోదరులిద్దరి పరిచయాలు కూడా రాశారు.

నా 'బతుకు తొవ్వ' దీర్ఘ ముక్తక కావ్య గుచ్ఛానికి 'స్వచ్ఛంద స్వేచ్ఛా కవితలు' పేరుతో మలయశ్రీ తమ అమూల్యమైన అభిప్రాయాన్ని రాశారు.

అంతేకాదు దానితోపాటు మాఅన్న గారి జ్యోతిపథం రేడియో ప్రసంగాల సంకలనం ' మానవతా పరిమళాలు ' ఒకే వేదిక పై ( 2009 సెప్టెంబర్ 12 నాడు ) హైదరాబాద్ లో జరిగిన రెండింటి గ్రంథావిష్కరణల సభకు కూడా వారు అతిథిగా వచ్చారు.

ఈనాటి యువతరం స్వార్థచింతనలో పడి సమాజాన్ని, శాస్త్రీయ ఆలోచనలను పట్టించుకోవడం లేదు, తాత్విక ఆలోచనలకు దూరమౌతున్నారన్నది డాక్టర్ గారి అభిప్రాయం.

వారిని ఎప్పుడు వెళ్లి కలిసి మాట్లాడినా వీడ్కోలు పలికేప్పుడు తప్పకుండా ' సెలవిప్పటికి స్నేహ మెప్పటికి ' అని అనేవారు.

ఎప్పుడు కాని ఎక్కడ కాని.. ఎవరికి కాని ఎందుకు కాని వంచవద్దు తల వంచవద్దు.. వంగి సలాములు చేయవద్దు ! అన్నది మలయశ్రీ హితోక్తి !

( మలయశ్రీ గారికి
కన్నీటి నివాళి )

**వేముల**

## వికలాంగులు ఆత్మగౌరవంతో జీవించేలా కేంద్ర ప్రభుత్వం కృషి

• కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**సికింద్రాబాద్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** దివ్యాంగులు ఆత్మగౌరవంతో స్వతంత్రంగా జీవించేలా పలు సంక్షేమ పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని కేంద్ర కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తార్నాక డివిజన్ పరిధిలోని లాలాపేట కార్తీక గార్డెన్స్ లో శనివారం దివ్యాంగులకు మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, చక్రాల కుర్చీలు, వాకర్లు, వినికిడి యంత్రాలు వంటి పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిషన్ రెడ్డి హాజరై లబ్ధిదారులకు సహాయక పరికరాలను అందజేసి మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వారికి అవసరమైన సదుపాయాలు అందించేందుకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బండ కార్తీక చంద్రారెడ్డి, మేకల సారంగపాణి , నాగేశ్వర్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మల్లికంటి వీరన్న, రాము వర్మ, కిరణ్ గౌడ్,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**శామీర్‌పేట్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** హకీంపేట్ బస్ డిపో ఆధ్వర్యంలో నూతనంగా ఉషార్ పల్లి నుండి సికింద్రాబాద్ వరకు ఏర్పాటు చేసిన సర్వీస్ నెంబర్ 120 బస్సును జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి,మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ్,పలువురు కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ.. కొత్త బస్సు సర్వీస్ ప్రారంభం ద్వారా ఉషార్ పల్లి మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు ఉద్యోగ, విద్య,వైద్య అవసరాల కోసం సికింద్రాబాద్‌కు సులభంగా చేరుకునే అవకాశం లభిస్తుంది. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం ఎంతో అవసరమని,ఈ బస్సు సేవ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల కౌన్సిలర్లు దోస కాయల లత వెంకటేష్,పెద్దిరెడ్డి శ్రీలత వెంకట్ రెడ్డి,రాజిగళ్ళ లత భూపాల్,మెరుపాటి గోవర్ధన్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నేమూరి విష్ణు గౌడ్, నాయకులు నల్ల ప్రభాకర్ రెడ్డి,తుంకి వెంకటేశం, పెద్దిరెడ్డి వెంకటరెడ్డి,కొండల్ రెడ్డి,నాగిరెడ్డి పెంటారెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేడిచెట్టుతండా గ్రామాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



**బొంరాస్‌పేట, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** గ్రామ అభివృద్ధే తన లక్ష్యమని, గ్రామాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతనని మేడిచెట్టుతాండ గ్రామ సర్పంచ్ రవి నాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలోని బోడబండ తండా ప్రాథమిక పాఠశాల ప్రహరి గోడను జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన రూ.10 లక్షల నిధులతో పూర్తి చేయడం జరిగిందన్నారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నాడన్నారు. అందరూ కలిసికట్టుగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాజు నాయక్ తండావాసులు పాల్గొన్నారు.

## ఎస్‌టీపీని జనవాసాలకు దూరంగా తరలించాలి



**అమీన్పూర్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** అమీన్పూర్ పట్టణంలో జనవాసాల్లో నిర్మించ తలపెట్టిన ఎస్టిపిని జనవాసాలకు దూరంగా తరలించాలని అమీన్పూర్ పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలరెడ్డి పేర్కొన్నారు. శనివారం అమీన్పూర్ పట్టణంలోని ఆయా కాలనీల వాసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీ పి నీ జనవాసాలకు దూరంగా తరలించాలని ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. అందుకోసం ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని తిరుమల్ రెడ్డి పిలుపునిచ్చారు. అనంతపూర్ పీపుల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి నాయకులు నరేష్ నర్సింలు తదితరులున్నారు.

## ఉపాధి హామీలో శాలిపేటకు రాష్ట్రస్థాయిలో ఆరో స్థానం



**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** మాహా త్మ గాంధీ జాతీయ ఉపాధి పథకం మెదక్ జిల్లాలోని అత్యధిక పని దినాలు చేసిన గ్రామంగా శాలిపేట గ్రామం నిలిచింది. ఎంపీడీవో దామోదర్ మీడియాతో మాట్లాడుతూ, మెదక్ జిల్లాలోని చిన్నశంకరం పేట మండలం శాలిపేట గ్రామంలో అత్యధికంగా 311 దినాలు కూలీలు హాజరై ఎన్.ఎం.ఎస్ఫీల్డ్ అసిస్టెంట్ కిష్టయ్య కూలీలు పని చేశారని దీంతో రాష్ట్రస్థాయిలో ఆరవ స్థానంలో నిలిచిందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ కు శాలువా గప్పి ఘనంగా సన్మానించారు. కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన కార్యక్రమంలో శాలిపేట ఎఫ్ ఏ శ్రీనివాస్ కు డీ ఆర్ డి ఓ శ్రీనివాస్ రావు, జెడ్పీసిఓ ఎల్లయ్య, అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎఫ్ ఏ కు నగదు బహుమతిని అందించారు ఈ కార్యక్రమంలో ఏపీఓ రాజకుమార్ ఉన్నారు.

# మత్తు పదార్థాలతో యువత జీవితం అంధకారం

• జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు



**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** డ్రగ్స్ మహమ్మారిని పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మత్తు పదార్థాలతో యువత జీవితం అంధకారం అవుతుందని అదనపు కలెక్టర్ నర్సింగరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం నేపథ్యంలో నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా శనివారం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మత్తు పదార్థాల నియంత్రణ బలోపేత దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గద్వాల పాత బస్టాండ్ నుంచి కృష్ణవేణి చేస్తున్నారని చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా మీదుగా ప్రభుత్వ ఆసుపత్రి వరకు ముఖ్య అతిథులు,వైద్యాధికారులు, విద్యార్థులతో కలిసి డ్రగ్స్ వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో మత్తు ప్రభావితుల చికిత్స విభాగం, అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ సెంటర్ ను గద్వాల పురపాలక చైర్మన్ తుమ్మల జయలక్ష్మి, అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిఎస్పీ మొగులయ్య చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కేంద్రంలో మత్తు పదార్థాలకు బానిసైన వారికి మానసిక వైద్య నిపుణుల ద్వారా చికిత్స, కౌన్సిలింగ్ మరియు ఉచిత మందులు అందించబడతాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అదనపు కలెక్టర్ నర్సింగరావు మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల యువత భవిష్యత్తు తీవ్రమైన ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు తీసుకుని డ్రైవింగ్ చేయడం వలన జరిగే యాక్సిడెంట్లలో చాలామంది యువత ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకొని, ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా చదువుతూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. యోగ, ధ్యానం, వ్యాయామం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో వచ్చే ఒత్తిడిని సరైన ప్రణాళికతో అధిగమించవచ్చని తాత్కాలిక ఉపశమనం కోసం మత్తు పదార్థాలవైపు మళ్లడం భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. యువత ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకొని, కుటుంబానికి, సమాజానికి, దేశానికి ఉపయోగపడే మంచి పౌరులుగా ఎదగాలని ప్రేరణాత్మకంగా పిలుపునిచ్చారు. డీఎస్పీ మొగిలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో మత్తు పదార్థాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు, ఈ దిశగా ఈగల్ టీమ్ నిరంతరం పనిచేస్తుందని తెలియజేశారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసై ఉంటే లేదా డ్రగ్స్ పంపిణీ జరుగుతున్నట్లు తెలిసినా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1908 కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం మెడికల్, నర్సింగ్ కళాశాలల విద్యార్థులకి నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు డాక్టర్ హేమలత, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వెంకట దాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సంధ్య కిరణ్మయి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వైస్ డాక్టర్ నాగేశ్వరరావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్లు శ్రీనివాసులు,మధు, వైద్య, నర్సింగ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ సాధన క్యాంపును జయప్రదం చేయండి

• సిఐటియు జిల్లా అధ్యక్షులు బి. మల్లేష్



**చౌటకూర్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** మండలంలోని ఈరోజు సామాజిక న్యాయ సాధన క్యాంపెయిన్ లో భాగంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు బి మల్లేష్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగ శివంపేటకు రావడం జరిగింది. ముందుగా కరపత్రం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కులం మతం లింగ భేదం లాంటి సామాజిక అంశాలు మనదేశంలో ప్రజల్ని కార్మిక వర్గాన్ని ఐక్యం కానివ్వకుండా ఆటంకంగా ఉన్నాయి అని అన్నారు కార్మిక వర్గంలో సున్నితమైన ఈ అంశాలను దోపిడి వర్గాల ప్రయోజనాల కోసం పాలకవర్గాలు ముందుకు తెస్తూ కార్మిక వర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేసి దోపిడి వర్గాలు తమ ప్రయోజనాలను కాపాడుకుంటున్నారన్నారు అన్ని రకాల దోపిడి అణచివేత వివక్షలకు వ్యతిరేకంగా పోరాడి వీటి నుండి శ్రామిక వర్గాన్ని విభక్తి చేసి పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా కార్మిక వర్గ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో సిఐటియు పనిచేస్తుందని అన్నారు ఏప్రిల్ 6 సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బిటి రణదీవి వర్ధంతి నుండి ఏప్రిల్ 15 వరకు తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయ సాధన క్యాంపెను నిర్వహించాలని సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ క్యాంపెయిన్ లో సిఐటియు అనుబంధ సంఘాలన్నీ భాగస్వాములు కావాలని రాష్ట్ర కార్మిక వర్గంలో సామాజిక న్యాయసాధన క్యాంపెను విజయవంతం చేయాలని కోరారు. ఈ క్యాంపేది లో భాగంగా ఏప్రిల్ 8 9 10 తేదీల్లో సామాజిక ఉద్యమ నిధిని కార్మికుల నుండి వసూలు చేయాలని ఈ కార్యక్రమంలో అన్ని స్థాయిల్లోని సిఐటియు యంత్రాంగం పాల్గొనాలని పిలుపునిచ్చారు రాష్ట్రంలో నేటికీ ఇంకా అక్కడక్కడ పరిశ్రమలో విద్యాలయాల్లో పని ప్రదేశాల్లో చాప కింద నీరుల కుల వివక్ష కొనసాగుతుంది అని దళితులు గిరిజనులు మహిళలు మైనార్టీ ఉద్యోగులు వివక్ష దాడులకు గురవుతూనే ఉన్నారని అన్నారు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న కుల దురంకార చర్యలు అన్నింటిని నిరసిస్తూ సిఐటి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు మతోన్మాదానికి వ్యతిరేకంగా నికరంగా పోరాడకుండా సామాజిక న్యాయం సాధించలేము ఈ లక్ష్యంతోనే రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక ఉద్యమాలకు కార్మిక వర్గం బాసటకు నిలవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బి మల్లేశం కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు వర్కింగ్ ప్రెసిడెంట్ పి బాగా రెడ్డి జనరల్ సెక్రెటరీ ప్రసన్న నాయకులు నాగభూషణం చంద్రయ్య విట్టల్ లక్ష్మారెడ్డి కాంటాక్ట్ లేబర్ జనరల్ సెక్రెటరీ కే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీతిమ్మప్ప స్వామిని దర్శించుకున్న ఏఎస్పీ



**మల్దకల్, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** ఆదిశిలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామిని శనివారం రాయచూరు జిల్లా ఏఎస్పీ హరీష్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు రమేషాచారి, చంద్రశేఖరరావు ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో రాయచూర్ ఏఎస్ఐ బసవరాజు తదితరులు పాల్గొన్నారు. దేవాలయంలో అన్నదానం శనివారం సందర్భంగా దేవాలయానికి వచ్చిన భక్తులకు దేవాలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు,ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దేవస్థానం తరపున స్థానిక అన్నదాన సత్రంలో పూజలు నిర్వహించే అన్నదానం చేశారు.

## ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానం

• ఏసీపీ రవీందర్ రెడ్డి




**బెజ్జంకి, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని సత్యార్జున ఫంక్షన్ హాలులో నిర్వహించిన సిద్దిపేట సురక్ష నేత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏసిపి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఏసీపీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని అన్నారు. గ్రామాల్లో నేరాలను తగ్గించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని చెప్పారు. ప్రతి గ్రామంలో సర్పంచులు,ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవతో ప్రధాన కూడళ్లు,రద్దీ ప్రదేశాలు,ప్రజలు అధికంగా రాకపోకలు చేసే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా నేరాలను అరికట్టడమే కాకుండా,జరిగిన ఘటనలను త్వరగా ఛేదించేందుకు పోలీసులు సులభంగా పనిచేయగలరని సీసీ కెమెరాల ప్రాముఖ్యతను అందరికీ అర్థమయ్యేలా వివరించారు. ప్రజల శాంతిభద్రతల కోసం పోలీసులకు సహకరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీను,బెజ్జంకి ఎస్సై బి సౌజన్య,మండలంలోని సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు,యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో బీజేపీ పార్టీని విస్తరించాలి




**చేర్యాల / మద్దూరు, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** క్షేత్రస్థాయిలో బీజేపీ పార్టీని విస్తరించాలని బీజేపీ నేత డాక్టర్ కళ్యాణ్ నాయక్ అన్నారు. శనివారం మద్దూరు మండల కేంద్రంలో జరిగిన పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ 2026 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కళ్యాణ నాయక్ హాజరై మాట్లాడుతూ.. బిజెపిని సంస్థగతంగా మద్దూరు మండలంలో ప్రతి బూతుకు విస్తరించాలని, బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని ఎండగడుతూ ఎమ్మార్వో, ఎంపీడీవో ఆఫీసుల ముందు ధర్నాలు చేపట్టాలని ప్రజా సమస్యల పైన వీధి పోరాటాలు చేయాలని, రాబోవు స్థానిక ఎన్నికల్లో మద్దూరు మండలం పైన బిజెపి జెండా ఎగర వేయడమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా ఈ యొక్క కార్యక్రమానికి అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు భారతీయ జనతా పార్టీలో గుర్తింపు ఉంటుందని సాధారణ కార్యకర్త కూడా రాష్ట్రస్థాయిలో జాతీయస్థాయిలో ఎదిగే అవకాశం భారతీయ జనతా పార్టీలో మాత్రమే ఉంటుందని అన్నారు. స్థానిక సమస్యల పైన నిత్యం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు మోకు ఉదయ రెడ్డి, ప్రశిక్షణ అభియాన్ మండల కన్వీనర్ జిల్లా ఉపాధ్యక్షులు దండ్యాల లక్ష్మారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మహేందర్ రెడ్డి, రేబర్తి సర్పంచ్ నీరటి శ్రీనివాస్, జిల్లా నాయకులు మాజీ ఎంపీటీసీ రాపాక బుచ్చి రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిలు బొంగోని బాలు, ఉప సర్పంచ్ బియ్య రమేష్, కూరెళ్ల కిరణ్, మండల నాయకులు మేక సుదర్మ, నారదాసు రాజు, సందీప్, కృష్ణా రెడ్డి,కుంభం రవీందర్ రెడ్డి,వార్డ్ సభ్యులు సంపత్, బస్వరాజు స్వామి, అల్డా శ్రీకాంత్, భీష్మచారీ సీనియర్ నాయకులు వీరన్న, బొల్లు రాజు, బోడపట్ల వినయ్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రగతినగర్ నుంచి నల్లచెరువు వరకు అభివృద్ధి

**ఉప్పల్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రామంతాపూర్ డివిజన్ పరిధిలోని ప్రగతి నగర్ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. కాలనీలోని రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, తాగునీటి సరఫరా లోపాలు వంటి అంశాలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను ఓర్పుతో విన్న ఎమ్మెల్యే గారు, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం తన బాధ్యత అని, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గారు ఉప్పల్ నల్ల చెరువును సందర్శించి, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను సమగ్రంగా సమీక్షించారు. చెరువు పునరుద్ధరణ, శుభ్రత, సుందరీకరణ కార్యక్రమాల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించి, పనుల నాణ్యతపై అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు నల్ల చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి, ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన చెరువును నేడు అందమైన "తెల్ల చెరువు"గా తీర్చిదిద్దామని తెలిపారు. చెరువు పరిసరాల్లో మురుగు తొలగింపు, నీటి శుద్ధి, గట్టు బలపరచడం వంటి పనులతో పాటు నడక దారులు, విద్యుత్ దీపాలు, వాహన నిలుపుదల స్థలాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కలిగిందన్నారు. ప్రభుత్వ సహకారంతో ఉప్పల్ చెరువును మరో ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. కుటుంబాలతో కలిసి సందర్శించేందుకు అనువుగా పార్కులు, విశ్రాంతి స్థలాలు, పిల్లల ఆట స్థలాలు, ఆకర్షణీయమైన దీపాల వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. చెరువుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, చెరువులను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన సూచించారు. భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన పర్యావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
12 ఏప్రిల్ 2026

# మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. శనివారం 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' హెల్త్ వీక్ లో భాగంగా "డ్రగ్స్ కంట్రోల్ ఒ రెగ్యులేటరీ స్ట్రెంథనింగ్ డే"మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు మరియు యువతలో చైతన్యం నింపేందుకు మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా నుండి మెదక్ టీ.ఎన్ జీవో భవన్ వరకు అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ ప్రారంభించారు. అనంతరం టీ ఎన్జీవో.వో భవన్లో సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, డి సి హెచ్ ఎస్ శివ దయాల్, పోలీస్, హెల్త్ సిబ్బంది తో కలిసి




నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగాన్ని మూకుమ్మడి అరికట్టాలని, విచ్చలవిడిగా డ్రగ్స్ వాడొద్దని, మెడికల్ షాపుల్లో అమ్మే మందులకు, గోలీలకు డాక్టర్ పిస్క్రిప్షన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పాఠశాల స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. డ్రగ్స్ రైతు సమాజాన్ని నిర్మించాలన్నారు. సరదా, తాత్కాలిక ఉపశమనం కోసం డ్రగ్స్ ను అలవాటు చేసుకుంటే అత్యంత ప్రమాదం అన్నారు. అనారోగ్య సమస్యలతో జీవితం చిన్నాభిన్నం అవుతుందన్నారు. ఈగల్ ఫోర్స్ ఏసిపి శివ నాయుడు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలు విక్రయాలు చేస్తే చట్టంలో కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. మెడికల్ షాపుల్లో ఎలాంటి మత్తు పదార్థాలు దొరికిన షాపును పూర్తిగా మూసివేసి, 20 సంవత్సరాలు కఠినంగా జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, డిసిహెచ్ శివదయాల్, డీఎస్పీ ప్రసన్నకుమార్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు, మెడికల్ షాప్ యజమానులు, ఫార్మసీ విద్యార్థులు, పాల్గొన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన ఫార్మసీ విద్యార్థులకు ప్రశంసా పత్రం, షీల్డ్ ను బహుకరించి అభినందించారు.

## డిఫెన్స్ డ్రైవింగ్ పాటిస్తే, రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు

- జిల్లా ఎస్పీ వినీత్




నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 11 (జనం సాక్షి) : రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రతి వాహనదారు తప్పనిసరిగా డిఫెన్స్ డ్రైవింగ్ విధానాన్ని అలవాటు చేసుకోవాలని నారాయణపేట జిల్లా ఎస్పీ వినీత్ సూచించారు. డిఫెన్స్ డ్రైవింగ్ అంటే మన తప్పు కాకపోయినా ఇతరుల తప్పులను ముందుగానే అంచనా వేసి జాగ్రత్తగా వాహనం నడపడం రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ఇది చాలా ముఖ్యమైన నైపుణ్యమని ఇది ప్రతి డ్రైవర్ కలిగి ఉండాలని తెలిపారు.అరయివ్, అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా వారం రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు మరియు గ్రామ సభలలో డిఫెన్స్ డ్రైవింగ్ పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని మరియు కమిటీలు ఏర్పాటు చేసి నిరంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు, అందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఎస్పీ తెలిపారు. ఎస్పీ కొన్ని ముఖ్యమైన అంశాలు తెలిపారు. వాహనం నడిపేటప్పుడు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలి.ముందున్న వాహ నంతో సురక్షిత దూరం పాటించాలివేగాన్ని నియంత్రణలో ఉంచాలి మద్యం సేవించి వాహనం నడపకూడదుమొబైల్ ఫోన్ ఉపయోగించకుండా డ్రైవింగ్ చేయాలనీ,ట్రాఫిక్ నియమా లను కచ్చితంగా పాటించా లనీ అన్నారు.రోడ్డు ప్రమా దాలలో ఎక్కువగా యువతే ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యువత బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని కోరా రు.జిల్లాలో రోడ్డు ప్రమాదా లను పూర్తిగా నివారించా లంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని అన్నారు, ప్రతి ఒక్కరూ స్వీయ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని డ్రైవింగ్ చేయాలని సూచించారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే



**సదాశివపేట, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. దేశాన్ని అభివృద్ధి వైపు మరలించిన మహానుభావుల్లో పూలే ఒకరిని పేర్కొన్నారు. శనివారం జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బిఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూలే సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్య అభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, మానవతవాది అని అన్నారు. చదువు లేనిదే జ్ఞానం లేదని సత్యాన్ని గ్రహించి పూలే తన భార్య సావిత్రిబాయి పూలే తో కలిసి దేశంలోని మొదటిసారిగా1848లో పూనెలో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతా గోపాల్, మున్సిపల్ కౌన్సిలర్ లు నసీరుద్దీన్,బిఆర్ఎస్ నాయకులు వాదోని రాజు, ముబీన్, ఖాజా,నాగుల విజయ్,జబ్బర్,ప్రవీణ్,లతీఫ్,రామగౌడ్, రోషన్ పటేల్,అశోక్ గౌడ్, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

- అక్రమ నిర్మాణాలకు కూల్చివేతలు
- పేదలకు మినహాయింపు

**అమీన్పూర్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** ఆమీన్‌పూర్ శివారులోని ఐలాపూర్‌లో ప్రభుత్వ భూములను కాపాడేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ (హైడ్రా) మరోసారి రంగంలోకి దిగింది. శనివారం ఉదయం సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం ఐలాపూర్ గ్రామంలో భారీ కూల్చివేతలకు శ్రీకారం చుట్టింది. సుమారు 2,000 మంది రెవెన్యూ, హైడ్రా సిబ్బంది, 1,000 మందికి పైగా పోలీసుల బందోబస్తు మధ్య ఈ మెగా ఆపరేషన్ జరిగింది. ఐలాపూర్లో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని అధికారులు భారీ యంత్రాలతో నేలమట్టం చేశారు. దీనితో పాటు 1998 నుంచి కోర్టు స్టే ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన న్యాయవాది ముఖీంకు చెందిన గెస్ట్ హౌస్ను కూడా అధికారులు మరోవైపు, కిష్టారెడ్డిపేటలోని కేవీ రెసిడెన్సీ, క్రిస్టల్ డే వలపర్స్ భవనాల్లో నివసిస్తున్న 45 కుటుంబాలను అధికారులు ఖాళీ చేయించారు.



గ్రామానికి చెందిన టిఆర్ఎస్ నేత ఇంటిని కూల్చేయడంతో కుటుంబ సభ్యులంతా రేవంత్ రెడ్డి పై దుమ్మెత్తి పోశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తమను బలవంతంగా బయటకు పంపుతున్నారని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ, పేదలు నివసించే ఇళ్లను తాము లక్ష్యంగా చేసుకోలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను భారీగా ఆక్రమించి నిర్మించిన వాణిజ్య, పెద్ద కట్టడాలపైనే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# సఫాయి కార్మికుల పని వేళలు సడలించాలి



**తూప్రాన్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** మండుతున్న ఎండల నేపథ్యంలో పనివేళలు సడలించాలని తూప్రాన్ మున్సిపల్ సఫాయి కార్మికులు అధికారులను కోరుతున్నారు. పని భారం ఎంత ఉన్నా టార్గెట్‌ను పూర్తి చేస్తామని, అయితే ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విధులు నిర్వహించేందుకు అనుమతించాలని వారు వినతిపత్రం సమర్పించారు. కార్మికుల వివరాల ప్రకారం, ఇటీవల ఎండల కారణంగా ఆరోగ్య సమస్యలు తీవ్రంగా పెరుగుతున్నాయి. నిన్న రావెల్లి ప్రాంతానికి చెందిన కార్మికుడు పద్మారావు విధుల మధ్యలోనే సొమ్మసిల్లి పడిపోగా, మరొక రోజు తూప్రాన్‌కు చెందిన మహిళా కార్మికురాలు బైక్‌పై వెళ్తూ చక్కరతో కిందపడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ సంఘటనలు కార్మికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇక నర్సాపూర్, రామాయంపేట మున్సిపాలిటీల్లో ఎండలను దృష్టిలో ఉంచుకుని ఒక పూట పని విధానం అమలు చేస్తున్నారని కార్మికులు పేర్కొన్నారు. అదే విధానాన్ని తూప్రాన్‌లో కూడా అమలు చేయాలని కోరగా, అధికారులు రెండు పూటల పనిని కొనసాగించాలని సూచించడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందని వారు తెలిపారు. శనివారం ఉదయం విధులు ముగించుకుని వెళ్లే సమయంలో మున్సిపల్ అధికారులు కఠిన హెచ్చరికలు జారీ చేశారని, అవసరమైతే తమ స్థానంలో ఇతర కార్మికులను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని కార్మికులు ఆరోపించారు. ఎండల్లో ఉదయం, సాయంత్రం రెండుపూటలుగా పని చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, ఇది తమ ఆరోగ్యానికి ప్రమాదకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్న ఈ పరిస్థితుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణం స్పందించి మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకుని తమను ఆదుకోవాలని తూప్రాన్ మున్సిపల్ సఫాయి కార్మికులు విజ్ఞప్తి చేశారు.

## విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**తూప్రాన్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నాల్గవ రోజు సమ్మెలో భాగంగా తూప్రాన్ డివిజన్ ఆఫీస్ ముందు ఆర్టిజన్స్ పిస్ రేట్, మీటర్ రీడర్స్ కార్మికుల సమ్మెలో పాల్గొనడం జరిగింది. సమ్మెను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిజన్స్ కు ఏపీ ఎస్బి రూల్స్ ఇచ్చి కన్వర్షన్ ఇవ్వాలను అలాగే అన్మాండ్ వర్కర్స్ ను సంస్థ లో విలీనం చేసుకోవాలని పీస్ రేట్, మీటర్ రీడర్స్ కార్మికులకు 11 నెంబర్ జీవో ప్రకారం వేతనం తో పాటు 30 రోజుల పని కల్పించాలని విద్యుత్ సంస్థల పని చేసినటువంటి ఆర్టిజన్ కార్మికులందరికీ కూడా ఏపీఎస్పీ రూల్స్ ఇవ్వాలని విద్యా అర్హతలను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని గత ప్రభుత్వము సంస్థల విలీనం చేసుకుంటునామాని చెప్పి మోసం చేసారని, కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ,



విద్యుత్ శాఖ మంత్రి ఎన్నికల ముందు పాదయాత్రలలో అనేక సభలలో ఇచ్చినటువంటి హామీలను విద్యుత్ కార్మికుల కుటుంబాల్లో వెలుగు నింపుతామని చెప్పడం జరిగింది. కార్మికులందరూ ఐక్యతతో హక్కులను సాధించుకోవాలన్నారు. కార్మిక వర్గానికి పోరాటాలు కొత్తమీ కాదని పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయి అన్నారు. సమస్య పరిష్కారమైతే వరకు పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం రాజు శ్రీను వెంకట్రాజ్యం పంతుల్య నవనీత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

- డీఎస్పీ నల్లపు లింగయ్య

**నారాయణపేట, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** నేరాల నియంత్రణపై పోలీసులు దృష్టి సారించా లని నారాయణపేట డీఎస్పీ లింగయ్య అన్నారు. నారాయణపేట సర్కిల్, కోస్గి సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో డీఎస్పీ కార్యాలయంలో శనివారం నేర సమీక్షా సమావేశాన్ని నల్లపు లింగయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించా లని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై సమగ్రంగా చర్చిస్తూ, గ్రేవ్ మరియు నాన్-గ్రేవ్ కేసుల దర్యాప్తు విధానంపై సీఐలు,ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు.దర్యాప్తు సమయంలో అనుసరించాల్సిన విధానాలు, సేకరించాల్సిన ఆధారాలు, ప్రామాణిక విధానాలు (ఎస్ఓపి) గురించి వివరంగా మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ



ఇన్వెస్టిగేషన్ ఉండాలని, ప్లాన్ ఆఫ్ యాక్షన్ ప్రకారం దర్యాప్తు జరిపి కేసులను ఛేదించాలని సూచించారు. కేసుల్లో శిక్షల శాతం పెంచేందుకు పటిష్ట ఆధారాలు సేకరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేసు నమోదు నుండి చార్జ్‌షీట్ దాఖలు వరకు ప్రతి అంశాన్ని కూలంకషంగా పరిశీలించి పూర్తి పారదర్శకతతో దర్యాప్తు జరపాలని పేర్కొన్నారు అక్రమ ఇసుక రవాణా, గంజాయి, గుట్కా, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి వాటిని నిర్మూలించాలని ఆదేశించారు. ఫోక్సో, ఎస్సీ / ఎస్టీ, ఇతర గ్రేవ్ కేసుల్లో వేగంగా దర్యాప్తు పూర్తి చేసి 60 రోజుల్లో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు.ప్రతి పోలీసు అధికారి స్టేషన్ మేనేజ్‌మెంట్‌తో పాటు పూర్తి స్థాయి దర్యాప్తు పరిజ్ఞానం కలిగి ఉండాలని, కేసులను ప్రతిరోజు ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులను త్వరితగతిన ఛేదించాలని ఆదేశించారు. అరయివ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో సీఐలు శివశంకర్, సైదులు, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, సతీష్ రెడ్డి, విజయ్, స్టేషన్ రైటర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న ఐదు డిఏలను వెంటనే చెల్లించాలి




**మక్తల్, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** మక్తల్ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో రెండవ శనివారం మక్తల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో అధ్యక్షుడు బి.గోపాలం అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పెన్షనర్స్ కు రావలసిన మాకష్టార్జితం, మేం ఉద్యోగంలో ఉన్నప్పుడు మేం దాచుకున్న పెన్షన్, జిపిఎఫ్, కమ్యూటేషన్, గ్రాటుయిటీ, అర్జిత సెలవు, సరెండర్ లివ్, గ్రూప్ ఇన్సూరెన్స్ సొమ్మును మొత్తం వెంటనే చెల్లించాలని సూచించారు. పెండింగ్లో ఉన్న 5 డిఏ లను వెంటనే నగదు రూపంలో అందించాలన్నారు. గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 56 మంది పెన్షనర్స్ కు రావలసిన బెనిఫిట్స్ అందక, మరణించారని ఆవేదన వ్యక్తపరుస్తూ, వారి ఆత్మ శాంతి కొరకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సిద్ధి లింగయ్య, సూర్య ప్రకాష్,కిష్టయ్య గౌడ్, విద్యావతి, సుజాత, రామ్ చందర్, కే. సురేందర్, నారాయణరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం




**కల్వకుర్తి రూరల్, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** సమాజ సేవ పట్ల అంకితభావంతో ముందుకు సాగుతున్న మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయ్యింది. ఈ శిబిరంలో సుమారు 250 మంది రోగులు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేయించుకొని నిపుణుల వైద్య సలహాలు పొందారు. ప్రత్యేకంగా ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ వడ్ల గోపికృష్ణశిబిరానికి హాజరై ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులపై సమగ్ర పరీక్షలు నిర్వహించి, రోగులకు విలువైన సూచనలు ఉచితంగా మందులు అందించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన సేవలను ప్రజలు ఎంతో అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్, కౌన్సిలర్లు శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులను అభినందించారు. పట్టణ ప్రజలు, ఫౌండర్ కుడుముల చంద్రకాంత్ రెడ్డి,మిత్ర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మిత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు కుకుడాల శ్రీకాంత్ నేత మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం మా బాధ్యతగా భావిస్తూ ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి చికిత్స అందించాలనేదే మిత్ర ఫౌండేషన్ లక్ష్యం. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను విస్తృతంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## వైభవంగా రామాలయం ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలు



**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** పెద్ద శంకరంపేటలోని శ్రీ సీతారామచంద్రస్వామి పునః ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయంలో వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛారణలతో పుణ్యాహవాచనము నవగ్రహ పూజ హోమము తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సీతారామ లక్ష్మణుల ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ చేయడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పూలతో ఆలయాన్ని సర్వంగ సుందరంగా ముస్తాబు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు.. బాధ్యులు రాగం సిద్దేశ్వర్ . మురళి పంతులు,కందుకూరి రవీందర్, సత్యనారాయణ.. జస్వంత్, సుభాష్ గౌడ్. అనిల్ డాక్టర్. సంగమేశ్వర్. కృష్ణమూర్తి . సంతోష్ కుమార్ అధిక సంఖ్యలో మహిళలు భక్తులు పాల్గొన్నారు.

## చిరుతపులిని బంధించేందుకు బోన్లు ఏర్పాటు చేయాలి



**మల్దకల్, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** మండలంలోని నేతివానిపల్లి గ్రామంలో గత 3 నెలల క్రితం గ్రామ శివారులోని దాదాపు 10 మూగ జీవాలు చిరుతపులి దాడిలో మృతి చెందాయని దీంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళన చెందుతున్నారని,వెంటనే గ్రామస్తులకు రక్షణ కల్పించాలని శనివారం నడిగడ్డ తెలంగాణ జాగృతి నాయకులుతిమ్మప్ప, తిమ్మప్పనాయక్ ఫారెస్ట్ రేంజ్ అధికారి పర్వేజ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ 9న నేతివానిపల్లి గ్రామంలో అటవీశాఖ అధికారులు చిరుత పులి సంచరిస్తున్న ప్రదేశంలో సీసీ కెమెరాలు అమర్చగా లేగ దూడపై దాడి చేస్తున్న దృశ్యాలు సీసీ పుటేజీలో రికార్డు అయ్యాయని,ఏప్రిల్ 10న రాత్రి 10గంటల సమయంలో గొర్రెల మందపై చిరుతపులి దాడి చేసిందని దీంతో ఒక గొర్రె చిరుత దాడిలో మృతి చెందిందని,దీంతో చుట్టూ ప్రక్కల గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారని తెలిపారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి చిరుతపులిని బోనులో బంధించి,ఆయా గ్రామ ప్రజలకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చిరుత దాడిలో మృతి చెందిన జీవాలకు ప్రభుత్వం పరంగా నష్ట పరిహారాన్ని రైతులకు అందించాలనికోరారు.ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా అటవీశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి
- జేఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ప్రకటన



**వరంగల్ ఈస్ట్, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై జర్నలిస్టుల సంక్షేమ సంఘం(జె ఎస్ ఎస్ రి. నెం. 914/2015) పాటుపడు తుందని జర్నలిస్టుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు మానసాని కృష్ణారెడ్డి అన్నారు. శనివారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కమిటీని వారు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 40 వేల మంది జర్నలిస్టులు ఉన్నారని, జర్నలిస్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అక్రిడేషన్ల ప్రక్రియ శాశ్వతం కాదని పేర్కొన్నారు. అక్రిడేషన్ ఒక్కటే జర్నలిస్టు సమస్య కాదని ఇంటి స్థలాల సమస్య కూడా ఉన్నదని అన్నారు. హెల్త్ కార్డులు, జర్నలిస్టుల పిల్లలకు విద్యాసంస్థలలో రాయితీల విషయం తదితర ముఖ్యమైన అంశాల సాధనకు సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగింది. భవిష్యత్తులో జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి జర్నలిస్టులు అందరూ ఏకతాటి పైకి వచ్చి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర కమిటీని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షులుగా తక్కెళ్ళపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కానుగంటి రాజు, ఉపాధ్యక్షులుగా నూటంకి ప్రభాకర్, దుగ్గల ప్రకాష్, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్ యాదవ్, బత్తుల సతీష్, సూరపాక రాజు, సామల విజయ్, మహిళా అధ్యక్షురాలుగా శాగంటి మంజుల తోపాటు మరికొంతమందిని రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మందిని రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకుంటామని అన్నారు. సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు బాలేశం, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## డిజిటల్ సాంకేతికతతో సేవలు మెరుగు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**పాలకుర్తి ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** డిజిటల్ సాంకేతికతతో అంగన్ వాడి సేవలు మెరుగు పడుతాయని. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని క్యాంపు కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ ఫోన్లో పం పిణీ కార్యక్రమం జరుగగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్ల పంపిణీతో సేవల్లో నాణ్యతా ప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం పని చేస్తోందని అన్నారు. బాలింతల, చిన్నారుల డేటా సేకరణ, నివేదికల పంపిణీ లబ్దిదారుల వివరాలను స్మార్ట్ఫోన్లలలో అప్లోడ్ చేయడానికి ఉపయోగపడుతోందని అన్నారు. అందులో భాగంగా పోషక లోపాలను అధిగమించేందుకు క్షేత్రస్థాయిలో చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఐరన్ మాత్రల వినియోగంపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల్లో మొత్తం 183 స్మార్ట్ఫోన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ లావుడ్యా మంజుల భాస్కర్, డీబ్ల్యువో, డీసీవో కోదండరాములు, సీడీఈవో సత్యవతి, మల్లీశ్వరీ, తాహేరా బేగం, రాధిక, సరళ, నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, జల్గం కుమారస్వామి అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు కుట్టుమిషన్ల పంపిణీ



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్11 (జనంసాక్షి) :** దిలావర్ పూర్ మండలంలోని కాల్వ గ్రామంలో శనివారం విశ్వకర్మ లబ్దిదారులు కొండాపురం వనిత నర్సయ్య, జంబుగ నవనీత నరేష్, తులసి భార్గవి లక్ష్మణ్లకు కుట్టు మిషన్లను పంపిణి చేశారు. పియం విశ్వకర్మ యోజన నిర్మల్ జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యులు సామ రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఈ పథకంలో జిల్లాలో దాదాపు 3500 కుటుంబాలకు ప్రయోజనం చేకూరిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి అంతరించి పోతున్న చేతి వృత్తులను తిరిగి లాబదాయకంగా మార్చాలనే తలంపుతో దాదాపు 16 రకాల చేతి వృత్తులవారికి అతి తక్కువ వడ్డీతో లక్ష నుండి మూడు లక్షల వరకు రుణాలు అందించడం జరిగిందని తెలిపారు. పదిహేను వేల రూపాయల చేతి పనిముట్ల కిట్టును ఉచితంగా ఇవ్వడం జరిగిందని వారు వారి కుల వృత్తులను తిరిగి ప్రారంభించి సమాజంలో ఆర్థికంగా ఎదగాలని ఈ పథకం ఉద్దేశం అని అన్నారు. ఈ కార్యక్రమం లో అయిండ్ల నర్సారెడ్డి బీజేపీ మండల అధ్యక్షులు, మండల నాయకులు నరేష్ రెడ్డి, శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఘనంగా వారసత్వ సంబురాలు



**నిర్మల్ రూరల్, ఏప్రిల్ 11 (జనంసాక్షి):** నిర్మల్ పట్టణంలోని సిటీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో శనివారం వారసత్వ సంబురాలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, వైద్య వృత్తి, సంస్కృతి, సాంప్రదాయాలపై జిల్లా రచయితలు రచించిన పలు పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. జిల్లాలో రచయితలు విశేషంగా సాహిత్య సృష్టి చేస్తున్నారని, ముఖ్యంగా మహిళా రచయితలు ముందుకు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం వైద్యులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకల్యాణి, జిల్లా వైద్యులు, కార్యక్రమ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి పూజలు



**కాళేశ్వరం , ఏప్రిల్ 12 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం త్రివేణి సంగమం తీరంలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జ్ మాధవి దేవి పూజలు జరిపారు. తన తండ్రి మరణించడంతో ఆయన అస్థికలను కాళేశ్వరం తీసుకువచ్చి వేద పండితులతో పూజలు జరిపించి త్రివేణి సంగమంలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఆలయ కార్య నిర్వహణ అధికారి మహేష్ , మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు , కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి తదితరులు ఉన్నారు.

# యువత ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

- వ్యసనాలకు బానిసై భవిష్యత్ నాశనం చేసుకోవద్దు
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- భూపాలపల్లిలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన ర్యాలీ




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** యువత చదువు, క్రీడలపై దృష్టి సారించి ఉజ్వల భవిష్యత్ కు బాటలు వేసుకోవాలని, చెడు వ్యసనాలకు బానిసై భవిష్యత్ నాశనం చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు లు కోరారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించేందుకు శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్ నుండి డా బిఆర్ అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఇద్దరు మాట్లాడుతూ డ్రగ్స్ సమస్య సమాజానికి పెద్ద ముప్పుగా మారిందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలియజేశారు. డ్రగ్స్ బానిసల కోసం ప్రభుత్వం ప్రత్యేక డీ–అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. మన జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిలో డీ–అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయబడుతుందని వెల్లడించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్‌లో ఆరో రోజు మాదకద్రవ్యాల నివారణపై ఈ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. డ్రగ్స్ రవాణా, విక్రయం, వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. చదువుకున్న యువత చెడు అలవాట్లకు లోనవకుండా తమ జీవితాలను సవ్యంగా మలుచుకోవాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తెలిసినా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాజంలో డ్రగ్స్ నివారణలో యువత పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణ కోసం ప్రత్యేకంగా ఈగల్ టీం ఏర్పాటు చేసిందని, ఎవరినీ ఉపేక్షించడం జరుగదని వారు స్పష్టం చేశారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ డ్రగ్స్ నివారణకు పోలీసు శాఖ ద్వారా గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని. జిల్లాలో గంజాయి రవాణా దారులు గంజాయి విక్రేతలపై కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు. యువత డ్రగ్స్ పై అవగాహన లేకుండా సరదా కోసం తీసుకుంటూ కొద్దికొద్దిగా ఆ రొంపిలోకి దిగుతున్నారని వారికి అవగాహన వచ్చేసరికి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లాలో డ్రగ్స్ నివారణకు పోలీస్ శాఖ తరపున పటిష్ట నిగా ఏర్పాటు చేయడం జరిగిందని ఎలాంటి సమాచారం ఉన్న ప్రజలు భాధ్యతగా పోలీసులకు అందజేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.మధుసూదన్, డ్రగ్ ఇన్స్పెక్టర్ పావని, కౌన్సిలర్లు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ, చట్ట విరుద్ధ వైద్య చర్యలకు వ్యతిరేకం

- బాధ్యులపై తక్షణ కఠిన చర్యలు అవసరం
- ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ కాళీ ప్రసాదరావు



**వరంగల్ బ్యూరో, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** అక్రమ లింగ నిర్ధారణ చట్టవిరుద్ధ మైనటువంటి వైద్య చర్యలకు ఐఎంఏ వరంగల్ వ్యతిరేకంగా ఉంటుందని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ కాళీ సాదరావు అన్నారు. వరంగల్ నగరంలోని ఎంజీఎం వద్ద గల ఐఎంఏ హాల్లో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మన్మోహన్ రాజు అధ్యక్షతన శనివారం విలేకరుల సమావేశా న్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాళి ప్రసాద్ రావు మాట్లాడుతూ వరంగల్ జిల్లా కుందేలు గ్రామంలో చోటుచేసుకున్న గృహిణి మరియు బాలికల దారుణ హత్య సంఘటన బాధాకరమైన అన్నారు. ఈ కేసులో లింగ నిర్ధారణ, అక్రమ గర్భస్రావాలకు పాల్పడిన వైద్యులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న డాక్టర్ ఎస్. రవళి డాక్టర్ బాలినే పూర్ణిమ పేర్లు వెలుగులోకి రావడం అత్యంత ఆందోళన కరణ విషయం అన్నారు. ఐఎంఏ వరంగల్ బ్రాంచ్ తరపున ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నైతిక విలువలు మానవత్వానికి విరుద్ధంగా వ్యవహరించిన ఈ ఘటనను తాము సమర్ధించబోమని అన్నారు. ఐఎంఏ ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు అక్రమ గర్భస్రావాలు భారతదేశంలో చట్ట విరుద్ధమ న్నారు. సమాజంలో లింగ వివక్షతను మరింత పెంచే ప్రమాదకర చర్య లు అన్నారు. వైద్యులు ఈ విధమైన చర్యల్లో పాల్గొనడం వృత్తి నైతికతకు పూర్తిగా విరుద్ధమన్నారు. ఈ ఘటనలో సంబంధిత వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ద్వారా కఠినమైన చర్యలు తీసుకోవాలని తాము అధికారికంగా లేఖ రాయను న్నట్లు తెలిపారు. డాక్టర్ బందెల మోహన్ రావు మాట్లాడుతూ ఐఎంఏ వరంగల్ ద్వారా నైతిక మరియు శాసన కమిటీ ద్వారా అంతర్గతంగా కూడా విచారణ జరిపి తగిన శాసన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఐఎంఎ సెక్రటరీ డాక్టర్ శిరీష్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు మరలా పునరావృతం కాకుండా ఉండేందుకు వైద్య వర్గం సమాజంతో కలిసి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అక్రమ చర్యలకు పాల్పడిన ఎవరినైనా కఠినంగా ఎదుర్కోవ డంలో తాము కట్టుబడి ఉన్నామ న్నారు. ఈ కేసును చేదించి నిందితులను పట్టుకున్న పోలీస్ శాఖ అధికారుల కృషిని మనస్ఫూర్తిగా అభినంది స్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖతో కలిసి సమన్వయంతో పని చేస్తామని అన్నారు. ఈ సమావేశంలోడా మల్లేశం,డా కె. వెంకట స్వామి వరంగల్ డా ఎం. దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## 2కే రన్‌లో రాణించిన చల్లగరిగె యువకుడు

**చిట్యాల, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్', యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన 2కే రన్ పోటీల్లో మండలంలోని చల్లగరిగె గ్రామానికి చెందిన పోశాల రాకేష్ (17) ప్రతిభ కనబర్చాడు. ఈ పరుగు పందెంలో రాకేష్ ద్వితీయ బహుమతి సాధించి ప్రశంసలు అందుకున్నాడు. విజేతకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బహుమతి ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ రాకేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన సరైన ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. అదేవిధంగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ మాదక దవ్యరహిత సమాజం కోసం యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

# గిరిజన బాలికపై లైంగిక దాడి!

- పంచాయతీ నిర్వహించిన పెద్ద మనుషులు
- రూ. 4 లక్షలకు వెల కట్టినట్లు తీర్మానం



**చెన్నారావుపేట, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** గిరిజన బాలిక పై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని ఓ తండాలో శనివారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ తండాకు చెందిన 8వ తరగతి చదువుతున్న గిరిజన బాలికపై తండా పక్కన ఉన్న ఓ గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతేకాక ఇంట్లో ఉన్న నగదు, బంగారాన్ని అపహరించుకుపోయాడు. ఇంట్లో ఉన్న నగదు, బంగారం కనపడకపోయేసరికి కుటుంబ సభ్యులు ఆ బాలికను మందలించారు. దీంతో ఆ బాలిక జరిగిన విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలిపింది. వెంటనే కుటుంబ సభ్యులు శుక్రవారం గ్రామానికి చెందిన పెద్దమనుషులను ఆశ్రయించారు. పెద్దమనుషులు యువకుడు, యువకుడి తండ్రిని పిలిపించి పంచాయతీ నిర్వహించారు. నగదు, బంగారం అపహరణకు గురికావడం బాలికపై లైంగిక దాడికి పాల్పడినందుకుగాను రూ. 4 లక్షలు చెల్లించాలని గ్రామ పెద్ద మనుషులు వెలకట్టి తీర్మానం చేసినట్లు సమాచారం. దీంతో యువకుడు, యువకుడి తండ్రి పెద్ద మనుషులు చేసిన తీర్మానానికి ఒప్పుకోకపోవడంతో బాలిక కుటుంబ సభ్యులు చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తామని చెప్పి పంచాయతీ నుండి వెళ్లిపోయినట్లు ప్రచారం జరుగుతుంది. ఏది ఏమైనా చివరికి ఈ విషయం ఎటువైపు దారితీస్తుందోనని తండావాసులు, గ్రామస్తులు పలువురు బాహటంగా చర్చించుకుంటున్నారు.

## మొక్కజొన్న రైతులకు మద్దతుగా ప్రజా ప్రభుత్వం

- మార్కెట్ చైర్మన్ సోమ భీంరెడ్డి



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** రబీ సీజన్ లో రైతులు పండించిన మొక్కజొన్నను ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి అన్నారు శనివారం మార్కెట్ యార్డులో రైతులకు టోకెన్లను జారీ చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు వ్యవసాయ శాఖ మంత్రికి విన్నవించగా నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్నలు విక్రయించి క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర పొందాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు.

# హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలిపితేనే మహానగర అభివృద్ధి

- రాష్ట్రపతి అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా, జిల్లాగా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాను, జిల్లాల పునర్విభజన సమయంలో ఆరు ముక్కలు చేయడమే కాక గ్రేటర్ వరంగల్ మహా నగరాన్ని రెండు భాగాలుగా నిలువునా చీల్చి సగభాగం హనుమకొండ జిల్లాలో సగభాగం వరంగల్ జిల్లాకు కేటాయించడం జరిగి. ఈ రెండు జిల్లాలు తెలంగాణలో అతి చిన్న జిల్లాలుగా నిలిచిపోయాయి. అని ఈ రెండు జిల్లాలను ఒకటిగా చేయాలని పరికిపండ్ల వేణు అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన సిద్దిపేట జిల్లా కంటే కూడా వరంగల్, హనుమకొండ జిల్లాలు చిన్నవిగా నిలిచాయి. వరంగల్, హనుమకొండ జిల్లాలలో రెండు రెవెన్యూ డివిజన్ లు మాత్రమే ఉంటే నూతనంగా ఏర్పడిన సిద్దిపేట జిల్లాలో మూడు డివిజన్లతో పెద్ద జిల్లాగా అవతరించింది. దీనితో తెలంగాణలో అతిపెద్ద జిల్లాగా, అతిపెద్ద నగరంగా ఉన్న స్థానాన్ని వరంగల్ కోల్పోయింది. గత ప్రభుత్వం ఇది కావాలని చేసిందో లేక యాదృచ్ఛికంగా జరిగిందో కానీ వరంగల్ కు మాత్రం తీవ్ర నష్టం జరిగి, చారిత్రిక తప్పిదంగామిగిలిపోయింది. కావున గ్రేటర్ వరంగల్ మొత్తాన్ని ఒకే జిల్లాగా చేసినట్లయితే ఈ సమస్య పరిష్కారమై తెలంగాణలో మన వరంగల్ పెద్ద నగరంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. హైదరాబాద్ తర్వాత రెండవ రాజధానిగా కూడా నిలిచే అవకాశం ఉంటుంది. [illegible]వ శతాబ్దంలోనే కాకతీయుల సామ్రాజ్యానికి వరంగల్ నగరం రాజధానిగా విలసిల్లిన నగరం ఈరోజు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. హనుమకొండ, వరంగల్ జిల్లాలు ఒక్కటైతే పరిపాలన పరమైన కలెక్టరేట్ భవనాలు హనుమకొండకు తరలి పోతాయి కావచ్చు అనే అపోహ కొంతమంది వరంగల్ ప్రాంత నగర ప్రజలకు, నాయకులకు ఉండవచ్చు, కలెక్టరేట్ భవనాన్ని వరంగల్ లోనే ఏర్పాటు చేయడం వల్ల ఈ అపోహను కూడా అధిగమించవచ్చు. వాస్తవానికి వరంగల్ జిల్లా పేరు మీద ఉన్న వరంగల్ కలెక్టర్ కార్యాలయం వరంగల్ ప్రాంతంలోనే ఉంటే బాగుంటుంది. గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలను ఒక్కొక్క దానిని సవరించుకుంటూ వస్తున్న ప్రస్తుత ప్రభుత్వం హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలిపి ఒకే జిల్లాగా మార్చటంతో గ్రేటర్ వరంగల్ కు, తెలంగాణకు సరైన దిశా నిర్దేశం చేసినట్లుగా ఈ ప్రభుత్వానికి పేరు వచ్చే అవకాశం ఉంటుంది.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఏడుగురు అరెస్ట్

**కాటారం ఏప్రిల్ 10 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం గుమ్మాళ్లపల్లిలో పేకాట ఆడుతు న్న స్థావరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించి ఏడుగురిని అరెస్ట్ చేశారు. భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు కాటారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమ్మల్లపల్లి పరిసర ప్రాం తంలో పేకాట ఆడుతున్న వారిపై సీసీఎస్ పోలీసులు దాడి నిర్వహించి ఏడుగు రిని అదుపులోకి తీసుకోగా ఇద్దరు పరారిలో ఉన్నట్లు తెలిసింది. నిందితుల వద్ద నుండి 08 మొబైల్ ఫోన్లు, 02 మోటార్ సైకిళ్లు, రూ.31,450 నగదు స్వాధీనం చేసుకున్నారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు, పరారీలో ఉన్న నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

# కామారెడ్డిని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** రూ. 8 కోట్ల 90 లక్షలతో ఇందిరాగాంధీ స్టేడియం ను అభివృద్ధి చేస్తామని, కామారెడ్డిని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వ అడుగులు వేస్తోందని, కామారెడ్డి పట్టణాన్ని క్రీడల కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని. ఈ క్రమంలో పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం అభివృద్ధి పనులను మరియు ప్రతిపాదిత ఇండోర్ స్టేడియం స్థలాన్ని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం అధికారులతో కలిసి పరిశీలించి పనులను ప్రారంభించారు. ఇందిరాగాంధీ స్టేడియం ఆధునీకరణ పనులను అధికారులు సమక్షంలో పరిశీలించిన షబ్బీర్ అలీ, పనులు నాణ్యతతో వేగవంతంగా చేపట్టాలని సూచించారు.రూ. 8.90 కోట్లతో ఆధునీకరణ చేయాలని,ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ఇందిరాగాంధీ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ. 8 కోట్ల 90 లక్షలను కేటాయించిందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా కామారెడ్డి క్రీడా రంగంలో విశిష్ట స్థానం సంపాదించనుందని పేర్కొన్నారు. స్టేడియంలో ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాల రన్నింగ్ ట్రాక్, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, విశాలమైన గ్యాలరీలు,అత్యాధునిక ఇండోర్ స్టేడియం,ఆధునిక



జిమ్,రైఫిల్ షూటింగ్ రేంజ్,వాలీబాల్ కోర్టు,టెన్నిస్ కోర్టు,టేబుల్ టెన్నిస్, సదుపాయాలు మరియు ముఖ్యమంత్రితో చర్చించి భవిష్యత్తులో స్విమ్మింగ్ పూల్ నిర్మాణాన్ని కూడా చేపడతామని షబ్బీర్ అలీ తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.గత ప్రభుత్వాలు క్రీడలను విస్మరించాయి. కానీ మన కాంగ్రెస్ ప్రభుత్వం యువత ప్రతిభను వెలికితీయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతోంది. గ్రామీణ క్రీడాకారులు ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికలపై మెరవడం మా లక్ష్యం అన్నారు.అదేవిధంగా రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నిధుల మంజూరు ప్రక్రియ పూర్తయింది.పనులు శనివారం నుంచే ప్రారంభమయ్యాయని.ఈ సంవత్సరం సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు.స్టేడియం పూర్తయిన తరువాత ఇతర జిల్లాల నుంచి క్రీడాకారులు శిక్షణ పొందేందుకు రావడమే కాకుండా, జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించే అవకాశాలు కూడా ఏర్పడనున్నాయి.కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి చిత్తశుద్ధితో కట్టుబడి ఉందని ఈ కార్యక్రమం ద్వారా స్పష్టంగాతెలియజేస్తున్నాము అన్నారు.కామారెడ్డి పట్టణ నడిబొడ్డున ఉన్న ఇందిరాగాంధీ స్టేడియం రూపురేఖలు మారనున్నాయనే వార్తతో స్థానిక క్రీడాకారులు, యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ జిల్లాలో క్రీడా వికాసానికి నూతన దిశను నిర్దేశించనుంది.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమాశ్రీనివాస్, పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి, భీమ్ రెడ్డి, నౌసిలాల్, పాత రాజు, లక్ష్మీ రాజా గౌడ్, ఐరేనీ సందీప్, కారంగుల అశోక్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతిరావు పూలే సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సౌజన్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్‌లో మత్తు పదార్థాల వ్యసన బాధితులకు సమగ్ర వైద్య సేవలు ప్రారంభం



**గోదావరిఖని, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** సమాజంలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు, వ్యసన బాధితులకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు జీ.జీ.హెచ్ (గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్) రామగుండం లో ప్రత్యేకంగా "అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ" ను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసీపీ రమేష్ , డీసీపీ శ్రీ రామ్ రెడ్డి, సీఐ ఇంద్రసేన రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం సమాజానికి ప్రమాదకరమని, అలాంటి వ్యసనాల నుండి బయటపడటానికి ఇలాంటి చికిత్స కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు డా. అరుణ, డా. కృపాబాయి, డా. రాజు , డా. రవివర్మ (సైకియాట్రిస్ట్) పాల్గొని వ్యసనాల వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలు, వాటి నివారణపై వివరించారు. వ్యసన బాధితులు సరైన సమయంలో చికిత్స పొందితే పూర్తిగా కోలుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ కొత్త కేంద్రంలో డ్రగ్ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్ అండ్ సబ్స్టెన్స్ ఇంటాక్ స్టేషన్ కేర్ యూనిట్ తో పాటుగా ఔషధ చికిత్స, పునరావాస సేవలు అందుబాటులో ఉండనున్నాయని అధికారులు తెలిపారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకొని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ స్టూడెంట్స్, నర్సింగ్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక ప్రజలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సమానత్వ సమాజ నిర్మాణానికి పూలే మార్గదర్శి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** ప్రముఖ సంఘ సంస్కర్త, సామాజిక విప్లవ జ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాలు కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమాశ్రీనివాస్, పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్ రెడ్డి, అనంతరెడ్డి, భీమ్ రెడ్డి, నౌసిలాల్, పాత రాజు, లక్ష్మీ రాజా గౌడ్, ఐరేనీ సందీప్, కారంగుల అశోక్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదవారి సొంతింటి కల నెరవేరుస్తాం

**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో పర్యటించి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

### రూ.4.50 కోట్లతో రహదారి నిర్మాణం

వరంగల్ క్రాస్ రోడ్డు ఆటోనగర్ నుంచి మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు రూ.4.50 కోట్లతో నిర్మించనున్న రహదారి పనులకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 32 వార్డుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.58.95 కోట్లు కేటాయించిందన్నారు. ఆటోనగర్ మీదుగా సాగే ఈ రహదారి పూర్తయితే రవాణా కష్టాలు తీరుతాయని పేర్కొన్నారు.

### ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యం..

గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో పేదల ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని మంత్రి విమర్శించారు. "ప్రజా పాలన మొదటి



ఏడాదిలోనే ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. త్వరలోనే రెండో విడత ప్రక్రియ ప్రారంభిస్తాం" అని ప్రకటించారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, మహిళా సంఘాలకు ఏటా రూ.24 వేల కోట్ల మేర వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని వివరించారు.

### లబ్ధిదారులకు బాసట

ఖమ్మం రూరల్ మండలం, మున్సిపాలిటీ పరిధిలోని 64 మందికి కళ్యాణలక్ష్మి చెక్కులను, 227 మందికి రూ.70.42 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి అందజేశారు. ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, సన్నబియ్యం పంపిణీ వంటి హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## జీసీసీల గమ్యస్థానంగా హైదరాబాద్

- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** ప్రపంచంలోని దిగ్గజ ఫైనాన్స్ సంస్థలన్నీ తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల ఏర్పాటుకు హైదరాబాద్ నగరాన్ని గమ్యస్థానంగా ఎంచుకున్నాయని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. నైపుణ్యాలతో కూడిన టేలెంట్ పూల్, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ సమస్య లేని రోడ్లు, అందుబాటులో ఉండే అద్దెలు ప్రముఖ కంపెనీలని ఆకర్షిస్తున్నాయని ఆయన తెలిపారు. న్యూయార్స్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే పికో టెక్నాలజి సంస్థప్రతినిధులు శనివారం బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో శ్రీధర్ బాబుతో



భేటీ అయ్యారు. రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పికో టెక్నాలజి వ్యవస్థాపక సిఇఓ జారోడ్ యుస్టర్, పికో ఇండియా సిఇఓ హరి కోదండరామన్, డైరెక్టర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడ ఆసుపత్రికి అవార్డు

**బాన్సువాడ, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** బాన్సువాడ పట్టణంలోని మాత శిశు సంక్షేమ ఆసుపత్రికి రాష్ట్ర స్థాయి అవార్డు రావడం ఎంతో ప్రశంసనీయమని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ రాష్ట్రంలోనే అత్యధిక డెలివరీలు నిర్వహించి మొదటి స్థానం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల ముగింపు కార్యక్రమం బాన్సువాడలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆసుపత్రికి మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా రోగులు పెద్ద ఎత్తున వస్తున్నారని తెలిపారు. మూడు రాష్ట్రాల ప్రజలకు సేవలు అందిస్తున్న ఈ ఆసుపత్రి వైద్య సేవల నాణ్యతకు నిదర్శనమని చెప్పారు. అవార్డు రావడానికి కృషి చేసిన డాక్టర్లు, నర్సులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంలో వారు చూపుతున్న అంకితభావం ప్రశంసనీయం అని కొనియాడారు. భవిష్యత్తులో



మరింత మెరుగైన సదుపాయాలతో ఆసుపత్రిని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. పూలే చేసిన సామాజిక సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య అధికారులు, ఆసుపత్రి సిబ్బంది, పార్టీ నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

## జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి వేగవంతం చేయాలి



**మణుగూరు, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదా బైనమా దరఖాస్తులు, ఎస్ఐఆర్ మ్యాపింగ్ ఇతర భూ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. శనివారం జిల్లాలోని తహసిల్దారులు, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ప్రక్రియలో బిఎల్వోలు క్షేత్రస్థాయిలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసిల్దార్ అద్దంకి నరేష్ మండల అధికారులు జిల్లా అధికారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల నుండి బలవంతపు భూసేకరణ ఆపాలి



**కొండాపూర్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** ఆల్ ఇండియా కిసాన్ సభ ఏర్పడి 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని సిహెచ్ కోనాపూర్,తెలంగాణ రైతు సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించరు ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, మాట్లాడుతూ.1936లో ఆల్ ఇండియా కిసాన్ సభ ఏర్పడి నాటి నుండి నేటి వరకు రైతుల కోసం అనేక పోరాటాలు నిర్వహించి చట్టాలను సాధించుకోవడం జరిగిందని. భూ సంస్కరణ చట్టం వల్ల అనేక మంది పేద రైతులకు ప్రభుత్వ భూములు ఇవ్వడంతో వారు జీవనోపాధి పొందరన్నారు.రైతుల హక్కుల కోసం నిరంతరం వారి పక్షాన పోరాడుతున్న సంఘం రైతు సంఘం అన్నారు. పోరాడి సాధించుకున్న భూములను ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో. రైతులకు తగినంత నష్టపరిహారం చెల్లించకుండా, రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ అధికారులు భూములు తీసుకోవడం తగదని,వారు హెచ్చరించారు, ఇప్పటికైనా ప్రభుత్వం స్వీకరిస్తున్న భూములకు ఇప్పుడున్న మార్కెట్ విలువ ప్రకారం మూడింతలు నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు,పట్టా పాస్ బుక్కు లేని పేద రైతులందరికీ వెంటనే పాస్ బుక్కులు మంజూరు చేయాలని.సబ్సిడీ విత్తనాలు ఎరువులు.యంత్రాలు ఇవ్వాలని.స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలని.ఎన్నికలలో రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం గ్రామ అధ్యక్షులు నందం,రాములు,రత్నయ్య, కరుణమ్మ,శాంతమ్మ,రత్నయ్య,అమృతమ్మ,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్ సమస్యలను సీఎం వెంటనే పరిష్కరించాలి

- తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్



**నారాయణపేట, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు ఉద్యమ సమయంలో కీలకపాత్ర పోషించారని తెలంగాణ జాగృతి నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్ అన్నారు. విద్యుత్ శాఖ ఆర్టిజన్ కార్మికుల 4 రోజు సమ్మె ను ఉద్దేశించి గవినోళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం ఓ మొస్తారు కొనసాగుతున్న సమయంలో విద్యుత్ ఉద్యోగులు ఈ ఉద్యమంలో పాల్గొనడంతో కేంద్రానికి తెలంగాణ ఉద్యమం యొక్క ప్రాధాన్యత తెలిసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యుత్ ఉద్యోగుల పట్ల ప్రతిపక్ష పాత్రలో ఉన్న సమయంలో ఆర్టిజన్ కార్మికులు వెట్టి చాకిరి గురించి ఎక్కువ గా మాట్లాడిన వ్యక్తి ఈ రోజు సి.ఎం హోదాలో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని నారాయణపేట జాగృతి అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ అన్నారు. లేని పక్షంలో ఈ ఉద్యమాన్ని తీవ్రతను ఆమెతో సహకారం ఉద్యోగులకు ఉంటుందని ఆయన అభిప్రాయం వెలిబుచ్చారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించ కుంటే రాష్ట్రం అండాకాలమవుతుందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే కేటీపీఎస్‌లో గ్రిడ్లు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయని గవినోళ్ల శ్రీనివాస్ దుయ్యబట్టారు. ప్రభుత్వ యాజమాన్యం విద్యుత్ ఆర్టిజన్ సమస్యలను త్వరగా పరిష్కరించే దిశగా అడుగులు వేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. లేనిపక్షంలో ఉద్యమం నిసిపడే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఆర్టిజన్ లక్ష్మీకాంత్, వినోద్, నర్సింలు, రమేష్, అంజి, అమ్రేష్, నర్సింహ, రాఘవేంద్ర గౌడ్, మహమ్మద్ పాషా, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి.
- మంగళగూడెంలో రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** పేద ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

### వరద కష్టాలకు చెక్..

మంగళగూడెం గ్రామంలో రూ. 2 కోట్ల 50 లక్షల వ్యయంతో కొత్తూరు నుండి కాచిరాజుగూడెం వరకు చేపట్టనున్న రోడ్డు మరియు స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పర్యటనలో ఈ ప్రాంతంలో వరదల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా చూశానని, ఆనాడు ఇచ్చిన హామీని నేడు నిలబెట్టుకోవడం సంతృప్తిని ఇస్తోందని అన్నారు. కల్వర్టు పనులను నాణ్యతతో, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

### మండలాభివృద్ధికి రూ.64.92 కోట్లు

గడిచిన 27 నెలల కాలంలో ఖమ్మం రూరల్ మండలానికి రూ.64.92 కోట్ల అభివృద్ధి నిధులు వెచ్చించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించామని, మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

### సంక్షేమ పథకాలపై భరోసా..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, ధాన్యానికి రూ. 500 బోనస్ వంటి పథకాలు నిరుపేదలకు అండగా నిలుస్తున్నాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల




పథకంలో మొదటి దశ మంజూరైందని, త్వరలోనే రెండో దశ ఇళ్లను కూడా అందిస్తామని చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల సంక్షేమం నుంచి వెనక్కి తగ్గేదే లేదని ఆయన తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, పాలేరు ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




# టాటా సన్స్ లిస్టింగ్‌కు ఎస్‌పీ గ్రూప్ పట్టు

• ప్రజా ప్రయోజనాల కోసమే కోరుతున్నాం

• కేంద్రం, ఆర్‌బీఐపై నమ్మకం ఉంది షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ



దిల్లీ: టాటా గ్రూప్ ప్రధాన సంస్థ, టాటా సన్స్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయాలనే విషయమై మరోసారి ఎస్‌పీ గ్రూప్ పట్టుపట్టింది. నిబంధనల సమ్మతి కోసమే కాదని, ప్రజా ప్రయోజనాలకు ఇది ఉపయోగ పడుతుందని ఎస్‌పీ గ్రూప్ ఛైర్మన్ షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ వ్యాఖ్యానించారు. టాటా సన్స్‌ను నమోదుకు తెచ్చే విషయంలో కేంద్రప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సరైన నిర్ణయం తీసుకుంటాయన్న నమ్మకం తమకు ఉందని అన్నారు. టాటా సన్స్ లిస్టింగ్ వల్ల, టాటా ట్రస్ట్స్ ప్రయోజనాలు దెబ్బతింటాయని కానీ, లబ్దిదారులకు సేవలందించే సామర్థ్యం తగ్గుతుందని కానీ స్పష్టమైన ఆధారాలేవీ సంబంధితులు ఇవ్వలేకపోయారని ఆయన అన్నారు. టాటా ట్రస్ట్స్‌కు చెందిన ఇద్దరు ట్రస్టీలు (వేణు శ్రీనివాసన్, విజయ్‌సింగ్) టాటా సన్స్ లిస్టింగ్‌కు సానుకూలంగా ఉన్న నేపథ్యంలో, మిస్త్రీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా మాత్రం టాటా సన్స్ లిస్టింగ్‌కు విముఖంగా ఉన్నారు. అతిపెద్ద ఎన్‌బీఎఫ్‌సీ అయిన టాటా సన్స్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయడం వల్ల కార్పొరేట్ పాలనను పటిష్టం చేయడంతో పాటు, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచినట్లవుతుందని మిస్త్రీ అన్నారు. 'లక్షల మంది రిటెయిల్ మదుపర్లకు మంచి విలువనూ అందించినట్లవుతుంది. టాటా ట్రస్ట్స్‌కు బలమైన డివిడెండునూ ఇవ్వొచ్చు. దేశంలోని పేదలకు సామాజిక, దాతృత్వ కార్యక్రమాలను మరింత విస్తరించొచ్చ'ని మిస్త్రీ పేర్కొన్నారు. టాటా సన్స్ లిస్టింగ్ విషయంలో ట్రస్టీల మధ్య గతేడాది అక్టోబరులో విభేదాలొచ్చిన సంగతి తెలిసిందే. టాటాసన్స్‌లో 66% వాటా టాటా ట్రస్ట్స్‌కు ఉండగా, 18.37% వాటా షాపూర్జీ పల్లోంజీ కుటుంబానిది. గతంలోనూ టాటా సన్స్ లిస్టింగ్‌కు మిస్త్రీ పిలుపునిచ్చారు. టాటా సన్స్‌లోని తన వాటా విలువ ద్వారా నిధులు సమీకరించి, అప్పులు తీర్చుకోవాలని ఎస్‌పీ గ్రూప్ భావిస్తోంది.

# నష్టాల నుంచి లాభాల బాట

• ఎంత పడ్డాయో.. అంత పెరిగాయ్

• బ్యాంకింగ్ షేర్ల అండతో సూచీలకు లాభాలు

• రూ.6.44 లక్షల కోట్లు పెరిగిన సంపద విలువ

• ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.672.09 కోట్లు

• డీఐఐ కొనుగోళ్లు.. రూ.410.05 కోట్లు



**న్యూఢిల్లీ:** దేశీయ ప్రధాన సూచీలు గురువారం ఎంత (931 పాయింట్లు) నష్టపోయాయో.. ఇంచుమించు అదే స్థాయిలో శుక్రవారం లాభాలు నమోదుచేశాయి. బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు తోడ్పడ్డాయి. అమెరికా - ఇరాన్ చర్చల నేపథ్యంలో పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టొచ్చన్న ఆశలు, విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాలు మన మదుపర్ల సెంటిమెంట్‌ను బలోపేతం చేశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 32 పైసలు తగ్గి 92.83 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.10% నష్టంతో 95.80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లన్నీ సానుకూల ధోరణిలోనే ముగియగా.. ఐరోపా మార్కెట్లు లాభాల్లోనే ఆరంభమయ్యాయి. పాకిస్తాన్ స్టాక్ ఎక్స్ఛేంజీకి చెందిన కేఎస్ఈ-100 సూచీ 1,400 పాయింట్లు లాభపడింది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.6.44 లక్షల కోట్లు పెరిగి రూ.451.23 లక్షల కోట్ల (4.87 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

**సానుకూల ధోరణిలోనే..:** ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,121.01 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,631.65) లాభాల్లో ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ 77,622.50 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 918.60 పాయింట్ల లాభంతో 77,550.25 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 275.50 పాయింట్లు పెరిగి 24,050.60 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 23,856.35 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 24,074.05 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని ఈ సూచీ నమోదు చేసింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 4,231, నిఫ్టీ 1,338 పాయింట్లు పెరిగాయి.

**అయిదు కంపెనీలు డీలా..:** సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 5 మినహా మిగతావన్నీ లాభాల్లో ముగిశాయి. ఏషియన్ పెయింట్స్ 3.97%, ఐసీఐసీఐ బ్యాంక్ 3.22%, మహీంద్రా అండ్ మహీంద్రా 2.98%, యాక్సిస్ బ్యాంక్ 2.49%, ఎస్‌బీఐ 2.48%, ఇండిగో 2.42%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.35%, బజాజ్ ఫైనాన్స్ 2.3% చొప్పున పెరిగాయి. సన్‌ఫార్మా 3.65%, ఇన్ఫోసిస్ 2.94%, టీసీఎస్ 2.45%, టెక్ మహీంద్రా 1.44%, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 0.98% మేర నష్టపోయాయి. బీఎస్ఈలో రంగాల సూచీల విషయానికొస్తే భారీ యంత్రపరికరాలు, మన్నికైన వినియోగ వస్తువులు, ఇండస్ట్రియల్స్, బ్యాంకెక్స్, స్థిరాస్తి రాణించగా.. ఐటీ సూచీ డీలాపడింది. బీఎస్ఈలో 3,360 కంపెనీల షేర్లు లాభాల్లో, 945 కంపెనీల షేర్లు నష్టాల్లో ముగిశాయి. 144 కంపెనీల షేర్ల ధరలో ఎలాంటి మార్పులేదు. బిదాడిలోని టొయోటా టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ వద్ద సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేసేందుకు విప్రో 3డీతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు టొయోటా కిర్లోస్కర్ మోటార్ తెలిపింది. తుర్కియేలో ఫౌండ్రీ వ్యాపారం నుంచి మహీంద్రా అండ్ మహీంద్రా వైదొలగింది. అక్కడి అనుబంధ సంస్థ ఎర్కుంట్ ఫౌండ్రీలో తనకున్న 99.04% వాటాను హిసార్లర్ మకిన సనాయి కన్సార్షియంకు విక్రయించింది.

**ఫలించని టీసీఎస్ ఫలితాలు**

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) జనవరి- మార్చి ఫలితాలు విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే ఉన్నా, మదుపర్లు సంతృప్తి చెందకపోవడంతో, ఈ కంపెనీ షేరుకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. బీఎస్ఈలో 2.45% నష్టపోయి రూ.2,524.35 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.22,938.67 కోట్లు తగ్గి రూ.9,13,331.92 కోట్లకు పరిమితమైంది.

**విదేశీ మారకపు నిల్వల్లో వృద్ధి**

మన విదేశీ మారకపు నిల్వలు ఏప్రిల్ 3తో ముగిసిన వారంలో 9.063 బిలియన్ డాలర్లు పెరిగి 697.121 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతకుముందు వారంలో ఇవి 10.288 బిలియన్ డాలర్లు తగ్గి 688.058 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం.. ఏప్రిల్ 3తో ముగిసిన వారంలో కీలకమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 1.784 బిలియన్ డాలర్లు పెరిగి 552.856 బిలియన్ డాలర్లకు చేరాయి. పసిడి నిల్వలు 7.221 బిలియన్ డాలర్లు అధికమై 120.742 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

# స్విగ్గీ నుంచి వైదొలిగిన నందన్ రెడ్డి

## ఈయన రెండో సహ వ్యవస్థాపకుడు

**న్యూఢిల్లీ:** ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే, ఆహారాన్ని సరఫరా చేసే ప్లాట్‌ఫామ్ స్విగ్గీ నుంచి మరో సహవ్యవస్థాపకుడు నందన్ రెడ్డి వైదొలగనున్నారు. శ్రీహర్ష మాజేటి, రాహుల్ జైమిని, నందన్ రెడ్డి కలిసి 2014 ఆగస్టులో ఈ సంస్థను స్థాపించారు. 2020లో కంపెనీ నుంచి రాహుల్ జైమిని తప్పుకుని, పెస్టో టెక్ పేరుతో సొంతంగా కంపెనీని ప్రారంభించారు. ఇప్పుడు నందన్ కూడా అదేబాట పట్టారు. సొంతంగా కొత్త అంకుర సంస్థను అభివృద్ధి చేయడం పైనే ఎక్కువ సమయం వెచ్చించాలని నందన్‌రరెడ్డి అనుకుంటున్నారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. స్విగ్గీ గ్రూపు సీఈఓగా మరో సహవ్యవస్థాపకుడు శ్రీహర్ష మాజేటి వ్యవహరిస్తున్నారు.

**బోర్డులో మార్పులు..:** స్విగ్గీలో 20 శాతానికి పైగా వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఉన్న ప్రోసస్ తన నామినీ డైరెక్టర్లలో మార్పులు చేయనుంది. రోజర్ క్లార్క్ రబాలియస్ నామినీ డైరెక్టరు పదవికి రాజీనామా చేస్తారు. ఈ స్థానాన్ని రెనాన్ డె కాస్ట్రో ఆల్వెస్ పింటో భర్తీ చేస్తారు. బోర్డు సభ్యుల సంఖ్యను పెంచే యోచనలోనూ స్విగ్గీ ఉంది. 2015లో స్విగ్గీలో చేరి, వైస్‌ప్రెసిడెంట్‌గా కార్యకలాపాలు నిర్వహించిన ఫణి కిషన్ అద్దేపల్లిని 2021 జులైలో కంపెనీ సహవ్యవస్థాపకుడిగా పదోన్నతి కల్పించారు. ప్రస్తుతం చీఫ్ గ్రోత్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న ఫణి కిషన్, ముఖ్య ఆర్థిక అధికారి రాహుల్ బోత్రా స్విగ్గీ బోర్డులో చేరనున్నారు. ఈ నిర్ణయానికి వాటాదార్లు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది.

**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 4.37 | వరంగల్ ₹ 4.32

**బంగారం ధరలు** (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,40,100 (22 క్యారెట్లు) | ₹ 1,52,840 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 2,65,000

# మార్కెట్ హెచ్చుతగ్గుల్లోనూ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల జోరు

## మార్చిలో రూ.32,087 కోట్ల సిప్ పెట్టుబడులు




**హైదరాబాద్:** భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, మార్కెట్ ఒడుదొడుకులున్నా, మార్చిలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి రూ.40,450 కోట్ల నికర నిధులు వచ్చాయి. క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్) ద్వారా వచ్చిన మొత్తం రూ.32,086.78 కోట్లుగా ఉంది. 2026-26 ఆర్థిక సంవత్సరం ముగింపు నెల కావడంతో, డెట్ ఫండ్ల నుంచి నిధుల ఉపసంహరణ జరిగింది. ఫలితంగా మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ మొత్తం నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) రూ.73,73,376.98 కోట్లకు పరిమితమైంది. ఫిబ్రవరిలో ఇది రూ.82,02,956.35 కోట్లుగా ఉంది.యాంఫీ ప్రకారం: భారతీయ మ్యూచువల్ ఫండ్ల సంఘం (యాంఫీ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఫిబ్రవరిలో ఈక్విటీఫండ్లలోకి వచ్చిన రూ.25,978 కోట్లతో పోలిస్తే మార్చిలో 56% పెరిగి రూ.40,450 కోట్లకు చేరింది. 2025 జులై (రూ.42,702 కోట్లు) తర్వాత అత్యధిక నెలవారీ నికర పెట్టుబడులు ఇవే. వరసగా 61వ నెలా, ఈక్విటీ ఫండ్లలోకి సానుకూలంగా నిధులొచ్చాయి. సిప్ పెట్టుబడులు ఫిబ్రవరిలో రూ.29,845 కోట్లు కాగా, మార్చిలో రూ.32,086.78 కోట్లకు పెరిగాయి. సిప్ ఖాతాల సంఖ్య 9.71 కోట్లకు చేరింది. ఈక్విటీ విభాగంలో ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లలోకి రూ.10,000 కోట్లు, స్మాల్ క్యాప్‌లోకి రూ.6,263 కోట్లు, మిడ్ క్యాప్‌లోకి రూ.6,063 కోట్లు వచ్చాయి.

**బంగారం పైనా..:** ప్రపంచవ్యాప్త అనిశ్చితి నేపథ్యంలో పెట్టుబడిదారులు భిన్నఆస్తులలో మదుపు చేసేందుకు ఆసక్తి చూపారు. మల్టీ అసెట్ అలకేషన్ ఫండ్లలోకి రూ.5,000 కోట్లకు పైగా వచ్చాయి. ఎస్ఐఎఫ్ నిర్వహణలోని ఆస్తులు మార్చిలో 9.4% పెరిగి, రూ.10,200 కోట్లకు చేరుకున్నాయి. గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి మార్చిలో రూ.2,266 కోట్లు వచ్చాయి. జనవరిలో వచ్చిన రూ.24,040 కోట్లు, ఫిబ్రవరి నాటి రూ.5,255 కోట్ల కంటే ఈ మొత్తం తక్కువే అయినా, బంగారంపై పెట్టుబడిదారుల ఆసక్తి తగ్గలేదని స్పష్టమవుతోంది. 'దీర్ఘకాలిక సంపద సృష్టి కోసం మ్యూచువల్ ఫండ్లపై పెట్టుబడిదారులు చూపుతున్న నమ్మకాన్ని గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయ'ని యాంఫీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని అన్నారు.

# జాబిల్లి జ్ఞాపకాలను మోస్తూ..

**• గబ్బిలాల్లా నిద్రిస్తూ.. పాటలు వింటూ.. • ఆర్టెమిస్- 2 యాత్ర పదనిసలు**

**అర్ధ శతాబ్దం తర్వాత చందమామను అత్యంత సమీపం నుంచి మానవ నేత్రాలు కళ్లారా వీక్షించాయి. నలుగురు వ్యోమగాములతో అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా ప్రయోగించిన ఆర్టెమిస్ మిషన్ ఎన్నో అనుభవాలను అందించింది. సుదూర విశ్వంలోకి భవిష్యత్‌లో చేపట్టబోయే ప్రయాణాలకు అనేక పాఠాలను నేర్పింది. 10 రోజుల యాత్రలో దొర్లిన ఇబ్బందులు.. సరదా క్షణాలను ఓసారి పరిశీలిస్తే..పెద్దదే: ఆర్టెమిస్-2 యాత్ర కోసం ఉపయోగించిన ఒరాయన్ క్యాప్సూల్‌కు వ్యోమగాములు ముద్దుగా 'ఇంటెగ్రిటీ' అని పేరుపెట్టుకున్నారు. ఇది రెండు మినీ వ్యాన్‌ల పరిమాణంలో ఉంటుంది. అర్ధశతాబ్దం కింద చంద్రమండల యాత్రలకు ఉపయోగించిన 'కమాండ్ మాడ్యూల్'తో పోలిస్తే ఇందులో నివాసయోగ్య ప్రదేశం 60 శాతం ఎక్కువ. టాయ్‌లెట్, వ్యాయామాలు చేయడానికి ఒక యంత్రం కూడా ఇందులో ఉంది.**

**జనంసాక్షి:** రోదసిలోని భారరహిత స్థితిలో నేల, గోడలు, సీలింగ్ అనే తారతమ్యాలు ఉండవు. దీంతో వ్యోమగామి క్రిస్టీనా.. గబ్బిలంలా తలకిందులుగా వేలాడుతూ నిద్రించేవారు. అంతరిక్షంలో నిద్ర అనేది అత్యంత సౌకర్యవంతంగా ఉంటుందని వ్యోమగాములు పేర్కొన్నారు. భూమి నుంచి బయల్దేరిన కొద్దిసేపటికే నాసా వ్యోమగామి క్రిస్టీనా కోచ్.. ఓ పనిముట్టును పట్టుకొని మరమ్మతులకు ఉపక్రమించారు. ఇదేదో రాకెట్ వ్యవస్థ లేదా నేవిగేషన్ కంప్యూటర్‌ను సరిచేసేందుకు కాదు.. 2.3 కోట్ల డాలర్ల వ్యయంతో రూపొందించిన టాయ్‌లెట్ మరమ్మతు కోసం..! మిషన్ కంట్రోల్ నుంచి సూచనలు అందుకుంటూ.. టాయ్‌లెట్ మోటారులో తలెత్తిన లోపాన్ని సరిచేశారు. తాను 'స్పేస్ ప్లంబర్' అవతారమెత్తానని ఆమె సరదాగా వ్యాఖ్యానించారు. ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. ఆ తర్వాత వారం రోజుల వ్యవధిలో మూడుసార్లు టాయ్‌లెట్ మొరాయించింది. ఒరాయన్ కోసం రూపొందించిన యూనివర్సల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో లోపాలే ఇందుకు కారణం. వ్యోమగాములను మేల్కొల్పడానికి నాసా మిషన్ కంట్రోల్ అధికారులు.. వ్యోమనౌకలో పాటలను వినిపించేవారు. వాటిని వ్యోమగాములే ఎంచుకున్నారు. అయితే మిషన్ కంట్రోల్ అధికారులు కొన్నిసార్లు పాటలను మరీ అరకొరగా వినిపించేవారు. తాము మైమరచిపోయి తదుపరి చరణాలు లేదా కోరస్ కోసం ఎదురుచూస్తుండగా.. పాట చప్పున ఆగిపోయేదని వైస్‌మన్ ఆక్షేపించారు. రెండోసారి.. భూమికి 3.2 లక్షల కిలోమీటర్ల దూరంలో టాయ్‌లెట్ మొరాయించినప్పుడు వినూత్న పద్ధతిలో నాసా దాన్ని సరిచేసింది. రోదసిలో ఉష్ణోగ్రతల మధ్య వైరుధ్యం ఎక్కువగా ఉంటుంది. సూర్యుడి వైపు ఉండే భాగాలు తీవ్ర వేడిమిని, ఎండతగలని భాగాలు శీతల వాతావరణాన్ని ఎదుర్కొంటాయి. టాయ్‌లెట్ నుంచి మూత్రాన్ని తరలించుకెళ్లే పైపు.. శీతల భాగం వైపు ఉండటంతో అందులోని ద్రవం గడ్డకట్టింది. సమస్య పరిష్కారానికి మిషన్ కంట్రోల్ అధికారులు.. వ్యోమనౌకను ఒకవైపునకు తిప్పారు. ఫలితంగా గడ్డకట్టిన పైపుపై కొన్నిగంటలపాటు సూర్యకాంతి పడేలా చేశారు. దీనివల్ల పైప్‌లో గడ్డ కట్టిన మూత్రం కరిగిపోయింది. యాత్రలో మూడోరోజు ఒరాయన్ వ్యోమనౌకపై సూర్య కాంతి తాకిడి ఎక్కువగా ఉంది. ఫలితంగా కిటికీ షేడ్లు బాగా వేడెక్కిపోతున్నాయని మిషన్ కంట్రోల్ అధికా రులు ఆందోళన చెందారు. వాటిని తొలగించాలని వ్యోమగాములకు సూచించారు. వీటికి బదులు.. కిటికీలకు టీ షర్టులను అడ్డుగా ఉంచి, క్యాబిన్ లోపలికి ఎండ రాకుండా చూసుకోవాలన్నారు. ఒరాయన్‌లో వ్యోమనౌకలో ఫ్రిజ్ లేదు. అయినా యాత్ర సాగే 10 రోజుల పాటు రుచికరమైన, వైవిధ్యభరి తమైన, సాధారణ గది ఉష్ణోగ్రత వద్ద దీర్ఘకాలం మన్నే ఆహార పదార్థాలను వ్యోమగాములకు అందించే ఏర్పాటును అంతరిక్ష ఆహార నిపుణులు చేశారు. ఏకంగా 189 రకాల ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచారు. ష్రింప్ కాక్‌టెయిల్, బార్‌బెక్యూడ్ బీఫ్ బ్రిస్కెట్, బ్రకోలీ గ్రాటిన్, వెజిటేబుల్ క్విచీ, మ్యాంగో సలాడ్, స్పైసీ గ్రీన్ బీన్స్, మెక్రోనీ, ఛీజ్ వంటివి ఇందులో ఉన్నాయి. ఈ యాత్రలో వ్యోమగాముల అవతార్ (ఎ వర్చువల్ ఆస్ట్రోనాట్ టిష్యూ ఎనలాగ్ రెస్పాన్స్) అనే చిప్‌లనూ రోదసిలోకి తీసుకెళ్లారు. అందులో వ్యోమగాముల ఎముక మజ్జ నుంచి సేకరించిన కణాలు ఉన్నాయి. వీటిపై పరిశోధనల ద్వారా.. సుదూర విశ్వంలోకి వెళ్లడం వల్ల వ్యోమగాముల రోగనిరోధక వ్యవస్థపై పడే ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి వీలవుతుంది. భవిష్యత్‌లో చేపట్టే యాత్రల్లో వ్యోమగాములకు మెరుగైన చికిత్స అందించడానికి దీనివల్ల ప్రయోజనం కలుగుతుంది.

# అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీల్లోకి ప్రభుత్వ రంగ బ్యాంకులూ!

## గుర్తింపు అర్హతల్లో మార్పులు.. ఆర్‌బీఐ ప్రతిపాదనలు

**ముంబయి:** అప్పర్ లేయర్ (అగ్రశ్రేణి) బ్యాంకింగేతర ఆర్థిక కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లను గుర్తించే అర్హతల్లో మార్పులను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ప్రతిపాదించింది. అంతక్రితం ఉన్న పారామెట్రిక్ వ్యవస్థకు బదులుగా, ఆస్తుల పరిమాణం ఆధారిత విధానానికి మొగ్గుచూపింది. తాజా ముసాయిదా ప్రకారం.. రూ.లక్ష కోట్లకు పైగా ఆస్తులున్న సంస్థలను ఎన్‌బీఎఫ్‌సీ-అప్పర్ లేయర్(యూఎల్)గా గుర్తిస్తారు. టాటా సన్స్ లిస్టింగ్‌పై చర్చ జరుతున్న సమయంలో ఈ ముసాయిదా వెలువడడం గమనార్హం. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం, అగ్రగామి 15 అప్పర్ లేయర్ సంస్థలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కావాలి. 2025 అక్టోబరు నాటి గడువు పూర్తయినా, టాటా సన్స్ ఒక్కటే ఆ జాబితాలో నమోదు కాని కంపెనీగా మిగిలింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కంపెనీలను సైతం ఎన్‌బీఎఫ్‌సీ-యూఎల్ జాబితాలో చేర్చాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎన్‌బీఎఫ్‌సీలు ప్రాథమిక లేదా మధ్య తరహా ఎన్‌బీఎఫ్‌సీలుగా గుర్తిస్తున్నారు మినహా అగ్రగామి ఎన్‌బీఎఫ్‌సీలుగా పరిగణించడం లేదు. అదనపు ద్రవ్యలభ్యత నేపథ్యంలో రూ.2 లక్షల కోట్ల వేరియబుల్ రేట్ రివర్స్ రెపో(వీఆర్ఆర్ఆర్) వేలాన్ని ఆర్‌బీఐ నిర్వహించనుంది. ఈనెల 17న మధ్యాహ్నం 2 -2:30 గంటల మధ్య ఇది జరుగుతుంది.

# 39 రోజుల్లో.. 39 విమానాలను కోల్పోయిన అమెరికా..!

**వాషింగ్టన్:** ఇరాన్‌పై చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో అమెరికా సైన్యానికి భారీ నష్టం జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 39 రోజులు కొనసాగిన ఈ యుద్ధంలో.. అగ్రరాజ్యానికి చెందిన 39 విమానాలను ఇరాన్ ధ్వంసం చేసినట్లు సమాచారం. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై అగ్రరాజ్యం విరుచుకుపడటంతో పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడులతో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. ఐదు వారాలకు పైగా కొనసాగిన ఈ ఘర్షణల్లో.. యూఎస్‌కు చెందిన 39 విమానాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. మరో 10 విమానాలు వివిధ స్థాయిల్లో దెబ్బతిన్నట్లు సమాచారం. మీడియా ప్రకారం కూలిన వాటిల్లో.. ఒక ఏ-10, నాలుగు ఎఫ్-15 స్ట్రైక్ ఈగిల్ యుద్ధవిమానాలు ఉన్నాయి. ఇరాన్ గగనతలంలో అమెరికా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధవిమానం ఒకటి దెబ్బతింది. అగ్రరాజ్యం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ ఐదోతరం యుద్ధ విమానం పోరాటంలో శత్రు దాడికి గురికావడం ఇదే తొలిసారి. సౌదీ అరేబియాలోని ఓ వైమానిక స్థావరంపై ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో.. ఐదు కేసీ-135 రీఫ్యూయలింగ్ విమానాలు దెబ్బతిన్నాయి. అయితే, వాటిల్లో కొన్నింటికి మరమ్మతులు చేశారు. సౌదీ వైమానిక స్థావరంపై జరిగిన దాడిలో అగ్రరాజ్యానికి చెందిన అత్యాధునిక 'బోయింగ్ ఈ-3 సెంట్రీ నిఘా విమానం కూడా తీవ్రంగా ధ్వంసమయ్యింది. ఇక, యూఎస్‌కు చెందిన నాలుగు ఈ-15ఇ ఫైటర్ జెట్‌లు కూడా కూలిపోయాయి. వీటిల్లో మూడు కువైట్‌లో జరిగిన 'ఫ్రెండ్లీ ఫైర్'లో భాగంగా కూలినట్లు యూఎస్ సెంటకామ్ పేర్కొంది. కువైట్‌లోని అమెరికా స్థావరంపై జరిగిన డ్రోన్ దాడిలో ఒక చినూక్ హెలికాప్టర్ ధ్వంసమైందని ఇరాన్ మీడియా పేర్కొంది. ఇవికాక.. ఈ ఘర్షణల్లో అమెరికాకు చెందిన డ్రోన్ విభాగానికి భారీగా నష్టం జరిగింది. దాదాపు 24 ఓఖ్యూ-9ం రీపర్ డ్రోన్‌లు ధ్వంసమయ్యాయి.



# ఈ సారి వర్షాలు తక్కువే..


## జాగ్రత్తగా ఉండాలన్న వాతావరణ కేంద్రం

హైదరాబాద్(జనంసాక్షి): ఇప్పటికే ఎండలు దంచి కొడుతున్నాయి. అయితే అంతగా వర్షాలు మాత్రం పడవని వాతావరణ సంస్థ ప్రకటించింది. తాజాగా తెలంగాణలో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బలమైన ఎల్-నినో ప్రభావం, పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్ పరిస్థితుల కారణంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని తెలంగాణ వెదర్ మ్యాన్ ట్వీట్ చేసింది. 2026 వర్షపాతానికి సంబంధించిన అంచనాలు తెలంగాణలో కొంత ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొంది. కొన్నేళ్లుగా తెలంగాణలో మంచి వర్షాలు పడ్డాయని.. ముఖ్యంగా 2025లో అధిక వర్షపాతం నమోదైందని తెలిపింది. రైతులు సాగు చేసేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొంది. అయితే, 2026లో పరిస్థితి మారే సూచనలు కనిపిస్తున్నాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరించింది. 2018 సంవత్సరం తరహాలో ఈసారి వర్షపాతం ఉండొచ్చని అంచనా వేసింది. జూన్- సెప్టెంబర్ కాలంలో అన్ని నెలలూ 'సగటు కంటే తక్కువ' వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది.

# విదేశాల్లో ఇరాన్ ఆస్తులు.. విడుదలకు అమెరికా అంగీకరించిందా?



పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు పాకిస్థాన్ వేదికగా అమెరికా-ఇరాన్‌లు చర్చలు జరిపేందుకు సిద్ధమయ్యాయి. ఇరాన్ షరతుల నేపథ్యంలో అసలు ఈ చర్చలు జరుగుతాయో లేదోనని విషయంపై ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో వీటికి సంబంధించి కీలక పురోగతి చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఖతార్‌తోపాటు కొన్ని విదేశీ బ్యాంకుల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేసేందుకు అమెరికా అంగీకరించినట్లు సంబంధిత వర్గాల సమాచారం.లెబనాన్‌లో కాల్పుల విరమణ, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల విడుదల అనే రెండు షరతులు అమలైతేనే చర్చలు జరుగుతాయని ఇరాన్ చెబుతోన్న విషయం తెలిసిందే. అయితే, వీటిలో స్తంభింపజేసిన ఆస్తుల్లో ఎంత మొత్తం విడుదల చేసేందుకు అమెరికా అంగీకరించిందనే విషయం తెలియరాలేదు. కేవలం ఖతార్‌లో స్తంభింపజేసిన 6 బిలియన్ డాలర్లను విడుదల చేసేందుకు ట్రంప్ యంత్రాంగం అంగీకరించినట్లు సమాచారం. దీనిపై అగ్రరాజ్యం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రకటన రాకపోవడం గమనార్హం.విదేశాలకు చమురు విక్రయించడం ద్వారా ఇరాన్‌కు భారీగా డబ్బు సమకూరినప్పటికీ వాటిని ఉపయోగించుకోలేకపోతోంది. ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షల కారణంగా ఇవన్నీ స్తంభించిపోయాయి. ఆయా దేశాల బ్యాంకు ఖాతాల్లోనే అనేక బిలియన్ డాలర్లు ఉండిపోయాయి. కేవలం ఖతార్ బ్యాంకుల్లోనే ఆరు బిలియన్లు ఉన్నట్లు అంచనా. అయితే, వీటిని అమెరికా-ఇరాన్‌ల మధ్య జరిగిన ఓ ఒప్పందంలో భాగంగా 2023లోనే విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ.. ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేయడంతో నాటి బైడెన్ యంత్రాంగం మళ్లీ స్తంభింపజేసింది.




**నిబంధనలకు తూట్లు అడ్డగోలు దందా:**
నల్లగొండ ఎక్సయిజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం మాత్రం నిబంధనలు పక్కకు పెట్టు వారి స్వంత కుంపటి స్వ ప్రయోజనాల కోసం మాత్రమే బదిలీలు జరిపినట్లు.సంపద రక్షించే పోలీసులు సంపద భక్షించే పనిలో ఉన్నట్లు సమాచారం.మొత్తము 140 మంది కానిస్టేబుళ్లు, 27 హెడ్ కానిస్టేబుళ్లు బదిలీలు జరుగగా అందులో సగానికి పైగా పోస్టులు సీనియారిటీ అలాగే ఫోకల్ ని ఫోకల్ గానే అలాగే నాన్ ఫోకల్ని వారికి ఇష్టానుసారంగా బదిలీ చేసినట్లు పైరవీలు చేసిన వారికి కావాల్సిన స్థానాలు అప్పజెప్పినట్లు ఆరోపణలు వచ్చాయి.




# మనీ మత్తులో..
## మద్యం ఉన్నతాధికారులు

**బదిలీల్లో అక్రమాలు.. నిబంధనలకు తూట్లు.. అడ్డగోలు దందా..**

అనుకున్న వారికి అనుకూలంగా పోస్టులు

**నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 11, జనంసాక్షి :** నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉన్న ఎక్సయిజ్ డిప్యూటీ కమిషనర్ పరిధిలో నల్లగొండ జిల్లా, సూర్యాపేట జిల్లా,యాదాద్రి జిల్లా,అలాగే జనగామ జిల్లాలు ఈ కమిషనర్ పరిధిలో ఉంటాయి.అయితే మొత్తనికి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఒక్కటే ఎక్సయిజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక్కటే జిల్లాలో పని చేస్తున్న వారిని బదిలీ చేయమని తెలపడం తో కానిస్టేబుళ్ల, హెడ్ కానిస్టేబుళ్ల సీనియారిటీ ప్రకారం చేయాలి కానీ నల్లగొండ ఎక్సయిజ్ డిప్యూటీ కమిషనర్ పరిధిలో మాత్రం బదిలీలు మాత్రం ప్రభుత్వ ఇచ్చిన ఆర్డర్కి భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది.అసలేం జరిగింది చూడండి.

**బదిలీల్లో అక్రమాలు:**
బదిలీలు పారదర్శకంగా కాకుండా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నట్లు మంచి ఆర్థికంగా వనరులు ఉన్న స్థానాల్లో బదిలీ కావాలి అంటే ఒక రేటు లేదు అంటే సూదురమే అనే కోణంలో బదిలీ ప్రక్రియ జరిగినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.కొంత మంది సీనియారిటీ ఉన్న కానీ వాళ్లకు నచ్చిన వారికి వారి స్థానాలు ఇచ్చినట్లు అలాగే ఒక సామాజిక వర్గం వారికి మాత్రమే ఈ బదిలీ పక్రియ లో పెద్ద ఎత్తున సహకారం అందినట్లు బీసీ సామాజిక వర్గం వారికి పూర్తిగా మొండి చెయ్యి చూపినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరి స్థానిక అధికారి ఆయన అనయులకు మాత్రమే పెద్ద పీట వేసినట్లు ఆయనకు నెల వారి మామూళ్లు వసూలు చేసే వ్యక్తులకు ఈ తతంగం అప్పగించి అక్రమాలకు తెర లేపినట్లు బలమైన ఆరోపణ.

**ప్రభుత్వం చర్యలు తీసుకునేనా:**
ఒక వైపు ప్రభుత్వం పారదర్శకంగా ఉన్నత అధికారులు పని చేయాలి అని చెబుతున్న నల్లగొండ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ మరియు ఆయన అనయులు చేస్తున్న తతంగం మీద చర్యలు ఉంటాయా నామ మాత్రమే వ్యవహరిస్తారా గతం లో సంబంధిత అధికారి కార్యాలయంలో పని చేసే అధికారి పిర్యాదు చేసిన ఆయన అనుచరులు ఆ అధికారి ని బ్లాక్ మెయిల్ చేసి కేసులు పెడతాం అని బెదిరిస్తే వారి వేధింపులు తాళలేక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన చర్యలు శూన్యం.ఒక వైపు నిబద్ధతతో పని చేసే అధికారులు ఉంటే మరో వైపు అక్రమార్కులు ఉన్నారు అనడనికి సందేహమే లేదు కావున ప్రభుత్వ సదరు రాష్ట్ర ఎక్సయిజ్ కమిషనర్ ఒక కన్ను నల్లగొండ జిల్లా డిప్యూటీ కార్యాలయం మీద వేస్తే తప్పక ఇంటి దొంగలు దొరికే అవకాశం ఉంది.

# వీధుల మురికి కంటే ప్రమాదకరం కులం!

- ఎస్వికెలో కుల నిర్మూలన ఫోటో ప్రదర్శన
- కుల అడ్డు గోడలను బద్దలు కొట్టాలి



**ముషీరాబాద్, ఏప్రిల్ 11 (జనంసాక్షి):**
వీధుల్లో ఉండే మురికి కంటే ప్రమాదకరమైనది కులమని, పేరుకుపోయిన చెత్తను ఎత్తివేసినట్టే మనిషి మనిషికి మధ్య పేరుకుపోయిన కుల అడ్డు గోడలను బద్దలు కొట్టాలని మున్సిపల్ కార్మికురాలు నర్సమ్మ అన్నారు. జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా శనివారం బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం సంయుక్తాధ్వర్యంలో "కుల నిర్మూలన" ఫోటో ఎగ్జిబిషన్ను మున్సిపల్ కార్మికురాలు నర్సమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ, సమాజంలో పేరుకుపోయిన చెత్తను ఏరేసినట్టు కులాన్ని కూడా సమూలంగా కూల్చాలని సమాజానికి పిలుపునిచ్చారు.ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్ మాట్లాడుతూ, సనాతన వాదులారా, చదువుకున్న మేధావులారా.. ఆలోచించండి. ఒక మున్సిపల్ కార్మికురాలి ఆవేదనను అర్థం చేసుకోవాలని సూచించారు. పేరుకుపోయిన చెత్తను కాల్చేసి కాలుష్యాన్ని శుభ్రపరిచినట్టు కుల రక్కసిని దహనం చేసినప్పుడే మానవత్వం పరిమళిస్తుందన్నారు. నర్సమ్మ ఇచ్చిన పిలుపు సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.
సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్. వినయ కుమార్ మాట్లాడుతూ, పారిశుద్ధ్య కార్మికురాలితో ఈ ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభించడం ఒక చారిత్రక అవసరమని అన్నారు. చెత్త ఎక్కడుందో ఊడ్చే చీపిరికి తెలుసు, మురికి ఎక్కడుందో తుడిచే చేతులకు తెలుసు, కష్టం ఎలా ఉంటుందో కారే కన్నీటికి తెలుసు. అలాగే సామాజిక విప్లవానికి బాటలు వేయాలంటే కష్టపడే కార్మిక వర్గానికే తెలుసన్నారు. కులం ఒక సామాజిక క్యాన్సర్గా ఈ దేశాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద శాపమని, కుల క్యాన్సర్ ఒక దేశం యొక్క ఆత్మను చంపేస్తుందని, ప్రజాస్వామ్యాన్ని, ప్రగతిని అడ్డుకుంటుందని హెచ్చరించారు. దీన్ని నిర్మూలించకుండా ఏ అభివృద్ధి సాధించలేమన్నారు.
విజ్ఞాన దర్శిని రమేష్ మాట్లాడుతూ, ఎగ్జిబిషన్ చాలా చారిత్రకమైనదని, సుమారు 2500 సంవత్సరాల క్రితం నాటి మహనీయుల మాటలు, భారత రాజ్యాంగ సూక్తులు, మహనీయుల సందేశాలు పరిశీలిస్తే కుల అడ్డుగోడలు ఎంత ఆటంకంగా ఉన్నాయో అర్థమవుతుందన్నారు. "కులం క్యాన్సర్" ఫోటో ఎగ్జిబిషన్ చూపరులను చైతన్యం చేస్తుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 5 నుంచి 14 వరకు మానవహారాలు, సాంస్కృతిక ఉత్సవాలు, సాహిత్య సృజన వంటి కార్యక్రమాలు సుందరయ్య విజ్ఞాన కేంద్రం, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం చేపట్టడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో జి. రాములు, శ్రీరామ్ నాయక్, ఎన్. సోమయ్య, అబ్దుల్ సత్తార్, ఎస్వీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ విద్యతోనే వికసిత్ భారత్

- భారతీయ శిక్షణ మండలి ఆర్గనైజింగ్ సెక్రటరీ బిఆర్ శంకరానంద్
- యువశక్తిని ఉపాధి దిశగా తీసుకుపోతున్నాం: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాల కిష్టా రెడ్డి
- ఓయూలో ఘనంగా బిఎస్ఎం 57వ స్థాపన దినోత్సవం




సికింద్రాబాద్ (జనంసాక్షి): మెకాలే విద్యా విధానాన్ని పారదోలి భారతీయ విద్యా విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని భారతీయ శిక్షణ మండలి ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ బిఆర్ శంకరానంద్ పేర్కొన్నారు. భారతీయ శిక్షణ మండలి 57వ ఫౌండేషన్ డే ని శనివారం ఉస్మానియా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన బిఎస్ఎం అఖిలభారత ఆర్గనైజింగ్ సెక్రటరీ బిఆర్ శంకరానంద్ మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యం భారతీయ విద్యతోనే సాధ్యమని ఇందుకు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టం ద్వారా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించేందుకు భారతీయ శిక్షణ మండలి పనిచేస్తుందని వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ఎంతో యువశక్తి ఉందని దీనిని మానవ వనరులుగా మార్చుకున్నప్పుడు భారత్ బలం వస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులను విస్తృతమైన ఉపాధి అవకాశాలు పొందేలా కృషిచేస్తూ తెలంగాణ రైజింగ్ కు పాటుపడుతున్నామన్నారు. ఇందుకు సిలబస్ మార్చడంతో పాటు కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నామని వివరించారు.ఈ కార్యక్రమానికి బిఎస్ఎం తెలంగాణ ప్రాంత అధ్యక్షులు ప్రొఫెసర్ చేతన్ శ్రీవాత్సవ, సెక్రటరీ ప్రొఫెసర్ ఉమా, తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి దేవరాజ్ తోపాటు బి ఎస్ ఎం కార్యవర్గ సభ్యులు, వివిధ పరిశోధన సంస్థలు, యూనివర్సిటీల నుంచి ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

# డై, మోల్డ్ ఇండియా ఎక్స్పో-26లో నెక్స్ట్ జనరేషన్ టూలింగ్ను ప్రదర్శించనున్న టాగ్మా



**ఖైరతాబాద్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** దేశంలోని డై, మోల్డ్ పరిశ్రమకు అతిపెద్ద, అత్యంత ప్రతిష్టా త్మకమైన డై, మోల్డ్ ఇండియా తన 14వ ఎడిషన్ తో ఏప్రిల్ 21 నుంచి 24 తేదీల్లో ముంబైలోని గోరే గావ్లో గల బాంబే ఎగ్జిబిషన్ సెంటర్లో జరగను న్న ప్రదర్శనలో దేశంలో టూల్, డై తయారీదారుల కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక సంఘం అయిన టాగ్మా ఇండియా(టూల్, గేజ్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్) నిర్వహిస్తోందని ఆ సంస్థ ప్రతినిధు లు శనివారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ ఇది దేశపు టూలింగ్, మోల్డ్-మేకింగ్ ఎకోసిస్టమ్ కోసం అత్యం త ప్రభావవంతమైన, సమగ్రమైన ద్వైవార్షిక వేదిక గా కొనసాగుతోందని చెప్పారు.13 అత్యంత విజయవంతమైన ఎడిషన్ల బలమైన వారసత్వంతో, డై, మోల్డ్ ఇండియా భారతీయ డై, మోల్డ్ పరిశ్రమ యొక్క ఫ్లాగ్షిప్ ఎక్స్పోగా స్థిరంగా నిలిచిందని తెలిపారు. ఇది పరిశ్రమ నిపుణులు, సాంకేతిక ప్రదాతలు, ప్రపంచ ఆవిష్కర్తలను ఒకచోట చేర్చు తుందని అన్నారు. దాదాపు 700 కంపెనీల బలమైన సభ్యత్వాన్ని కలిగి ఉన్న టాగ్మా ఇండియా, తయారీ రంగ భవిష్యత్తును తీర్చిదిద్దే అధునాతన సాంకేతికతలు, పరిష్కారాలను ప్రదర్శించడానికి పరిశ్రమను ఒకే వేదికపైకి తీసుకువస్తోందని చెప్పారు. డై, మోల్డ్ ఇండియా ఎక్స్పో-26, టూలింగ్, మోల్డ్-మేకింగ్, ప్లాస్టిక్ ఇంజెక్షన్ మోల్డింగ్, ప్రెసిషన్ మ్యానుఫ్యాక్చరింగ్లో తాజా పరిణామాలు, అధు నాతన సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శిస్తుందని అన్నారు. సందర్శకులు డై, మోల్డ్ పరిశ్రమ కోసం సీఎన్ సీ మెషీనింగ్, ఈడియం సిస్టమ్స్, సిఏడి, సిఏఎం, సిఏఈ సాఫ్ట్వేర్, యాడిటివ్ మ్యానుఫ్యా క్చరింగ్, హీట్ ట్రీట్మెంట్ సొల్యూషన్స్, అధునాతన 3 డి ప్రింటింగ్ అప్లికేషన్ల యొక్క సమగ్ర ప్రద ర్శనలను ఆశించవచ్చని పేర్కొన్నారు.

*బాన్సువాడ పరిధిలోని ఇబ్రహీంపేట్ గ్రామ సమీపంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తేదీ 11-04-2026 మధ్యాహ్నం ఇబ్రహీంపేట్ గ్రామ సమీపంలో గంజాయి సేవిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారికి డ్రగ్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్గా తేలింది.*

# శతాధిక గ్రంథకర్త మలయశ్రీకి కన్నీటి వీడ్కోలు



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 11 (జనం సాక్షి)** సుప్రసిద్ధ హేతువాద కవి, రచయిత, నాస్తికుడు, భౌతికవాది, ద్వైమాసిక పత్రిక సంపాదకుడు డా. మలయశ్రీకి శనివారం అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు పలికారు. కవులు, కళాకారులు, రచయితలు, సామాజికోద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న మలయశ్రీ శుక్రవారం కరీంనగర్లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. అదే రోజు రాత్రి స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణ వార్తతో సాహిత్య రంగంలో విషాదం నెలకొంది.
శతాధిక గ్రంథకర్తగా పేరుగాంచిన మలయశ్రీ పలు ప్రక్రియల్లో రచనలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయన రచించిన 'శాంతి పథము' పుస్తకం కొంతకాలం ఇంటర్మీడియట్ పాఠ్యాంశంగా కొనసాగడం విశేషం. హేతువాద భావజాలాన్ని ప్రజల్లో విస్తరించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అంతిమ కార్యక్రమానికి వేణుశ్రీ, సరిపల్లి కృష్ణారెడ్డి, బాలసాని రాజయ్య, కూకట్ల తిరుపతి, మార్వాడి సుదర్శన్, లక్ష్మణబోధి, గండ్ర లక్ష్మణరావు, బూర్ల వెంకటేశ్వర్లు, రంగినేని మోహనరావు, జూకంటి జగన్నాథం, కలవకుంట్ల రామకృష్ణ, సబ్బని లక్ష్మీనారాయణ, గాజోజు నాగభూషణం, బాలసాని కొమురయ్య, గుండు రమణయ్య, ఆడెపు లక్ష్మణ్, గడిపే మల్లేశం, వైరాగ్యం ప్రభాకర్, సమ్మయ్య, బుచ్చయ్య తదితర కవులు, రచయితలు హాజరయ్యారు.
అలాగే నాస్తిక సంఘం నాయకులు జీడి సారయ్య, దళిత లేబరేషన్ నాయకులు మార్వాడి సుదర్శన్, విద్యార్థి సంఘ నాయకులు బాలసాని లెనిన్ తదితరులు పాల్గొని మలయశ్రీకు ఘన నివాళులర్పించారు. ఆయన మృతి సాహిత్య, సామాజిక రంగాలకు తీరని లోటుగా భావిస్తున్నారు.




## గంగుల హరిహరన్ సాయి వివాహానికి
# కేసీఆర్ను ఆహ్వానించిన గంగుల కమలాకర్

**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 11 ( జనం సాక్షి) :** కరీంనగర్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తన కుమారుడు గంగుల హరిహరన్ సాయి - దీక్షల వివాహ వేడుక ఈనెల 26న జరగనున్న సందర్భంగా శనివారం కుటుంబ సమేతంగా ఎర్రవెల్లిలోని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నివాసానికి వెళ్లి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ను వ్యక్తిగతంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేసీఆర్ సతీమణి శోభమ్మ, గంగుల కమలాకర్ సతీమణి గంగుల రజిత, వరుడు హరిహరన్ సాయి, వధువు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అలాగే గంగుల కమలాకర్ వియ్యంకులు డా. ప్రదీప్ కుమార్ (ఐఆర్ఎస్) వారి సతీమణి డా. విజయ గౌరీ తదితరులు హాజరయ్యారు. వివాహ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రముఖులు, రాజకీయ నాయకులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

# ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను తొలగిస్తే చూస్తూ ఊరుకోం

- బీజేపీ అవంభిస్తున్న విధానాలను ఎండగడుతాం
- రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐఆర్ పై బూత్ లెవల్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నాం
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్



**హుజురాబాద్, ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** దేశంలో బీజేపీ పార్టీ అవలంభిస్తున్న విధానాలను ఎండగడుతూ ఎస్ఐఆర్ పేరుతో అక్రమ చొరబాటుదారుల పేరు చెప్పి పేద, మధ్య తరగతి ఓటర్లను ఓటు హక్కుకు దూరం చేస్తున్నారని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆరోపించారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసిసి పరిశీలకులుగా రాష్ట్ర పిసీసీ ప్రధాన కార్యదర్శులుగా ఉన్న ఆడమ్ రాజ్ డెక్కపాటి,కాశపాక రాజేష్ లతో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ఎస్ఐఆర్ విధానం వల్ల పన్నెండు రాష్ట్రాల్లో ఓట్లను తొలగించడం జరిగిందని,ఇలాంటి తప్పులు తెలంగాణలో జరగకుండా ఉండడానికి నియోజకవర్గ పరిధిలో ప్రతి బూత్కి బూత్ లెవల్ కమిట్ మెంబర్ లను రాష్ట్ర పిసీసీకి అందిస్తున్నామని,దీనిపై మొన్నటి ఎలక్షన్లో దొర్లిన తప్పులను ఇప్పుడు దొర్లకుండా ఈ కమిటీ చూసుకుంటుందని తెలిపారు.రాష్ట్ర పిసీసీతో పాటు డిసిసిలకు కూడా ఈ సమాచారం వద్ద ఉంటుందని, ఏదైనా ఓటుహక్కు విషయంలో సమస్య ఏర్పడినప్పుడు పరిష్కారానికి ఈ కమిటీ చొరవ చూస్తుందని, బీహార్ రాష్ట్రంలో అక్రమ చొరబాటు దారుల పేర్లతో అనేక మంది మైనారిటీ,బీసీ,ఎస్సీ ఓట్లను తొలగించారని,దీనిపై రాహుల్ గాంధీ వివరంగా ఎన్నికల కమిషన్ కు నివేదిక సమర్పించారని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,హుజూరాబాద్ పట్టణ,మండల అధ్యక్షులు,మహిళా నాయకురాల్లు, సీనియర్ నాయకురాలు, యూత్ కాంగ్రెస్,సోషల్ మీడియా నాయకులు,మైనారిటీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కామారెడ్డి గోపా సన్నాహక సమావేశం సక్సెస్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గోపా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏప్రిల్ 10, 2026 సాయంత్రం 5 గంటలకు లయోలా హైస్కూల్, కామారెడ్డి పట్టణంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సమావేశానికి కామారెడ్డి జిల్లాకు చెందిన 25 మంది గోపా సభ్యులు హాజరైనారు. హాజరైన సభ్యులు మాట్లాడుతూ, ఐక్యత, అభివృద్ధి కోసం నిరంతరం రాష్ట్ర వ్యాప్తంగా అవిరల కృషి చేస్తూ గౌడ జాతిని ఏకం చేయాలనే దృఢ సంకల్పంతో 1975లో స్థాపించబడిన రాజకీయేతర గొప్ప వేదిక అయిన గోపా మన జిల్లాలో కూడా వెంటనే ఏర్పాటు చేయాలని సమావేశానికి వచ్చిన అందరూ ముక్త కంఠంతో తీర్మానం చేశారు.సమావేశానికి హాజరైన అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ సభ్యులు అందరు కూడా వెంటనే సభ్యత్వం తీసుకోవడం జరిగినది. వచ్చే 20 ఏప్రిల్ సోమవారం సాయంత్రం 5 గంటలకు మరో మీటింగ్ ఏర్పాటు చేయడానికి తీర్మానం చేసి అట్టి మీటింగ్కి జిల్లాలో ఉన్న అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ ఎక్కువ సంఖ్యలో పాల్గొనే విధంగా ప్రతీ సభ్యుడు కృషి చేయాలని తీర్మానం చేయడం జరిగినది.ఈ మావేశానికి రాష్ట్ర కమిటీ తరపున రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ యల్మకంటి మీరయ్య గౌడ్ హాజరై గోపా సభ్యత్వ వివరాలతో పాటు పూర్వం గోపా ద్వారా చేసిన పలు కార్యక్రమాలను వివరించడం జరిగినది. భవిష్యత్తులో చేబట్టబోయే కార్యక్రమాల ప్రణాళికలలో భాగంగా వచ్చే డిసెంబర్ 31 లోగా 2 లక్షల మెంబర్షిప్ పూర్తి చేసి అర్హత ఉన్న ప్రతీగౌడ్ని ఈ వేధిక లోకి తీసుకుని వచ్చి అన్ని రకాల సూచనలు, సలహాలు, సాంకేతిక పరిజ్ఞానం అందిస్తూ, ఆర్థికంగా, రాజకీయంగ, సామాజికంగా గౌడ్ లను ముందు వరుసలో నిలబెట్టడమే లక్ష్యం అని వివరించారు.ఈ సమావేశానికి హాజరైన ప్రముఖ సభ్యులు రంగా వెంకటేశ్వర్లు గౌడ్, కళాలి శ్రీకాంత్ గౌడ్, అంకన్నగారి నాగరాజ్ గౌడ్, డాక్టర్ పల్స హరీష్ గౌడ్, న్యాయవాదులు శ్రీకాంత్ గౌడ్, రాజు బాబు గౌడ్, స్వామి గౌడ్, రాజా గౌడ్,కోడిపాక నరేందర్ గౌడ్, యాదా గౌడ్, సందీప్ గౌడ్,తిరుపతి గౌడ్, బుర్ర విజయ్ కుమార్ గౌడ్, మోతే అశోక్ గౌడ్ , ఉప్పునూతల రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సాహెబ్ నగర్ లో రెండు కేజీల గంజాయి పట్టివేత



**హయత్ నగర్, ఏప్రిల్ 11 (జనం సాక్షి)**
వనస్థలిపురం పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఎస్ఓటి ఆధ్వర్యం లో 2 కిలోల గంజాయి, దాన్ని అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులు, త్రాగడానికి వచ్చిన (వినియోగదారులు) మరో ఇద్దర్ని పట్టుకోవడం జరిగిందని వనస్థలిపురం ఎస్హెచ్ఓ రవిబాబు తెలిపారు. సాహెబ్ నగర్ లోని గాయత్రి నగర్ లో ఒక రూమ్ లో రెండు కేజీల గంజాయినీ దాచి ఉంచి, త్రాగడానికి వచ్చిన మరో ఇద్దరు వ్యక్తులకు అమ్ముతున్నారని, విశ్వాసనీయ సమాచారం మేరకు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి సోదా చేయుటకు పర్మిషన్ తీసుకొని, ఇంటిలో సోదా చెయ్యగా రెండు కేజీల గంజాయిని, మిరియాల లెనిన్, మొహమ్మద్ ఉమర్, ఎడవెల్లి మనోజ్ కుమార్, ముగ్గురు వ్యక్తులు అమ్ముతుండగా, మరొ ఇద్దరూ తండు నవీన్, గుంజన్ శర్మ లు కొనుగోలు చేస్తుండగా రెడ్ హ్యాండెడ్గా పట్టుకొని, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్హెచ్ఓ రవిబాబు తెలిపారు.




# అబ్కారీ శాఖ మారేదెన్నడు..?

**నిజామాబాద్ జిల్లాలో వసూళ్ల పర్వం ముగియకముందే మరో ఉదంతం**

**ఎక్సైజ్ కమిషనర్ శ్రీకాకుళం నుండి తెలంగాణకి**
సదరు ఎక్సైజ్ కమిషనర్ను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా కేంద్రానికి లేక వ్రాసి శ్రీకాకుళంలో పనిచేస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి తెలంగాణ ఎక్సైజ్ శాఖ కు కమిషనర్గా బదిలీ చేయాలని కోరడంతో తెలంగాణ ఎక్సైజ్ శాఖ కమిషనర్గా బదిలీపై వచ్చిన తాను అడ్డు అదుపు లేకుండా దుర్భాషలాడుతూ కిందిస్థాయి ఉద్యోగులను బూతు మాటలతో కించపరుస్తూ ఉద్యోగరీత్యా పై అధికారి కావడంతో ఎవరు కూడా ఆయనకి ఎదురు చెప్పకుండా భరిస్తున్నారని సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

- డిప్యూటీ కమిషనర్పై ఎక్సైజ్ కమిషనర్ బూతు మాటలు
- పరాభవం తట్టుకోలేక డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి రాజీనామాకు సిద్ధం

**నిజామాబాద్ బ్యూరో, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :**
నిజామాబాద్ జిల్లా ఆబ్కారి శాఖ వివాదాలకు నిలయంగా మారింది. ఆబ్కారి శాఖ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి రాజీనామా ఉదంతం జిల్లా కేంద్రంలో కలకలం రేపుతోంది. గత పది రోజుల క్రితం ఆబ్కారి శాఖలో పంపకాల లొల్లి జరిగిన ఉదంతం మానిపోకముందే డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఉన్నతాధికారి చేతిలో ఘోరమైన పరాభవం చెంది మానసిక ఆవేదనకు గురై తాను ఇక ఉద్యోగంలో ఇమడలేనని భావించి ఆసుపత్రిపాలై కుటుంబ సభ్యులతో సమాలోచన జరిపి తన ఉద్యోగానికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు మెసేజ్ ద్వారా సందేశం అందించారు.
సోమిరెడ్డి రాజీనామా చేయాలని ఆలోచనకు మూల కారణం తనపై అధికారి అయిన ఎక్సైజ్ కమిషనర్ బూతు మాటలు తిట్టడమేనని తెలుస్తోంది. సదరు అధికారి తన చాంబర్లో నలుగురు అధికారుల ముందు "వెధవ", "ఇడియట్" అంటూ పరుషమైన పదజాలంతో దూషించడం వల్ల అక్కడికక్కడే కుప్పకూలిన సోమిరెడ్డిని ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం స్థిమితంగా ఉండడంతో కుటుంబ సభ్యుల సమక్షంలో తనకు జరిగిన అవమానాన్ని వారితో పంచుకొని తనను రక్షించిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తాను గతంలో ఉన్నతాధికారి ఎన్నిసార్లు బూతు మాటలతో తనను వేధించిన కొంతమంది అధికారుల చేయూతతో ఇన్ని రోజులు ఈ ఉద్యోగాన్ని నెట్టికొచ్చానని, తనది చాలా సున్నితమైన మనస్తత్వం అని, తాను ఉద్యోగరీత్యా ఎలాంటి తప్పులు చేయలేదని తనను ఈ పరుషమైన పదజాలంతో తిట్టడం వలన మానసిక శోభకు గురై ఇక తాను ఈ ఉద్యోగం చేయలేనని రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.
ఎక్సైజ్ కమిషనర్ శ్రీకాకుళం నుంచి తెలంగాణకు బదిలీ అయి వచ్చిన సీనియర్ ఐఏఎస్ అధికారి అడ్డు అదుపు లేకుండా దుర్భాషలాడుతూ కిందిస్థాయి ఉద్యోగులను బూతు మాటలతో కించపరుస్తూ ఉద్యోగరీత్యా పై అధికారి కావడంతో ఎవరు కూడా ఆయనకు ఎదురు చెప్పకుండా భరిస్తున్నారని సోమిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి చొరవ తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని నిజామాబాద్ జిల్లా వాసులు కోరుతున్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్ళు కావస్తుంది, మంచి ముహూర్తాలు, పండుగలు, గడువులు, అన్ని దాటిపోయాయి కానీ నామినే టెడ్ పోస్టుల భర్తీపై మాత్రం ప్రభుత్వం ముందడుగు వేయటం లేదు, త్వరలో పదవులు అంటూ. పీసీసీ చీఫ్ స్టేట్మెంట్ రిపీట్స్ చేసిన ఆలస్యం ఎందుకు అవుతుంది,అదిగో ఇదిగో అంటున్నారు. అంతలోనే వాయిదా వేస్తున్నారు. ఎందుకు పోస్ట్‌పోన్ చేస్తున్నారో.అసలు పదవులు వస్తాయో .లేదో కూడా అర్థంకాని పరిస్థితి తెలంగాణలో.

# పదవులు మాకెప్పుడు

## నామినేటెడ్ పోస్టుల కోసం నాయకుల వెయిటింగ్

- రెండున్నరేళ్లు గడిచినా భర్తీపై ముందడుగు లేదు
- "అదిగో ఇదిగో" అంటూ వాయిదాల పరంపర



**ముస్తాబాద్ ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** ఇంతకీ పదవుల పంపకాలు ఎక్కడ ఆగుతున్నాయి. ఎందుకు ఆపుతున్నారు. నామినేటెడ్ పదవులు ఆశించిన చాలా మంది నేతలు ఇప్పుడు నిర్వేదంలో ఉన్నారు. అది గో ఇదిగో అని చెప్పడమే తప్పితే పదవులు వచ్చేది లేదు పోయేది లేదు అం టూ చెప్పుకుంటున్నారు. పార్టీ నాయకత్వం వారం పది రోజుల్లో అంటూ రెండేళ్లు వాయిదా వేసుకుంటూ వచ్చారు. ఇప్పటికీ పార్టీ నేతలు చెబుతున్న గడువు వారం.. పది రోజులు. జాబితా అంతా సిద్ధం చేసి నా ఎందుకు ఆగుతోందో.ఎక్కడ ఆగుతోందో అంతుచిక్కని ప్రశ్నగా మారుతోంది.పార్టీ సమావేశాల్లోనే బహి రంగంగా సీఎం రేవంత్ రెడ్డి.నామినేటెడ్ పద వులు భర్తీ చేద్దాం...పార్టీ నుంచి జాబితా పంపిం చండి అంటూ స్టేట్మెంట్ చేశారు. ఆ తర్వాత పార్టీ నాయకత్వం ఇన్చార్జిలను నియమించి జిల్లాల వారీ గా జాబితాలను కూడా సిద్ధం చేసింది. కానీ ఇప్పటికీ నామినేటెడ్ పోస్టుల భర్తీ పెండింగ్లోనే కొనసాగుతోంది. ఎందుకు. ఏమిటి అనేది ఎవరికీ బోధపడ్డం లేదు.

ఇటీవల పార్టీ కుల సంఘా లకు సంబంధించిన కార్పొరేషన్లను భర్తీ చేస్తామని చెప్పుకుంటూ వచ్చింది. 16 నుంచి 17 పోస్టులను భర్తీ చేస్తామంటూ స్పష్టం చేశారు. చెప్పి నెల గడిచినా అడుగు ముందుకు పడలేదు. ఇప్పుడు కొత్త గడువు. వారం పది రోజులకు వచ్చింది. పదవులు ఇచ్చే ఆలోచన లేదా. భర్తీ చేస్తే నాయకులకు నష్టమేంటని నేతలు విసుక్కునేదాకా సాగదీత వ్యవహారం వెళ్తోంది.నామినేటెడ్ పోస్టులు అనేక దశల్లో ఫిల్టర్ అవుతూ కొలిక్కి వస్తున్నాయి. చర్చించిన తర్వాత పేర్లు ఫైనల్ అవుతున్నాయని తెలుస్తోంది. రెండు, మూడు పర్యాయాలు వీళ్లంతా సమావేశం కూడా అయ్యారు. అయితే ఈ కమిటీలో సమన్వయం లేకపోవడం వల్లనే వాయిదా పడుతుందన్న చర్చ కూడా నడుస్తోంది. నిజంగానే నాయకుల మధ్య సమన్వయం ఉంటే ఇన్నాళ్లు ఇది వాయిదా పడుతూ వచ్చేది కాదు అనేది ఓపెన్ టాక్.ఇప్పటి వరకు 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. ఆ కార్పొరేషన్లలో డైరెక్టర్లను భర్తీ చేసినా చాలామంది నాయకులు సంతోషపడేవారు. వాటిని కూడా భర్తీ చేయడం లేదు. ఒకట్రెండు నెలల్లో ఆ కార్పొరేషన్ చైర్మన్ల పదవి కూడా ముగుస్తుంది. క్షేత్రస్థాయిలో క్యాడర్ కూడా కొంత అసంతృప్తితో కనపడుతోంది. పనులు అవ్వడం లేదన్న ఆగ్రహంతో వుంది. మరోవైపు నాయకులకేమో పదవులు రాక బీపీ రైజ్ అవుతోంది. ఎదురుచూసి..ఎదురుచూసి.విసుగు చెందిన తర్వాత పదవి వచ్చినా.సదరు నాయకుల్లో ఆ జోష్ సగం సచ్చిపోయి ఉంటుంది. ఇప్పటికైనా నామినేటెడ్ పోస్టుల భర్తీ గందరగోళానికి పార్టీ నాయకత్వం ఎప్పుడు ఫుల్‌స్టాప్ పెడుతుందో చూడాలి మరి

# ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాల కోసం ప్రభుత్వం పని చేస్తుంది

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**సిరిసిల్ల టౌన్ ఏప్రిల్ 11( జనంసాక్షి) :** మహాత్మ జ్యోతిరావు పూలే ఆలోచన విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ వైద్య, విద్యకు ప్రాధాన్యతనిస్తుందని కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా సిరిసిల్లలోని అంబేద్కర్ చౌక్ వద్ద జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల విగ్రహాలకు పూలదండలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే ఆనాడు సమాజంలో జరుగుతున్న వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. ఇచ్చిన మాట ప్రకారంగా జిల్లా కేంద్రంలో మహనీయుల విగ్రహాలను నెలకొల్పుకోవడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య విద్యకు ప్రాధాన్యతనిస్తుందని, ప్రతి ఒక్కరికి ఉద్యోగం కల్పించాలన్న ఉద్దేశంతో అడ్వాన్సింగ్ సెంటర్ ను ప్రారంభిస్తున్నామని, అలాగే యూనివర్సిటీలు స్పోర్ట్స్ సెంటర్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసుకున్నామని, రానున్న రోజుల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో ఉన్నటువంటి ఆసుపత్రులను కలుపుకుని పేదవారికి వైద్యం అందేలా 36వేల బెడ్లను నూతనంగా ఏర్పాటు చేసుకోవడం కోసం ప్రభుత్వం రూపకల్పన చేస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. భారతదేశంలోని తెలంగాణ రోల్ మెడల్ అవుతుందని అన్నారు ప్రభుత్వం సన్న బియ్యం ప్రవేశపెట్టిందని 14,650 కోట్లు ఖర్చు అవుతుందని, మూడు కోట్ల 56 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం అందించడం జరుగుతుందన్నారు. భారతదేశంలో మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఆయన ఆశయాలకనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. సిరిసిల్లలోని నేత కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం పని కల్పిస్తుందని నేత కార్మికులను ఆదుకోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, చొప్పదండి ప్రకాష్, గడ్డం నర్సయ్య, వెలుముల స్వరూప, కూరపాటి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# రైతుల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్**



**బోధన్, ఏప్రిల్ 11 ( జనంసాక్షి ) :** రైతుల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతు సంక్షేమం కోసం కోట్ల రూపాయల వ్యయంతో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్ స్పష్టం చేశారు. శనివారం బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు బోధన్ సహకార సంఘం ఆధ్వర్యంలో, బోధన్ మండలం పెంటాకలాన్ సహకార సంఘం ఆధ్వర్యంలో, పెగడాపల్లిలో ఐకెపి ఆధ్వర్యంలో, బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్ తో కలిసి ప్రారంభించారు. అలాగే బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సైతం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు న్యాయమైన వడ్లు కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా కొనుగోలు కేంద్రాలలో తక్షణమే సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో ఈ కొనుగోలు కేంద్రం పనిచేసేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వరరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి,వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, శరత్ రెడ్డి, గణపతి రెడ్డి, సంజీవ్ రెడ్డి, దాము, పెంటాకలాన్ సర్పంచ్ కర్లం కళావతి, లంగ్డాపూర్ సర్పంచ్ శోభారాణి పద్మాకర్, బర్దీపూర్ సర్పంచ్ గోనె అమూల్య మహేష్, పెగడాపల్లి సర్పంచ్ మద్ది రచన సుదర్శన్, ఉప సర్పంచ్ షబ్బీర్, శ్రీనివాస్ రెడ్డి, మంద నాగరాజు, కృష్ణ రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కారడి సాయిబాబా, ఐకెపి ఎపిఎం సాయిలు, సీసీ, మాజీ సహకార సంఘం చైర్మన్ దొనకంటి రాజరెడ్డి, సంజీవ్, నాగరాజు, పోతారెడ్డి, సహకార సంఘం కార్యదర్శి బాబా, వ్యవసాయ శాఖ అధికారి సంతోష్ నాయక్, ఏఈవో సుప్రియ, రైతులు పాల్గొన్నారు.

# సస్పెన్షన్ ,ఎస్మాకు బయపడేదిలేదు

## హక్కులు సాధించేవరకు పోరాడుతాం

- నాలుగవ రోజుకు చేరిన విద్యుత్ కార్మికుల నిరవధిక సమ్మె
- మద్దతు పలికిన విద్యుత్ కార్మిక, వామపక్ష కార్మిక సంఘాలు, పలు పార్టీల నేతలు



**గోదావరిఖని, జనంసాక్షి:** న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని విద్యుత్ కార్మికులు చేపట్టిన నిరవధికే సమ్మె నాలుగవ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో బాగంగా పెద్దపెల్లి మండలం రాఘవపూర్ ఎస్సీ కార్యాలయం ఆవరణలో విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె నాలుగవ రోజు కొనసాగింది.ఈ సమ్మెకు పలు విద్యుత్ కార్మిక సంఘాలు, విప్లవ కార్మిక సంఘాలు,వామపక్ష పార్టీల నాయకులు తమ మద్దతు ప్రకటించి సంఘీబావం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్స్ రద్దుచేసి ఏపీఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, అన్ మ్యాన్ కార్మికులను సంస్థలో విలీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.మీటర్ రీడర్స్, పీస్ రేటు కార్మికులకు జీవో ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వం ,యాజమాన్యం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని హక్కులు సాదించే వరకు సమస్యలను పరిష్కరించేంత వరకు పూర్తి స్థాయిలో తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఎస్మాలకు,సస్పెన్ష్ లకు యాజమాన్య బెదిరింపులకు బయపడేది లేదని స్పష్టం చేశారు.సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని విద్యుత్ ఆర్టిజన్స్ జెఎసి నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ,విద్యుత్ సంస్థలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ పెద్దపల్లి జిల్లా చైర్మన్ మల్లోరి కిషన్ రెడ్డి, అన్ మ్యాన్ నాయకులు రమేష్ ఆర్టిజన్లు గోపతి తిరుపతి కొండి రమేష్ షిరీష్ రఘు సుమన్ షఫి సురేష్ ఎల్లయ్య సురేష్ శ్రీనివాస్,రమేష్ ఆదికొండల్,ఆర్టిజన్లు,స్పాట్ బిల్లర్లు,పీస్ రేట్ కార్మికులు పాల్గొన్నారు.

# సామాజిక సమానత్వం పూలే ఆశయం

**బీసీ జేఏసీ జిల్లా చైర్ పర్సన్ దాసరి ఉష**

**పెద్దపల్లి,ఏప్రిల్ 11(జనంసాక్షి) :** మహిళా విద్య, సామాజిక సమానత్వం మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయం అని పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ దాసరి ఉష కొనియాడారు. పెద్దపల్లి పట్టణ కేంద్రంలో శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి ఉష పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారతదేశంలో బహుజన వర్గాల అభ్యున్నతి, మహిళల విద్యా వికాసానికి జ్యోతిరావు పూలే చేసిన కృషి అనన్య సామాన్యమని అన్నారు. పూలే చూపిన చొరవతోనే నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. తన భర్త ఆశయాల కోసం సావిత్రిబాయి పూలే ఎన్నో అవమానాలను భరించి దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా నిలిచి విద్యా ప్రభంజనాన్ని సృష్టించారని గుర్తు చేశారు. వారి ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# అబ్బురపరిచిన అల్ఫోర్స్ బిజినెస్ కాన్సెప్ట్

**అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి**



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** విద్యార్థులకు వ్యాపార లావాదేవిల గురించి తెలియపరచవలసిన అవసరం చాలా ఉన్నదని వీటి ద్వారా వారికి డబ్బు ప్రాముఖ్యతను తెలియపరచిన వాళ్ళమవుతామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వినూత్నంగా సృజనాత్మకంగా ఏర్పాటు చేసినటువంటి అల్ఫోర్స్ బిజినెస్ కాన్సెప్ట్ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోజువారి కార్యకలాపాలలో వ్యాపారం చాలా కీలకంగా వ్యవహరిస్తుందని, ఈ వ్యాపారం గురించి విద్యార్థులకు తెలియజేయాలని తద్వారా వారు డబ్బులను పోగు చేసుకుంటారని అదేవిధంగా ఏ వస్తువు ఏ విధంగా మనకు ఉపకరిస్తుందో తెలుస్తుందని వారు చెప్పారు. నేడు ప్రపంచాన్ని శాసిస్తున్నటువంటి వ్యాపారారంగంలో అనేక రకాలుగా లావాదేవీలు చోటు చేసుకుంటాయని అదేవిధంగా వ్యాపారాలు వివిధ రకాలుగా నిర్వహించడం జరుగుతుందని ప్రధానంగా దేశ విదేశాల్లో ట్రేడింగ్ ద్వారానే మన దేశ అభివృద్ధి తెలుస్తుందని, వ్యక్తిగత అభివృద్ధి సైతం వ్యాపారం ద్వారా తెలుస్తుందని వారు చెప్పారు. ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు వివిధ రకాల అంశాలను చాలా సృజనాత్మకంగా వివిధ రకాల రూపాలలో ప్రదర్శించారని వేడుకలలో భాగంగా పలు అంశాలు ప్రధానంగా సారీస్, బట్టలు, దుస్తులు, కుర్తి, ఇమిటేషన్ జ్యువలరీ, క్రాఫ్ట్, టోపీలు, గూగుల్ వాచెస్, పర్ఫ్యూమ్స్, స్టేషనరీ, బెలూన్ షూటింగ్, ఫుడ్ కోర్ట్ బండార్ తదితరులు చాలా ఆకర్షణీయంగా నిలిచాయని విద్యార్థులు ప్రదేశించినటువంటి విధానాలు చాలా ఆలోచింపచేయడమే కాకుండా నిజమైన మార్కెట్ ను తలపించే విధంగా ప్రదర్శనను రూపొందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహనీయులను అర్థం చేసుకుంటేనే చరిత్ర సృష్టిస్తాం!

- అట్టడుగు వర్గాల కోసం ఆనాడే ఆలోచించిన మహనీయులను గుర్తించాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



**మంథని/రామగిరి, ఏప్రిల్ 11 (జనంసాక్షి):** అట్టడుగు వర్గాల కోసం ఆనాడే ఆలోచన చేసిన మహనీయులను అర్థం చేసుకోకపోతే చరిత్ర సృష్టించలేమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అన్నారు. మహనీయుల మాసోత్సవాల్లో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటనరీ కాలనీలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి దీక్షాపరులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, తల్లిదండ్రులను చూడకపోయినా చిన్నప్పటి నుంచే న్యాయబద్ధంగా సమాజం కోసం, భవిష్యత్ కోసం అనేక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. 1988లో తనకు అవమానం అంటే అర్థమైందని, దౌర్జన్యం, గుండాయిజం అంటే మంథనిలోని క్రీడామైదానంలో చూశానని తెలిపారు. ఎక్కడి నుంచో క్రికెట్ చూసేందుకు వచ్చి గ్రౌండ్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని మంథనికి చెందిన మరో వ్యక్తి మధ్యలో ఆపి కొడుతుంటే చూసి "ఇంత అన్యాయమా" అని బాధపడి, అవమానం, బానిసత్వాన్ని రూపుమాపేందుకు నియోజకవర్గంలో యుద్ధం మొదలుపెట్టానని అన్నారు.

మహాత్మ జ్యోతిబా పూలే, డా. బీఆర్ అంబేద్కర్ గురించి 2011లో శంకర్‌లాల్ ద్వారా తెలుసుకుని అర్థం చేసుకున్నానని, ఆనాటి నుంచి ఇప్పటి వరకు వారి ఆశయాల కోసం పనిచేస్తున్నానని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాతనే మహనీయులను వాడుకుంటున్నారని మాట్లాడుకుంటున్నారని, కానీ 2014లో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత 2015లోనే జ్యోతిబా పూలే కాంస్య విగ్రహం ఆవిష్కరణ చేశామని, రాష్ట్రంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం ఇక్కడే మొదటిదని గుర్తు చేశారు.

తాను ఎమ్మెల్యేగా గెలిచిన మరుసటి సంవత్సరం నుంచే మహనీయుల మాసం ప్రచార కార్యక్రమం నిర్వహించానని తెలిపారు. చాలా మంది ఇప్పటికీ "పుట్ట మధు ఓడిపోయాడు" అని చులకనగా చూస్తూ అపహాస్యం చేస్తున్నారని, కానీ మహాభారతంలో అర్జునుడి లక్ష్యం ఏ విధంగా ఉంటుందో అదే విధంగా తనకు అంతిమ విజయం కనిపిస్తుందన్నారు. ఓటమిలో కూడా గెలుపును చూశానని అన్నారు.

తాను ఈనాడు ఏ కుల సంఘ మీటింగ్‌కు వెళ్లడం లేదని, కేవలం బీసీల మీటింగ్ అంటేనే వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆనాడు బీసీలకు రిజర్వేషన్లు ఉండాలని కోరుకున్న అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ మనకు దూరం చేసి, ఒక్కవర్గానికి చెందినవారని ప్రచారం చేసిందన్నారు. అంబేద్కర్ రిజర్వేషన్ల పుణ్యాన ఈనాడు ఎస్సీలు అసెంబ్లీ, పార్లమెంట్‌లో కూర్చుంటారనే విషయాన్ని బీసీలు గుర్తించాలన్నారు. మహనీయుల చరిత్ర చెప్పడం మూలంగానే కాంగ్రెస్ పార్టీలో ఐదు, పది శాతం మందికి పదవులు ఇచ్చి గౌరవిస్తున్నారని చాటి చెప్పాలన్నారు. బీసీలు మహనీయుల చరిత్రను అర్థం చేసుకోవాలని, ఆ దిశగానే తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం మంథనిలోని జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తర్వాత సహపంక్తి బోజనం ఏర్పాటు చేయగా మంథని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ దీక్షాపరులకు బోజనం వడ్డించారు.



# డి-అడిక్షన్ సేవలు ప్రారంభించిన జిల్లా ఎస్పీ

- చెడు వ్యసనాలను వీడండి.. నవ సమాజాన్ని నిర్మించండి
- వ్యసన రహిత సమాజమే లక్ష్యం.. ప్రతి ఒక్కరూ చేయి కలపాలి

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డి–అడిక్షన్ (వ్యసన విముక్తి) సేవలను జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మనిషి జీవితం ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరం అని, కానీ క్షణిక ఆనందం కోసం మత్తు పదార్థాల మాయలో పడి ఎందరో తమ భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములమవుతామని అందరితో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారుఒక వ్యక్తి వ్యసనానికి బానిసైతే అది కేవలం అతని సమస్య మాత్రమే కాదు, మొత్తం కుటుంబం చీకట్లోకి నెట్టబడుతుందని, సమాజం శక్తిని కోల్పోతుందని హెచ్చరించారు. మత్తు కోరల్లో చిక్కుకున్న వారికి ఆశాదీపంలా నిలిచి, వారిని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఆసుపత్రిలో డి–అడిక్షన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. డ్రగ్స్, గంజాయి వంటి మహమ్మారుల నుంచి సమాజాన్ని రక్షించడానికి ప్రతి పౌరుడు తోడుగా ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అమలవుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రెండో అంతస్తులో ప్రత్యేక వార్డును కేటాయించి, సైకియాట్రిస్ట్ డాక్టర్ వివేక్ కుమార్ పర్యవేక్షణలో చికిత్స అందించడం హర్షణీయమని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ఈగల్ టీమ్ ద్వారా ప్రజల నుంచి వచ్చే సమాచారం కీలకమని, అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఎస్పీ చైతన్య రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ యాదగిరి, ఆర్ఎంఓ డాక్టర్ రవీందర్ గౌడ్, సైకియాట్రిస్ట్ డాక్టర్ వివేక్ కుమార్, పట్టణ ఎస్‌హెచ్‌ఓ నరహరి తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలేకు భారతరత్న ఇవ్వాలి

**ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్బిన్ హందాన్**



**నిజామాబాద్ సిటీ ఏప్రిల్ 11 (జనం సాక్షి) :** మహాత్మా జ్యోతిరావు పూలేకు భారతరత్న పురస్కారంతో గౌరవించాలని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్బిన్ హందాన్డిమాండ్ చేశారు. పూలే 199వ జయంతి సందర్భంగా సిరికొండలోని సత్యశోధక్ పాఠశాలలో శనివారం బడి రజతోత్సవాలతోపాటు జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తాహెర్ మాట్లాడుతూ.. పూలే దృష్టిలో నిజమైన స్వాతంత్ర్యం అంటే కేవలం రాజకీయ స్వేచ్ఛ కాదని, సామాజిక స్వేచ్ఛ కూడా అని పేర్కొన్నారు.ఉన్నత విద్యా మండలి మాజీ ఛైర్మన్ ఆచార్య లింబాద్రి మాట్లాడుతూ.. పూలే చూపిన దారిలో నడవాలంటే ముందుగా మనలోని వివక్ష భావాలను తొలగించుకోవాలని హితవు పలికారు. సమానత్వం, మానవత్వం అనే విలువలను మనమే ఆచరణలో పెట్టాలన్నారు.సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ సలహాదారు, పూలే--అంబేద్కర్ ఆలోచన వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య ఎం.ఏ. మహమ్మద్ అబ్దుల్ మాలిక్ మాట్లాడుతూ సృజనాత్మక వినాశ సిద్ధాంతం ("Creative Destructive Theory") గురించి వివరించారు. దేశం అభివృద్ధి చెందాలంటే పాత వ్యవస్థను తొలగించే సృజనాత్మక వ్యవస్థను రూపొందించాలని, ఆ బాధ్యత నేటి యువతపై ఉందని పేర్కొన్నారు.ఇటీవలే ప్రొఫెసర్గా పదోన్నతి పొందిన డా. మహమ్మద్ అబ్దుల్ మాలిక్ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్యశోధక్ పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్య, తెలంగాణ కాలేజియేట్ సంయుక్త సంచాలకులు ఆచార్య. బాలభాస్కర్, నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫోరం అధ్యక్షులు వీజీఆర్ నారగోని, సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ సలహాదారు అడ్వకేట్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని ఎన్పీడీసీఎల్ డిఈ కార్యాలయం ముందు సమ్మె శిబిరం వద్ద మహాత్మ జ్యోతిబాపూలే జయంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్లు అన్ మాండు,పీస్ రేట్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులు అనేక సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలు తీసుకుంటూ కుటుంబాలని పోషించుకుంటున్నారని వీరిని కనీసం ఉద్యోగులుగా చూడడం లేదని విమర్శించారు విధి నిర్వహణలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందిస్తున్న విద్యుత్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రాత్రింబవళ్లు సమాజ క్షేమం కోసం పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని లేని పక్షంలో జ్యోతిబాపూలే జయంతి స్ఫూర్తితో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గొర్రెంకల సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఏల్పుల సురేష్, బాబు రవి విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది

- మహిళా బిల్లు ఆమోదంతో రాజకీయ అధికారం
- బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



**హైదరాబాద్, ఏప్రిల్11 (జనంసాక్షి) :** పార్లమెంట్‌లో నారీ శక్తి వందనం బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 16వ తేదీన ప్రవేశ పెట్టనున్నారని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యానించారు. ఎన్నో ఏళ్లుగా ఈ బిల్లు కోసం మహిళలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఈ బిల్లు అమలైతే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ దక్కుతుందని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశాలు పెట్టారని.. ఈనెల 16, 17, 18 తేదీల్లో సెషన్ జరగనుందని వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఎంపీ డీకే అరుణ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌తో సహా అనేక పార్టీలు మహిళా బిల్లును వ్యతిరేకించాయని తెలిపారు. గతంలో చాలామంది ఈ బిల్లు తేవాలని చూశారు.. తప్పు ఎవరి వల్ల అది సాధ్యమవ్వలేదని.. కానీ మోదీ ఈ బిల్లును సుసాధ్యం చేయనున్నారని అన్నారు. చట్టం చేయడమే కాదని.. అమలు చేయడంపైనా కసరత్తు జరుగుతోందని చెప్పారు. పార్టీలకతీతంగా ఈ బిల్లుకు మద్దతు పలకాలని సూచించారు. మహిళలు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని ఎంపీ డీకే అరుణ ఆకాంక్షించారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ.. ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తోందని ఉద్ఘాటించారు. చట్టసభల్లో కూడా మహిళలు ఉంటే ఆయా ప్రాంతాలు, రాష్ట్రాల్లో వారికి ఇచ్చిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారని తెలిపారు. ఆర్థిక, విద్య, ఉపాధి వంటి అన్ని రంగాల్లో తమ మార్క్ చూపిస్తారని వివరించారు. భారత ఖ్యాతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్తా రన్నారు. ఈ బిల్లును అడ్డుకోవాలనే ఆలో చనను మార్చు కోవాలని చెప్పారు. మహిళలకు గౌరవాన్ని పెంచాలని సూచించారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి ఎంతో సమయం లేదని.. కానీ మహిళా శక్తికి రాజకీయ శక్తి తోడైతే వికసిత్ భారత్ లక్ష్యానికి సులువుగా చేరుకోవచ్చని వివరించారు. ఈ బిల్లుకు ఆమోదం తెలిపితే క్రెడిట్ బీజేపీకి ఎక్కడ పోతుందోనని ఆలోచించకుండా పార్టీలకతీతంగా మద్దతు తెలపాలని అన్నారు. మహిళలను తక్కువ అంచనా వేస్తున్నారనే అపవాదును దేశానికి తీసుకురావద్దని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా చూడాలని ఎంపీ డీకే అరుణ కోరారు. ఇది ఒక చట్టం కాదని.. కోట్లాది మంది మహిళల ఆశ, ఆశయమని ఉద్ఘాటించారు. చట్టానికి ఆమోదం తెలిపితే కొత్త శకానికి నాంది పలకనుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ నుంచి పార్లమెంట్‌లో ప్రస్తుతం ఇద్దరు మహిళలమే ప్రాతినిధ్యం వహిస్తున్నామని వివరించారు. ఈ బిల్లు అమలైతే స్థానాలు పెరుగుతాయని చెప్పుకొచ్చారు. డీ లిమిటేషన్ కూడా పూర్తయితే తెలంగాణ నుంచి 9 మంది మహిళలు పార్లమెంట్‌లో అడుగు పెడతారని తెలిపారు. తెలంగాణలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 180 వరకు పెరుగుతాయని.. అంటే 60 మంది మహిళలు అసెంబ్లీలో ఉంటారని ప్రస్తావించారు.ఎస్సీ, ఎస్టీలకు కూడా మంచి అవకాశాలు రానున్నాయని వివరించారు. ఇది తాత్కాలికం కాదని.. మూడు టర్మ్‌ల వరకు ఈ రిజర్వేషన్లు కొనసాగుతాయని వెల్లడించారు.

# అమిత్ షా వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

*కేంద్ర హోం మంత్రి అమిత్ షా సుప్రీం కోర్టు జడ్జి సుదర్శన్ రెడ్డి తదితరుల మీద అర్బన్ నక్సల్ అని చేసిన వ్యాఖ్యలు భారత ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వక్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హక్కుల సంఘాల ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.*

- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి టార్గెట్‌గా వ్యాఖ్యలు దుర్మార్గం
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఈ సమావేశంలో జస్టిస్ రజిని మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఉన్న నెరటివ్స్ చూస్తుంటే చనిపోయే స్థితిలో ఉన్న మనుషులు కూడా ఆందోళన చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇంతటి భయంకరమైన స్థితిలో మనం ఉన్నామన్నారు. దీనిలో భాగంగానే అమిత్ షా వ్యాఖ్యలు చూడాలన్నారు. ఇవి యాదృచ్ఛికంగానో అనుకో కుండా చేసినవి కాదని, ఒక గ్రౌండ్‌ను ప్రిపేర్ చేయడంలో భాగంగా ఇవి చేశారని అన్నారు. అర్టికల్ 121 ప్రకారం సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులను అభిశంసించే సమయంలో తప్ప వారి తీర్పులపై పార్లమెంట్లో చర్చించే అధికారం ఉండదని అన్నారు. న్యాయ వ్యవస్థను బలహీనపర్చడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని నేలమట్టం చేయాలనే ఉద్దేశంతో ఈ పని చేశారని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ రజనీ

ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ అమిత్ షా సుదర్శన్‌రెడ్డిపై చేసిన అర్బన్ నక్సలైట్ వ్యాఖ్యలు భవిష్యత్ భారత ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, దీనికి సమాధానం చెప్పవలసిన బాధ్యత మనలాంటి వారిపై ఉందని అన్నారు.

మానవహక్కుల సీనియర్ నాయకులు జీవన్‌కుమార్ మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థ నుండి న్యాయవ్యవస్థను కూడా కాపాడుకోవాల్సిన సందర్భమని, మేధావులు దీనిపై స్పందించాలని కోరారు.

సీనియర్ జర్నలిస్ట్, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అమిత్ షా పార్లమెంట్‌లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి పై వ్యాఖ్యలు చేయడం ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు.

సురేష్ కుమార్ మాట్లాడుతూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇచ్చిన తీర్పు ప్రజల పట్ల ప్రభుత్వ బాధ్యతను గుర్తింపజేసిందని, అరాచకంగా మనుషుల ను చంపడాన్ని వ్య తిరేకించిందని అన్నారు.

జి.రాములు మాట్లాడుతూ ఒక రాజకీయ ప్రత్యామ్నాయం పట్ల సమాజానికి, ప్రజలకు భరోసా కల్పించడం అభ్యుదయ, ప్రగతిశీల, వామపక్ష శక్తుల బాధ్యత అని మాట్లాడారు.

మలుపు బాల్‌రెడ్డి మాట్లాడుతూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి మీద అమిత్ షా వ్యాఖ్యలు దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, పౌరహక్కులని మాట్లాడే వారందరికీ సవాలు అని, దీనిని బద్దలు కొట్టవలసిన బాధ్యత అందరి మీద ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ కార్తీక్ నవయాన్, సీనియర్ అడ్వకేట్ నందిగం కృష్ణారావు, ప్రొఫెసర్ మురళి, ప్రొ. అన్వర్ ఖాన్, ప్రొ.వనమాల, అనిజ్, డేవిడ్, ప్రొ. డి. నరసింహారావు, ఎన్. వేణుగోపాల్, సుప్రీం కోర్టు అడ్వకేట్ మహదేవన్, అడ్వకేట్ నవీన్ సౌదా, అడ్వకేట్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదికి బెదిరింపులు

- గాయని మంగ్లీ తదితరులపై కేసు



**హైదరాబాద్, ఏప్రిల్11 (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల్లో ఫోక్ సాంగ్స్‌తో విశేష గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ గాయని మంగ్లీ ఇప్పుడు వివాదంలో చిక్కుకున్నారు. పెట్టుబడుల పేరుతో డబ్బులు సేకరించి మోసం చేయడం, అలాగే న్యాయవాదిని బెదిరించడం వంటి ఆరోపణలపై ఆమెపై కేసు నమోదవడం సంచలనంగా మారింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసు ప్రకారం, మంగ్లీ, ఆమె సోదరుడు శివ, మరికొంత మంది కలిసి సుమారు 100 మంది నుంచి భారీ మొత్తంలో నిధులు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామని నమ్మించి ఈ డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. అయితే, కాలం గడుస్తున్నా ఎటువంటి లాభాలు ఇవ్వకపోవడం మాత్రమే కాకుండా, పెట్టుబడిగా ఇచ్చిన అసలు డబ్బును కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో వారు ఆందోళన చెందుతూ న్యాయం కోసం న్యాయవాది సుబ్బారావును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో న్యాయవాది జోక్యం చేసుకోవడంతో వివాదం మరింత ముదిరింది. బాధితుల తరపున డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీయగా, మంగ్లీ మరియు ఆమె బృందం నుంచి బెదిరింపులు వచ్చాయని సుబ్బారావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా, ఈ కేసులో దర్శకుడు వేణు ఊడుగుల పేరు కూడా వెలుగులోకి రావడం గమనార్హం. మంగ్లీ, శివ, వేణు ఊడుగుల కలిసి ఫోన్ ద్వారా తీవ్రంగా బెదిరించారని, తనను యాక్సిడెంట్ చేయించి చంపేస్తామని హెచ్చరించారని న్యాయవాది ఆరోపించారు. ఈ నేపథ్యంలో తనకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ పోలీసుల వద్ద రక్షణ కోరారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టి, మంగ్లీ, శివ, వేణు ఊడుగుల మరియు ఇతరులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. వరుస హిట్ పాటలతో కెరీర్‌లో దూసుకుపోతున్న మంగ్లీపై ఈ తరహా ఆరోపణలు రావడం సినీ, సంగీత రంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో నిజానిజాలు ఏవో దర్యాప్తులో తేలాల్సి ఉంది. కాగా, తన పాటలతో మంచి ఫేమ్ అందిపుచ్చుకున్న మంగ్లీ వివాదాలతో ఇమేజ్ బ్యాడ్ చేసుకుంటుంది.

# అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ
- ఘనంగా పోషణ పక్వాడ కార్యక్రమ ప్రారంభోత్సవం



**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత అధ్యక్షతన పోషణ్ పక్వాడా కార్యక్రమం ప్రారంభోత్సవం, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మరియు సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని అంగనవాడి కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, త్వరలోనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 15 వేల అంగనవాడి టీచర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అంగన్వాడీల సంక్షేమం కోసం రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా అందజేస్తామని, గత ప్రభుత్వ హయాంలో రిటైర్ అయిన వారికి కూడా ఈ ప్రభుత్వం ఒక కొత్త జీవో తెచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేవిధంగా కృషి చేసిందని, ఆ ఘనత రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు దక్కుతుందని తెలిపారు. అంగన్ వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ ద్వారా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. దీనివల్ల గర్భిణీలు, బాలింతల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ విధానంలో త్వరగా నమోదు చేయవచ్చు అని, అంగనవాడి టీచర్ల పని భారం తగ్గించడానికి ప్రభుత్వ మొగ్గు చూపిందని, గతంలో అంగనవాడి టీచర్లు వారి కేంద్ర పరిధిలో నమోదైన లబ్ధిదారులకు అందిస్తున్న సేవలను సుమారు 16 రిజిస్టర్లలో నమోదు చేయాల్సి ఉండగా వారి పని భారం తగ్గించి కాలానుగుణంగా అత్యధిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన స్మార్ట్ ఫోన్లు ప్రభుత్వం అందజేసిందని, క్షేత్రస్థాయిలో అంగనవాడి టీచర్లు కేంద్రాలలో నమోదైన గర్భిణీలు, బాలింతలు పిల్లలకు సరైన సమయంలో సరైన పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి నాంది పలకాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పోషణ మాసం నిర్వహణ, పోషణ పక్వాడ నిర్వహణ, తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించడమే కాకుండా ఆ వివరాలు, ఆ ఫోటోలు ప్రభుత్వానికి అందజేయడంలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉండడం గర్వించదగ్గ విషయమని, జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క అంగనవాడి టీచర్లు ,హెల్పర్లు కేంద్రానికి వచ్చే లబ్ధిదారులకు పారదర్శకతతో కూడిన సేవలందిస్తున్నారని కొనియాడారు. ఈరోజు అంగనవాడి టీచర్ల స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రెండు కోట్ల మూడు లక్షల 50 వేల రూపాయల విలువైన అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడం జరిగిందని, ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులకు నాణ్యత, పారదర్శకత తో కూడిన సేవలు అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎడిషన్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రామసాయం నరేష్ రెడ్డి, సిడిపివోలు, ఏసిడిపివోలు, సూపర్వైజర్లు, అంగనవాడి టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

**హైదరాబాద్, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది. అతివేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో, ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు పాతబస్తీకి చెందిన అబ్దుల్ సోహెద్ (20) షేక్ సాహిల్ (17)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ వృత్తిరీత్యా ఎలక్ట్రిషియన్లుగా పనిచేస్తున్నట్లు సమాచారం. పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎక్సైజ్ కమిషనర్ తీరుతో మనస్తాపం

- ఉద్యోగానికి రాజీనామా చేసిన డిప్యూటి కమిషనర్



**నిజామాబాద్, ఏప్రిల్ 11 (జనంసాక్షి) :** జిల్లా ఎక్సైజ్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ మధ్య వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. ఎక్సైజ్ కమిషనర్ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి దూషిస్తున్నారని డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆరోపించారు. తన 30 ఏళ్ల సేవలను వదులుకుంటూ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమం ద్వారా ప్రకటించారు. ఎక్సైజ్ కమిషనర్ మాటలతో మనస్తాపం చెంది, ఆస్పత్రి పాలైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ కమిషనర్ మాటలు, వేధింపులు తట్టుకోలేకే ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సోమిరెడ్డి తెలిపారు. బదిలీల్లో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. లోయర్ క్యాడర్ ఉద్యోగుల ముందు కమిషనర్ ఇష్టానుసారం మాట్లాడడం బాధ కలిగించిందని భావోద్వేగానికి గురయ్యారు. ఆత్మాభిమానాన్ని చంపుకొని ఉద్యోగం చెయ్యలేనంటూ ప్రభుత్వానికి డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి లేఖ సైతం రాశారు.

# పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు

- విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తం
- అక్షరాస్యతలో వెనకబడుతున్న తెలంగాణ
- కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటన



**హైదరాబాద్, ఏప్రిల్11 (జనంసాక్షి) :** ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళు లర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం... మహాత్మా జ్యోతి రావు పూలే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు పూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహి స్తున్న విద్యా శాఖ పని తీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పుకొచ్చారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా కూడా లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు. పూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారని బండి సంజయ్ కుమార్ ప్రస్తావించారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు పూలే అని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పూలేను గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుందని అన్నారు. సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జా&ఝునాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్వాతంత్ర్యం రాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కీర్తించారు.

# విజయ్ 'జననాయగన్' లీక్‌తో బీజేపీకేం సంబంధం!

- కేంద్రమంత్రి మురుగన్‌పై ఆరోపణలు సరికాదు
- నేనూ విజయ్ అభిమానినే అన్న అన్నామలై



**కోయంబత్తూరు, ఏప్రిల్11 (జనంసాక్షి) :** సెన్సార్ బోర్డు సమస్యలతో విడుదలలో జాప్యమైన విజయ్ 'జననాయగన్' సినిమా ఇప్పుడు థియేటర్‌కు రాకుండానే ఇంటర్‌నెట్‌లో లీక్ కావడం హాట్‌టాపిక్ అయింది. దీనిపై దక్షిణాది పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు సోషల్ మీడియాలో ఘాటుగా స్పందించారు. దీనికి తాజాగా రాజకీయ రంగు కూడా పులుముకుంటోంది. ఈ చిత్రం ఆన్‌లైన్‌లో లీక్ కావడం వెనుక కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పాత్ర ఉందంటూ టీవీకే ఆరోపణలు చేసింది. అయితే ఈ రోపణలను తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై వెంటనే ఖండించారు. ఇవి రాజకీయ దిగజారుడు ఆరోపణలుగా కొట్టివేశారు. 'జననాయగన్' సినిమా లీక్ కావడం చట్టవిరుద్ధమైన చర్య అని, ఈ చిత్రం పైరేటెడ్ వెర్షన్‌కు ప్రజలు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కోయంబత్తూరులో పార్టీ అభ్యర్థి తరఫు ప్రచారం సాగిస్తున్న అన్నామలై శనివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఈ వివాదంలోకి బీజేపీని ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. సినిమాల విడుదల, లీక్ వ్యవహారాల్లో పార్టీకి ఎలా ప్రమేయం ఉంటుందని నిలదీశారు. వదంతులు వ్యాప్తి చేస్తున్న వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీని ఇందులోకి లాగడం సరికాదని చెప్పారు. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రిగా ఉన్న మురుగన్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)పై తన పరపతిని ఉపయోగించి సినిమాను లీక్ చేయించారని ఈనెల 10న టీవీకే నేత ఆధవ్ అర్జున ఆరోపించారు. థియేటర్‌లో విడుదలకు ముందే ఆన్‌లైన్‌లో సినిమా లీక్ అయ్యేందుకు ఆయన ఉదయనిధి స్టాలిన్ సహకారం తీసుకున్నారని అన్నారు. దీనిపై అన్నామలై స్పందిస్తూ, టీవీకే మద్దతుదారులు, నేతలు కొందరు వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. సీబీఎఫ్‌సీని బీజేపీ కంట్రోల్ చేయదని, సినిమా ప్రొడక్షన్ విషయంలో కానీ, విడుదల విషయంలో కానీ బీజేపీ ప్రమేయం లేదని స్పష్టంచేశారు. విజయ్ అభిమానులలో తాను కూడా ఉన్నానని, అధికారికంగా సినిమా విడుదల కాగానే థియేటర్‌కు వెళ్లి సినిమా చూస్తానని అన్నామలై చెప్పారు. ఒక సినిమా వెనుక ఎంతోమంది కష్టం, ప్రొడక్షన్ కంపెనీల పెట్టుబడులు వంటివి ఎన్నో ఉంటాయని, ప్రజలు ఆన్‌లైన్‌లో లీక్ అయిన వీడియోలను చూడకుండా వాటికి దూరంగా ఉండాలని కోరారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370